www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
26-12-2024
సంపుటి : 01 | సంచిక : 234 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS

డా॥ కాచం సత్యనారాయణ
CMD

## మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు

### పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చాను

- సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చాను
- మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించాం
- ఇందిరమ్మ ఇళ్లలో దళిత, గిరిజన క్రైస్తవులకు అత్యధికంగా లబ్ధి
- క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి



**విశ్వంభర, మెదక్:** వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు. మిగతా2లో...

## అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్

- ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు
- ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ నిజస్వరూపాన్ని తెలియజేయాలి
- అంబేడ్కర్‌ను కాంగ్రెస్ ఓడించింది
- దేశ ప్రజల స్ఫూర్తి ప్రదాత వాజ్‌పేయి
- వాజ్ పేయి శతజయంతి వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి


2



# మాది సుపరిపాలన ప్రభుత్వం

### మేధావులు..ఇతర పార్టీల పాలనతో మా పాలనను పోల్చిచూడండి

- బీజేపీ ఉన్న చోట్ల అభివృద్ధి ఎలా జరిగిందో విశ్లేషించాలి
- మా పార్టీ ప్రజల కోసం కట్టుబడి ఉంది
- ప్రభుత్వ ఫలాలు ప్రజలకు ఎంత వరకు చేరాయి అన్నదే ప్రామాణికం
- కాంగ్రెస్ సర్కారు కేవలం అభివృద్ధి ప్రకటనల హడావుడికే పరిమితం
- దేశాభివృద్ధిలో అటల్ బిహారీ వాజ్‌పేయిది కీలక పాత్ర
- కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



**ఖజురహో:** స్వాతంత్ర్యం వచ్చాక బీజేపీ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధిని ఇతర పార్టీల పాలనతో పోల్చి చూడాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ఆయన బుధవారం ఖజురహోలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రెండు నదుల జలాలను ఆయన ప్రాజెక్టు నమూనాలో పోశారు. అనంతరం రిమోట్ బటన్ సాయంతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. ''బీజేపీ ప్రభుత్వానికి మిగతా2లో...

### మహా కుంభమేళా కోసం..

## అండర్‌వాటర్ డ్రోన్లు

- గంగానదిలో పరీక్షించిన అధికారులు
- ఈ డ్రోన్లు నీటి అడుగున ఉన్న వస్తువులను గుర్తించగలవు
- జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 కొనసాగనున్న మహాకుంభమేళా


2

## తెలంగాణలో ప్రజాపాలన ఫేక్

- రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ చేపట్టిన కార్యక్రమాలను అభినందిస్తున్నా
- ప్రజాప్రభుత్వంలో ఉత్తమ పనితీరు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా
- పొన్నం లేఖకు రాహుల్ గాంధీ రిప్లై


2



### వేగంగా అభివృద్ధి చెందుతోన్న రాష్ట్రం

# తెలంగాణ

- ప్రభుత్వం ఒక కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని ప్రతిపాదించింది
- 2030 నాటికి 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశ్వంభర, హైదరాబాద్:** హరిత ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, జాతీయ స్థాయిలో పెట్టుకున్న లక్ష్యాన్ని అందుకోడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని ప్రతిపాదించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2030 నాటికి స్వచ్ఛమైన, స్థిరమైన 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. మిగతా2లో...


12

### శ్రీతేజ్ కుటుంబానికి

## రూ.2కోట్ల సాయం

ప్రకటించిన అల్లు అరవింద్

కిమ్స్ ఆస్పత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించి, తండ్రి భాస్కర్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై వాకబు

## బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం ఇవ్వండి

- రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై భేటీలో చర్చ
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- ప్రధానిని కోరిన సీఎం చంద్రబాబు


2

### ప్రేమ పేరుతో వేధింపులు..

## యాసిడ్ తాగి యువతి మృతి



- మృతికి కారణమైన యువకుడిని అరెస్టు చేయాలి
- పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేసిన యువతి తల్లిదండ్రులు

2

మరిన్ని తాజా వార్తల కోసం
స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 103 | ₹ 125 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 179 | ₹ 205 |

### అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా

## అనుమానాలు

- సినీ పరిశ్రమ ఆంధ్రాకు పోవాలని కోరుకుంటున్నారు
- ఇండస్ట్రీ ఆంధ్రాకు తరలివెళ్తే తెలంగాణకే నష్టం
- అంబేడ్కర్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు
- ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి తాళాలు
- పంచ తీర్థాలను రాహుల్ గాంధీ దర్శనం చేస్కోవాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ నేతలకు అంబేడ్కర్ గురించి మాట్లాడే అర్హత లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ''ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి తాళాలు వేశారు. ఆయన మిగతా2లో...



### మహిళలను నమ్మించి మోసం చేసిన

## రేవంత్ రెడ్డి సర్కార్

- కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ ఎగిరిపోయాయి
- రాష్ట్రంలోని ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ. 30 వేలు బాకీ పడింది
- 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇవ్వలేదు
- తక్షణమే స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలి: మీడియాతో ఎమ్మెల్సీ కవిత

2

## తప్పుడు సమాచారం పోస్ట్ చేస్తే కఠిన చర్యలు

- ఉద్దేశపూర్వకంగా పోలీసు శాఖను బద్నాం చేసేలా తప్పుడు పోస్టులు పెడితే తీవ్రంగా పరిగణిస్తాం
- సంధ్య థియేటర్ ఘటనలో సోషల్ మీడియా పోస్ట్‌లపై పోలీసుల వార్నింగ్
- ఈ ఘటనకు సంబంధించి ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే మాకు అందించవచ్చు

HYDERABAD CITY POLICE

2

# మాది సుపరిపాలన ప్రభుత్వం

**(మొదటి పేజీ తరువాయి)**
రాష్ట్రంలో ఏడాది పూర్తయింది. ఈ కాలంలో ఇక్కడ అభివృద్ధికి కొత్త దిశ లభించింది. ఇక్కడ రూ.వేల కోట్ల విలువైన కార్యక్రమాలు మొదలయ్యాయి. నేడు కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు శంకుస్థాపన జరిగింది. దేశాభివృద్ధిలో అటల్ బిహారీ వాజ్‌పేయీ కీలక పాత్ర పోషించారు. సుశాసన్ దినోత్సవం మా ప్రభుత్వానికి ఒక్కరోజు కార్యక్రమం కాదు.. మా గుర్తింపు అది. దేశ ప్రజలు మూడోసారి కేంద్రంలో ఎన్డీయే సర్కారును ఎన్నుకొన్నారు. ఇక మధ్యప్రదేశలో వరుసగా మా పార్టీని ఎన్నుకోవడంలో సుపరిపాలన పాత్ర చాలా కీలకం. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని మేధావులు కొన్ని ప్రమాణాలను తీసుకొని.. కాంగ్రెస్, లెఫ్ట్, కుటుంబ, సంకీర్ణ పార్టీల పాలనలో ఏం పనులు జరిగాయి..? బీజేపీ ఉన్న చోట్ల అభివృద్ధి ఎలా జరిగిందో విశ్లేషించాలి. మా పార్టీ ప్రజల కోసం కట్టుబడి ఉంది. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు ఎంత వరకు చేరాయి అన్నదే ప్రామాణికం. కాంగ్రెస్ సర్కారు కేవలం అభివృద్ధి ప్రకటనల హడావుడికే పరిమితమయ్యేది. ఆ పథకాల ఫలాలు ప్రజలకు చేరేవి కావు. ఏళ్ల క్రితం శంకుస్థాపనలు అయిన వాటి పని కూడా ఒక్క అంగుళం ముందుకు జరగకపోవడాన్ని మేము గమనించాము. మా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తప్పించాము. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జల్‌శక్తిపై ఎవరు పనిచేశారో తెలుసా.. వాస్తవాలను ఇన్నాళ్లూ దాచిపెట్టారు. భారత జల్‌శక్తి, డ్యామ్‌ల వెనుక ఘనత బాబా సాహెబ్ అంబేద్కర్‌కు చెందుతుంది'' అని అన్నారు. అంతకు ముందు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పేరిట తపాల బిళ్ల, రూ.100 నాణెంను ప్రధాని మోదీ విడుదల చేశారు. నదుల అనుసంధానంలో మొదటిదైన కెన్-బెత్వా పథకం వల్ల ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు, ప్రత్యేకించి వెనకబడిన బుందేల్‌ఖండ్ ప్రాంతానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. 2009లోనే అప్పటి కేంద్రప్రభుత్వం దీన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. మొత్తం ఒకేసారి కాకుండా దశలుగా విభజించి పనులు చేపట్టాలని నిర్ణయించింది. మొదటి దశకు 2017 జూన్‌లో పెట్టుబడి అనుమతి లభించింది.



# మహా కుంభమేళా కోసం.. అండర్‌వాటర్ డ్రోన్లు

**ప్రయాగ్‌రాజ్:** ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా కోసం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈక్రమంలో గంగానదిలో అండర్‌వాటర్ డ్రోన్‌ను అధికారులు పరీక్షించారు. ''మహాకుంభ్‌ను విజయవంతం చేసేందుకు యూపీ ప్రభుత్వం కొత్త టెక్నాలజీని ఉపయోగిస్తోంది. తొలిసారిగా అండర్‌వాటర్‌డ్రోన్‌ను పరీక్షించాం. ఇది నీటి అడుగున ఉన్న వస్తువులను గుర్తించగలదు. ఎవరైనా నీళ్లలో మునిగిపోతే వెంటనే డైవర్ల సాయంతో ఆ ప్రాంతానికి చేరుకోవడానికి వీలుకలుగుతుంది'' అని అధికారులు మీడియాకు వెల్లడించారు.జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఈ మహా కుంభమేళా కొనసాగనుంది. ప్రతి 12 సంవత్సరాలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది యాత్రికులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటారు. ఈసారి దాదాపు 45కోట్ల మంది యాత్రికులు, సాధువులు, సన్యాసులు, పర్యటకులు రానున్నట్లు యూపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ''దీనిని స్వచ్ఛంగా, ఆరోగ్యంగా, సురక్షిత, డిజిటల్ కార్యక్రమంగా మార్చేందుకు యూపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. గతంలో కంటే అద్భుతంగా జరుగుతుంది'' అని యూపీ జల్‌శక్తి మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్ ఇటీవల వెల్లడించారు.

## తెలంగాణలో ప్రజాపాలన భేష్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాసిన లేఖపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇందిరమ్మ రాజ్యంలో రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో మరింత ముందుకు వెళ్తామని పేర్కొంటూ మంత్రి పొన్నం.. రాహుల్ గాంధీకి లేఖ రాశారు. రాహుల్ నాయకత్వంలో ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా.. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ విజయవంతంగా ముందుకు వెళ్తున్నట్లు లేఖలో ప్రస్తావించారు. పొన్నం ప్రభాకర్ రాసిన లేఖకు స్పందిస్తూ.. రాహుల్ గాంధీ తిరిగి లేఖ రాశారు. హామీలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతోన్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ చేపట్టిన కార్యక్రమాలను తాను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని.. ప్రజాప్రభుత్వంలో ఉత్తమ పనితీరు ఇలాగే కొనసాగాలని ఆకాక్షిస్తున్నట్లు లేఖలో వెల్లడించారు.

## బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యం ఇవ్వండి..

**ఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో ఏపీ సీఎం చంద్రబాబు సమావేశం ముగిసింది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై భేటీలో చర్చించినట్టు సమాచారం. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం కోరినట్టు తెలిసింది. గత ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పోలవరం ప్రాజెక్టు పనుల్లో పురోగతిని చంద్రబాబు వివరించినట్టు సమాచారం. దాదాపు గంటకు పైగా ప్రధానితో చంద్రబాబు సమావేశం కొనసాగింది. కాసేపట్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ కానున్నారు.

## ప్రేమ పేరుతో వేధింపులు.. యాసిడ్ తాగి యువతి మృతి

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డిగ్రీ విద్యార్థిని చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. న్యూ భవానీ నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థిని పూర్ణిమ.. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి రాగానే యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ప్రేమ పేరుతో నిఖిల్ అనే యువకుడు వేధిస్తున్నాడని, అతని వేధింపులు తట్టుకోలేక తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు ఆరోపించారు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జవహర్‌నగర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాన్ని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన కుటుంబసభ్యులు.. ఆందోళనకు దిగారు. తమ కుమార్తె మరణానికి కారణమైన యువకుడిని ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని.. నిందితుడిని అరెస్టు చేస్తామని పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

## మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు

**(మొదటి పేజీ తరువాయి)**
పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చానని.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చానని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లలో దళిత, గిరిజన క్రైస్తవులకు అత్యధికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10లక్షలకు పెంచామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం వివరించారు.

## అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు

**(మొదటి పేజీ తరువాయి)**
చరిత్ర తెలిపేలా ఉన్న గదుల్లోకి వెళ్లనివ్వడం లేదు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదు. బీజేపీ ఒత్తిడి మేరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ విగ్రహ నిర్మాణం పూర్తి చేసింది. అంబేద్కర్‌కు సంబంధించిన పంచ తీర్థాలను రాహుల్ గాంధీ దర్శనం చేస్కోవాలి. అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు వస్తున్నాయి. సినీ పరిశ్రమ ఆంధ్రాకు పోవాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారు. ఇండస్ట్రీ ఆంధ్రాకు తరలివెళ్తే తెలంగాణకే నష్టం. మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడకుండా వారి అధిష్ఠానం అదుపులో పెట్టాలి'' అని బండి సంజయ్ అన్నారు.

## వేగంగా అభివృద్ధి చెందుతోన్న రాష్ట్రం తెలంగాణ

**(మొదటి పేజీ తరువాయి)**



దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ గరిష్ఠ విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందన్నారు. 2023-24లో 15,623 మెగావాట్లు, 2027-28లో 20,968 మెగావాట్లు, 2034-35లో 31,809 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ - 2024పై వచ్చే నెల 3న హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్లో వాటాదారుల సమావేశం నిర్వహిస్తున్నామని భట్టి తెలిపారు.

# అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. అంబేద్కర్ బతికినన్ని రోజులు ఆయన్ను కాంగ్రెస్ అవమానించిందని అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసిన అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఓడించిందని తెలిపారు. మంత్రిగా ఉన్న అంబేద్కర్‌తో నెహ్రూ రాజీనామా చేయించారని పేర్కొన్నారు.1954 నుంచి 88 వరకు నెహ్రూ, ఇందిరాగాంధీ సహా 21 మందికి కాంగ్రెస్ భారతరత్న ఇచ్చిందని.. కానీ అంబేద్కర్‌ను ఎందుకు విస్మరించిందో సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో అంబేద్కర్ ఫొటో కూడా ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న పార్టీ బీజేపీ అని కిషన్ రెడ్డి తెలిపారు. అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. దేశ ప్రజల స్ఫూర్తి ప్రదాత వాజ్‌పేయీ అని.. భారత దేశ వైభవాన్ని, నైతిక విలువలకు ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. ఆయన ఎప్పుడూ పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పనిచేశారని చెప్పారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోయినా ప్రజా తీర్పు కోరి మళ్లీ అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం వాజ్‌పేయీ ఆశయాలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని చెప్పారు. కుటుంబ రాజకీయాలకు కాంగ్రెస్ తీసుకొచ్చిందని మండిపడ్డారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.


# మహిళలను నమ్మించి మోసం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్



**హైదరాబాద్:** రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలను నమ్మించి మోసం చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ ఎగిరిపోయాయని ఆమె ఎద్దేవా చేశారు. మెదక్ చర్చిని సందర్శించిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని సీఎం ప్రకటిస్తారని మహిళలకు ఆశించారు. కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటన చేస్తారని ఊహించారు. కానీ ప్రభుత్వం ఎటువంటి ఆలోచన చేయడం లేదు. రాష్ట్రంలోని ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ. 30 వేలు బాకీ పడింది. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇవ్వలేదు. తక్షణమే స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 శాతం నేరాలు పెరిగాయి. నేరాల పెరుగుదల.. ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సోయి ప్రభుత్వానికి లేదు. మహిళలు చూస్తూ ఊరుకోబోరు.. కచ్చితంగా ప్రశ్నిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టింది. తక్షణమే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి. రైతు భరోసా కింద అర్హులను తగ్గించే ప్రయత్నం చేయవద్దు. కేంద్ర ప్రభుత్వపు నిబంధలను అమలు చేస్తే 30 శాతం రైతులకు కూడా రైతు భరోసా రాదని కవిత పేర్కొన్నారు. మొక్కజొన్నలు, కందులు, సోయాబీన్, పత్తి వంటి పంటలను మద్దతు ధరను పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైంది..? ఏడాది కాలంగా ఏ ఒక్క పంటకు మద్దతు ధర ఇవ్వడం లేదు. చక్కెర ఫ్యాక్టరీలను ఎప్పుడు ఓపెన్ చేస్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సిందే.తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని కవిత డిమాండ్ చేశారు.తెలంగాణకు తలమానికం మెదక్ చర్చి. బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు క్రైస్తవులకు పేగుబంధం ఉంది. తెలంగాణ కోసం ప్రార్థన చేయని చర్చి లేదు. మత సహనానికి నిదర్శనం మెదక్. మెదక్ జిల్లాను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. కేసీఆర్ గోదావరి జలాలతో సింగూరును నింపారు. మెదక్‌కు నీళ్లు వచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను ప్రభుత్వం నిలిపివేయడం దారుణం. కేసీఆర్‌పై కోపాన్ని మెదక్ ప్రజలపై తీర్చుకుంటే ఏమొస్తుంది..? కాళేశ్వరం ప్యాకేజీ 19 పనులను కొనసాగించాలి అని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

# తప్పుడు సమాచారం పోస్ట్ చేస్తే కఠిన చర్యలు

- ఉద్దేశపూర్వకంగా పోలీసు శాఖను బద్నాం చేసేలా తప్పుడు పోస్ట్‌లు పెడితే తీవ్రంగా పరిగణిస్తాం
- సంధ్య థియేటర్ ఘటనలో సోషల్ మీడియా పోస్ట్‌లపై పోలీసుల వార్నింగ్
- ఈ ఘటనకు సంబంధించి ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే మాకు అందించవచ్చు'




**విశ్వంభర, హైదరాబాద్:** సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో ఎవరైనా తప్పుడు సమాచారం పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.''తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో పాటు ప్రజలను అపోహలకు గురిచేసేలా వీడియోలు పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నటుడు అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగినట్లు కొందరు తప్పుడు వీడియోలు పోస్ట్ చేసిన అంశం మా దృష్టికి వచ్చింది. ఘటనపై విచారణ క్రమంలో తెలిసిన నిజాలను వీడియో రూపంలో పోలీసుశాఖ ఇప్పటికే ప్రజల ముందు ఉంచింది. ఉద్దేశపూర్వకంగా పోలీసు శాఖను బద్నాం చేసేలా తప్పుడు పోస్ట్‌లు పెడితే తీవ్రంగా పరిగణిస్తాం. ఈ ఘటనకు సంబంధించి ఏ పౌరుడి దగ్గరైనా ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే మాకు అందించవచ్చు'' అని నగర పోలీసులు పేర్కొన్నారు.



## ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్న సీఎం రేవంత్

**విశ్వంభర, ఏడుపాయల:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఏడుపాయలలో వనదుర్గామాతను ఆయన దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించనున్నారు.

## అంతరిక్షంలో భారీ రిజర్వాయర్..

- భూమిపైనున్న మహాసముద్రాలకంటే 140 ట్రిలియన్ రెట్లు పెద్దది
- ఇది ఓ సూపర్ మాసివ్ బ్లాక్ హోల్‌కు దగ్గరలో ఉంది
- మన సూర్యుడి కంటే దాదాపు 20 బిలియన్లు పెద్దది
- గుర్తించిన జెట్ ప్రొపల్షన్ ల్యాబ్..



**ఢిల్లీ:** అంతరిక్షంలో పెద్ద పరిమాణంలో ఉన్న రిజర్వాయర్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. దాని పరిమాణం భూమిపైనున్న మహాసముద్రాలకంటే 140 ట్రిలియన్ రెట్లు పెద్దగా ఉంటుంది. ఇది ఓ సూపర్ మాసివ్ బ్లాక్ హోల్‌కు దగ్గరలో ఉంది. మన సూర్యుడి కంటే దాదాపు 20 బిలియన్లు పెద్దది. కాలిఫోర్నియాలోని పసాదేనాలోని నాసాకు చెందిన జెట్ ప్రొపల్షన్ లాబోరేటరీ శాస్త్రవేత్తల బృందం దాన్ని గురించింది. ప్రస్తుతం ఈ రిజర్వాయర్ భూమికి 12 బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నది. విశ్వం ఆవిర్భవించిన కొద్ది కాలానికే ఇక్కడ నీరు ఉన్నట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. క్వాసర్ అనే బ్లాక్‌హోల్ చుట్టూ ఉన్నది. ఇది వేల ట్రిలియన్ సూర్యులకు సమానమైన శక్తిని విడుదల చేస్తుంది. ఇది విశ్వంలో ఇప్పటివరకు గుర్తించిన అతిపెద్ద నీటి రిజర్వాయర్ ఇదే. శాస్త్రవేత్తలు క్వాసార్ చుట్టూ ఉన్న వాతావరణంలో నీటి ఆవిరిని గుర్తించారు. ఆ ఆవిరి వందల కాంతి సంవత్సరాల వరకు విస్తరించి ఉంది. ఒక కాంతి సంవత్సరం ఆరు ట్రిలియన్ మైళ్లకు సమానం.

## గోవా తీరంలో మునిగిన పర్యాటకుల బోటు

**కలంగుటే:** గోవాలో పర్యాటకుల బోటు ప్రమాదానికి గురైంది. ఉత్తర గోవాలోని కలంగుటే బీచ్ సమీపంలో మునిగిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో 20 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వీరిలో కొందరిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమయంలో ఇద్దరు మినహా అందరూ లైఫ్ జాకెట్లు ధరించారని పోలీసులు వెల్లడించారు.పర్యాటకులతో వెళ్తున్న పడవ తీరానికి 60 మీటర్ల దూరంలో ప్రమాదానికి గురైంది. దీంతో అందులో ఉన్న ప్రయాణికులంతా మునిగిపోయారు. ఇది గమనించిన తీరప్రాంత గస్తీ దళం వెంటనే స్పందించింది. 18 మంది బృందంతో ఘటనా ప్రదేశానికి చేరుకొని, వారినంతా ఒడ్డుకు చేర్చింది. మొత్తంగా 20 మందిని కాపాడగా..అందులో ఇద్దరు చిన్నారులు, మరో ఇద్దరు మహిళలను ఆసుపత్రికి తరలించారు. 54ఏళ్ల ఓ వ్యక్తి మాత్రం ప్రాణాలు కోల్పోయినట్లు రెస్క్యూ బృందం వెల్లడించింది. పడవలో ఉన్నవారిలో 13 మంది ఒకే కుటుంబానికి చెందినవారని తెలిపింది.



# కజికిస్థాన్ విమాన ప్రమాదంలో 42 మంది దుర్మరణం..!



**కజకిస్థాన్:** కజకిస్థాన్‌లో జరిగిన విమాన ప్రమాదంలో 42 మంది మరణించినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. మొత్తం 25 మందిని ప్రాణాలతో బయటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. వారిలో 11 ఏళ్ల బాలిక, 16 ఏళ్ల బాలుడు సహా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ప్రమాదానికి గురైన సమయంలో విమానంలో 62 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బంది సహా 67 మంది ఉన్నట్లు అధికారులు తెలియజేశారు. కజకిస్థాన్‌లోని అక్టౌ నగరలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ కు చెందిన విమానం అజర్‌బైజాన్‌లోని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీ కి వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. గ్రోజ్నీలో దట్టమైన పొగమంచు కారణంగా విమానాన్ని 1800 కిలోమీటర్ల దూరంలోగల కజకిస్థాన్లోని అక్టౌ విమానాశ్రయానికి మళ్లించారు. అక్టౌ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు పైలట్ ప్రయత్నించారు. అందుకోసం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతి కోరారు. ఇంతలో విమానం అక్టౌ విమానాశ్రయం పైకి వచ్చి చక్కెర్లు కొడుతూ కుప్పకూలింది. కూలడానికి ముందు విమానం పలుమార్లు కిందకు వచ్చి, పైకి వెళ్లడాన్ని చూస్తుంటే అందులో ఆఖరి నిమిషాల్లో ఏదో సాంకేతిక లోపం తలెత్తినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరగగానే కజకిస్థాన్‌కు చెందిన రెస్క్యూ టీమ్స్ ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. విమానం నుంచి 25 మంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. వారిలో తీవ్రంగా గాయపడిన ఐదుగురిని చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మరో 42 మంది మృతదేహాలను వెలికితీశారు.

# రేపిస్టులు, హంతకులను క్షమించేది లేదు.. వారికి మరణ శిక్షే : డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరికొన్ని రోజుల్లో అధ్యక్ష బాధ్యతల నుంచి వైదొలగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తనకున్న అధికారాలతో వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న అనేక మందికి క్షమాభిక్ష ప్రసాదిస్తున్నారు. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం ఫెడరల్ మరణశిక్షను ఎదుర్కొంటున్న 40 మంది ఖైదీల్లో 37 మందికి శిక్ష తగ్గించిన విషయం తెలిసిందే.

అయితే, బైడెన్ చర్యను కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఫెడరల్ ఖైదీల విషయంలో కఠినంగా ఉండాలని స్పష్టం చేశారు. తాను బాధ్యతలు చేపట్టాక అలాంటి వారిని క్షమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక రేపిస్టులు, హంతకులకు మరణ శిక్ష అమలు చేస్తానని స్పష్టం చేశారు. ఈ విషయంపై న్యాయ శాఖను ఆదేశిస్తానని తెలిపారు. దేశంలో మళ్లీ శాంతి భద్రతలను పునరుద్ధరిస్తానని వెల్లడించారు. మరణశిక్షలకు సంబంధించి అమెరికాలో ఆయా రాష్ట్రాల్లో వేర్వేరు నిబంధనలు ఉన్నాయి. మొత్తం 50 రాష్ట్రాల్లో 23 రాష్ట్రాలు మరణశిక్షను రద్దు చేశాయి. మరో ఆరు రాష్ట్రాలు తాత్కాలికంగా నిలిపివేశాయి. మిగతా రాష్ట్రాల్లో మరణశిక్ష అమలవుతోంది. అయితే, తోటి ఖైదీలను హతమార్చిన వారికి, బ్యాంకు దోపిడీల సమయంలో హత్యలు చేసిన వారికి మరణ శిక్ష విధిస్తున్నాయి. 1988 నుంచి ఇప్పటి వరకు 79 మందికి న్యాయస్థానాలు మరణశిక్ష విధించగా.. కేవలం 16 మందికి మాత్రమే శిక్ష అమలు చేశారు. అందులోనూ ట్రంప్ తొలిసారి ప్రెసిడెంట్ అయ్యాక ఆరు నెలలలోనే 13 మందికి మరణ శిక్ష అమలు చేశారు. ప్రస్తుతం మరణ శిక్ష పడిన ఖైదీల సంఖ్య 40 ఉండగా.. వీరిలో 37 మందికి తాజాగా బైడెన్ క్షమాభిక్ష ప్రసాదించారు.

## ఒక్క ఓటుతో అధికారం కోల్పోయినా .. వాజ్‌పేయీ రాజనీతి తప్పలేదు

**- అనురాగ్ ఠాకూర్**



**విశ్వంభర, హైదరాబాద్:** పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయీ మధ్య మంచి అనుబంధం ఉండేదని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ గుర్తు చేశారు. కార్పొరేటర్ నుంచి ప్రధాని వరకు ఎదిగిన వ్యక్తి వాజ్‌పేయీ అని కొనియాడారు. మాజీ ప్రధాని వాజ్‌పేయీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా భాజపా రాష్ట్ర కార్యాలయంలో సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి అనురాగ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాజ్‌పేయీ ఆశయాలను ప్రధాని మోదీ నెరవేరుస్తున్నారన్నారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోతున్నామని తెలిసినా వాజ్‌పేయీ రాజనీతి తప్పలేదని కొనియాడారు. జనతా పార్టీలో విదేశాంగ మంత్రిగా, భాజపా వ్యవస్థాపక అధ్యక్షుడిగా, ప్రధానిగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కిందని కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో పాస్‌పోర్టు రావాలంటే ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేదని, ఆయన విదేశాంగ మంత్రిగా అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. నిస్వార్థంగా, సిద్ధాంతాల కోసం పనిచేసే లక్షమంది యువతను రాజకీయాల్లోకి తీసుకురావాలనేది వాజ్‌పేయీ కల అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో జాయ్ జెమీయా హనీట్రాప్...


### మరో ముగ్గురు నిందితులు అరెస్ట్

**విశ్వంభర, మాధవధార (విశాఖపట్నం):** హనీట్రాప్ నిందితురాలు కొరుప్రోలు జాయ్ జెమీయా కేసులో ముఠా సభ్యులుగా ఉన్న మరో ముగ్గురిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఫాతిమా ఉస్మాన్ చౌదిరి అలియాస్ జోయా, ఆమె భర్త తన్వీర్, అవినాష్ బెంజిమన్‌లను హైదరాబాద్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అక్కడి కోర్టులో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం పీటీ వారెంట్‌పై వీరిని విశాఖ కేంద్ర కారాగారానికి తీసుకువచ్చారు. బాధితుల మీద ఉపయోగించిన మత్తు పదార్థాలు, స్ప్రేలు సరఫరా చేయడంలో ఈ ముగ్గురు నిందితులు కీలక పాత్ర పోషించారని, ఇందుకుగాను భారీ మొత్తంలో నగదు బదిలీ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. వారి నుంచి స్ప్రేలు, వివిధ రకాల మత్తు పదార్థాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్లలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి హైదరాబాద్ వెళ్లి నిందితులను పట్టుకున్నారు. ఇదే కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వేణు భాస్కరరెడ్డిని నవంబర్ 30న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

**జాయ్ జెమీయా దందా ఇలా...**

హైదరాబాద్‌కు చెందిన బాధితుడు విశాఖలోని ఒక కంపెనీలో పని చేసేవాడు. కంపెనీ యజమాని బంధువుగా వచ్చిన జామ్ జెమీయా ప్రాజెక్టు హెడ్‌గా తనను నియమించారని, వర్క్ కోసం ప్రతి రోజు బాధితుడి వద్దకు వచ్చి పరిచయం పెంచుకుంది. బాధితుడి ముఖంపై మత్తు స్ప్రే చల్లి, జ్యూస్‌లో మత్తు మందు ఇచ్చి ఆమెతో సన్నిహితంగా ఉన్నట్లుగా ఫొటోలు తీసింది. అప్పటి నుంచి ప్రతిసారీ వేధింపులకు గురిచేస్తూ, అందినకాడికి దోచుకుంది. నగదు ఇవ్వలేని పక్షంలో ఇద్దరూ కలిసి తీసుకున్న ఫొటోలను అతడి భార్య, బంధువులకు పంపిస్తానని బెదిరించేది. దీంతో ఆమె అడిగినంత నగదును ఇచ్చేవాడు. చివరిగా రూ.3 కోట్లు ఇస్తే పూర్తిగా వదిలేస్తానని చెప్పడంతో, ఆ నగదు సమకూరుస్తానని నమ్మబలికి బంగారం, డబ్బులు, ల్యాప్‌టాప్ తీసుకొని హైదరాబాద్ వెళుతుండగా అది తెలుసుకుని మార్గ మధ్యలో బాధితుడి కారుని ఆపి, అతడి వద్ద ఉన్న వస్తువులన్నీ లాక్కొని కత్తితో చంపేందుకు ఆమె, ఆమె సహచరులు ప్రయత్నించారు. దీంతో వెంటనే వారి నుంచి తప్పించుకొని బాధితుడు హైదరాబాద్ వెళ్లిపోయాడు. ఆమె చేతిలో మోసపోయిన ఎన్ఆర్ఐ యువకుడి ఘటన వెలుగులోకి వచ్చి ఆమెను పోలీసులు అరెస్ట్ చేయడంతో, బాధితుడు ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జాయ్ జెమీయా మోసాలు ఇలాంటివి మరిన్ని ఉన్నాయని, బయటకు వచ్చి ఫిర్యాదు చేస్తే పరువు పోతుందని బాధితులు వెనుకంజ వేస్తున్నట్టు సమాచారం.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పోలీసుల నోటీసులు



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి బంజారాహిల్స్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని పేర్కొన్నారు. బంజారాహిల్స్ పీఎస్‌లో విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైన విషయం తెలిసిందే.

## అన్నిమతాలకు ప్రాధాన్యత పెంచిన ఘనత కేసీఆర్‌దే



**- ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి**

**విశ్వంభర, సూర్యాపేట :** యేసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయమని.. అందరి ప్రార్థనలు ఫలించి ప్రశాంతంగా జీవించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నిర్మల మాతా చర్చ్, సిల్వి సిలోయం చర్చ్, గ్రేస్ చర్చ్, మన్నా చర్చ్, సెయింట్ బాప్టిస్ట్ చర్చిలలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని మతాల ప్రధాన పండగలను అధికారికంగా నిర్వహిస్తూ వాటి ప్రాధాన్యత పెంచిన ఘనత కేసీఆర్‌దే అని స్పష్టం చేశారు. గత పదేండ్లుగా ఆయా మతాల ప్రధాన పండుగలను అధికారికంగా నిర్వహించుకుంటూ మరింత ఐక్యతను పెంచుకున్నామన్నారు. క్రిస్మస్, రంజాన్, దసరా పండుగలకు ప్రత్యేక విందులు, దుస్తులు, సామాగ్రిని పంచుతూ గంగా, జమున, తహజీబ్‌లకు నిలయంగా తెలంగాణ సమాజాన్ని తయారు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అన్ని మతాల ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండి తెలంగాణ సమాజం మరింత అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమల్ల అన్నపూర్ణ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, నాయకులు నంద్యాల దయాకర్ రెడ్డి, ఉప్పల ఆనంద్, మారుపెద్ది శ్రీనివాస్ గౌడ్, నెమ్మది బిక్షం, జీడీ భిక్షం, తూడి నరసింహారావు, పూర్ణ శశికాంత్, తాహెర్ పాషా, బత్తుల జానీ, గండూరి కృపాకర్‌లతో పాటు ఆయా చర్చిల పాస్టర్లు, ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆ తప్పును సవరించండి..

**- బీఎస్ఎన్ఎల్ సీజీఎంకు మాజీ ఎంపీ వినోద్ లేఖ**

**విశ్వంభర, హైదరాబాద్ :** తాజాగా దేశంలో రోజురోజుకు సైబర్‌క్రైం కేసులు పెరుగుతూ పోతున్నాయి. వీటిని అరికట్టేందుకు గాను, ప్రజలను జాగృత పరిచేందుకు గాను ప్రస్తుతం నెట్‌వర్క్‌లు ఫోన్‌రింగ్ కావడానికి ముందు ప్రజలకు ఒక సమాచారాలను అందిస్తున్నాయని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ తెలిపారు. ఆ సమాచారం ఏమంటే... 'మీకు పోలీసులు, జడ్జిలు, వీడియో కాల్స్ చేస్తూ సైబర్ క్రైంలకు పాల్పడవచ్చు, అలాంటి కాల్స్ మీకేమైనా వస్తే వెంటనే అప్రమత్తమై సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇవ్వండి' అంటూ వినిపిస్తున్నది. అయితే, అందులో 'జడ్జిలు, పోలీసులే నేరుగా వీడియో కాల్ చేసి సైబర్ క్రైంలకు పాల్పడవచ్చు' అనే అర్థం వస్తున్నది. 'పోలీసులు, జడ్జిల పేరిట' అని రావాల్సిన సమాచారం తప్పుగా వస్తున్నది. ఆ తప్పును సవరించండి అని హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న బీఎస్ఎన్ఎల్ సీజీఎంకు వినోద్ కుమార్ లేఖ రాశారు. ఈ సమాచారం జడ్జిలను, పోలీసు అధికారులను కించపరిచే విధంగా ఉన్నది. ఈ తప్పుడు సమాచారాన్ని సరిచేయాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు మొబైల్ నెట్‌వర్క్‌ల కంపెనీలను కోరుతున్నాను అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

## భువనగిరి వద్ద ఘోర ప్రమాదం.. ఇద్దరు దుర్మరణం

**విశ్వంభర, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. భువనగిరి – బొమ్మపల్లి చౌరస్తాలో ఓ ఇన్నోవా కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఈ ఆరుగురు యాదగిరిగుట్ట దర్శనం అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గురైన ఇన్నోవా నంబర్.. ఏపీ 09 బీఎన్ 5568.

## బౌన్సర్ల దుకాణం పెట్టిందే రేవంత్ రెడ్డి..

**- ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు**


**విశ్వంభర, మెదక్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బౌన్సర్ల దుకాణం పెట్టిందే రేవంత్ రెడ్డి అని రఘునందన్ రావు పేర్కొన్నారు. ప్రయివేటు బౌన్సర్లను తీసుకువచ్చి నూకిపిచ్చే సంస్కృతి రాష్ట్రానికి తీసుకొచ్చిందే రేవంత్ రెడ్డి. పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు చుట్టూ బౌన్సర్లని పెట్టుకొని జనాలను పక్కకు నూకే కార్యక్రమం మొదలు పెట్టిందే రేవంత్ రెడ్డి. అల్లు అర్జున్ పంచాయితీలో బౌన్సర్లలను ఎందుకు తీసుకొస్తున్నారు? అని రఘునందన్ రావు ప్రశ్నించారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌కు చిత్తశుద్ధి ఉంటే బౌన్సర్ల వ్యవస్థను మొత్తం రద్దు చేయమని చెప్పండి అని ఎంపీ రఘునందన్ రావు సూచించారు.



## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన మేడే రాజీవ్ సాగర్




**విశ్వంభర, హైదరాబాద్ :** క్రిస్మస్ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిషప్ నెహేమియా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో క్రిస్టియన్ జేఏసీ నాయకులు సోలోమన్ రాజు, న్యూ లైఫ్ చర్చ్ బిషప్ నెహేమియా, క్యాథలిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ లియో లూయిస్ తదితరులు ఉన్నారు.






# ప్రకంపనలు సృష్టించిన దిగంబర కవిత్వం

## తెలుగు సాహిత్యంలో దిగంబర కవిత్వం ఓ సంచలనం






దిగంబర కవులు: నిఖిలేశ్వర్, భైరవయ్య, నగ్నముని, జ్వాలాముఖి, చెరబండ రాజు, మహాస్వప్న (ఈ ఫొటో 1969-70 నాటిదని నిఖిలేశ్వర్ జ్ఞాపకం)

సంప్రదాయ కవిత్వ నిబంధనలకు కట్టుబడి ఉండకుండా, బహిరంగ భావప్రకటనతో సృష్టించిన కవిత్వం..దిగంబర కవిత్వం. ఇది అశ్లీలతకు సానుకూలంగా ఉండకపోయినా, సాంప్రదాయ సరికొత్త భావాలు, యదార్థత, స్వేచ్ఛను ప్రతిబింబిస్తుంది. దీని ప్రధాన లక్ష్యం భావాలను నేరుగా, స్వతంత్రంగా వ్యక్తం చేయడం, సామాజిక పరిమితులను తాకట్టు పెట్టకుండా కొత్తదనం, నిజమైన అనుభవాలను ప్రతిపాదించడమే. తెలుగు సాహిత్యంలో దిగంబర కవిత్వం ఓ సంచలనం కలిగించింది.అభ్యుదయ కవిత్వంపై మొఖం మొత్తిన కొందరు కవులు కలిసి దిగంబరకవిత్వాన్ని రాశారు.1965 మే నెలలో దిగంబర కవిత్వం సునామీలా..విరుచుకు పడింది. అప్పట్లో చాలామంది కాకా కవులుగా,బాకా కవులుగా. ప్రభుత్వానికి కొమ్ముకాస్తుండటంతో విసుగెత్తిన ఆరుగురు కవులు కలిసిదిగంబర కవిత్వానికి శ్రీకారం చుట్టారు.కుళ్ళిపోతున్న వ్యవస్థపై తిరుగుబాటు ప్రకటించారు.

కవిత్వం అంటే ఏమిటి? అన్న ప్రశ్నకు జవాబు చెప్పడం ఏమంత సులువు కాదు. మనసులో ఎగసిపడిన భావాలను చరణబద్ధంగా అక్షరాలలోని ఒంపే ప్రక్రియ అనుకోవచ్చునేమో! కాకపోతే రానురానూ మనసులో మెదిలిన ప్రతి ఒక్క భావాన్నీ ఏదో ఒకలా వదిలించుకుని, దానినే కవిత అని పేరు పెట్టుకునే పరిస్థితులు వచ్చేశాయి. తెలుగునాట కవిత్వం చదివేవారి సంగతేమో కానీ, కవుల సంఖ్య మాత్రం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. సామాజికమాధ్యమాల ద్వారానో, చిన్నాచితకా సభల ద్వారానో ఉబికివస్తున్న స్వయంప్రకటిత కవుల తాకిడి ఎక్కువైపోయింది. కవిత్వంలో నిబద్ధత గురించి ఇలాంటివారికి ఓసారి గుర్తుచేయాలంటే 'దిగంబర కవుల'ను తల్చుకోవాల్సిందే!

1960వ దశకంలో ఉవ్వెత్తున దూసుకువచ్చి ఇది 'దిగంబరరశకం, నగ్ననామ సంవత్సరం, ఆశ రుతువు' అని సగర్వంగా చాటిన దిగంబర కవుల గురించి చెప్పుకొనేందుకు చాలానే ఉంది. నగ్నముని, నిఖిలేశ్వర్, చెరబండరాజు, జ్వాలాముఖి, భైరవయ్య, మహాస్వప్న అనే ఆరుగురు కవులే మనం తల్చుకున్న దిగంబర కవులు. వీరి అసలు పేర్లు ఇవి కావు. ఈ ఆరుగురూ కూడా తమతమ లక్ష్యలకు ప్రతీకగా ఉండేందుకు నియమించుకున్న కలం పేర్లే కానీ కులం పేర్లు కావు. నిజానికి ఈ ఆరుగురూ అప్పటికే కవితాలోకంలో ఎంతో కొంత పేరు తెచ్చుకున్నవారు. అయితే నిస్తబ్ధుగా ఉన్న కవితాలోకంలో ఏదో ఒక ప్రకంపన సృష్టించాలన్న తపనతో ఒక చోటకి చేరారు. అందుకోసం వారు అన్ సెన్సార్డ్‌గా తమ భావాలను వెలిబుచ్చుతూ మూడు సంకలనాలను తీసుకువచ్చారు.

నిజానికి దిగంబర కవిత్వం ఒక చారిత్రక అవసరం. ఎన్నో ఆశలతో ఆశయాలతో సాధించుకున్న స్వాతంత్ర్యం, సంబరాలు చేసుకునే సందర్భంగానే మిగిలిపోయింది. నేతలు, పెట్టుబడిదారులు కుమ్మక్కయిపోయారు. కార్మికసంఘాలు పార్టీల పరమైపోయాయి. రైతులు, కూలీలు, నేతన్నల గురించి పట్టించుకుని పోరాడే దిక్కే లేకుండా పోయింది. పీడిత వర్గం తరపున ఎవరన్నా గొంతెత్తితే, ఆ గొంతుకను నిర్బంధించేందుకు ప్రభుత్వం వెనుకాడటం లేదు. అలాంటి సందర్భంలో ఇటు రచయితలలోని జడత్వాన్ని విమర్శిస్తూ, అటు ప్రజలలో చైతన్యాన్ని రగిలిస్తూ వచ్చిన కవిత్వమే దిగంబర కవిత్వం. 1965లో విడుదల అయిన దిగంబర కవుల తొలి సంకలనంలోని తొలి కవితే (ఆత్మయోని) ఇందుకు నిదర్శనంగా నిలుస్తుంది...

ఆత్మయోని
నన్నయ్యను నరేంద్రుడి బొందలోనే
నిద్రపోనియ్యి
లేపకు
పీకనులిమి గోతిలోకి లాగుతాడు.
ప్రబంధాంగనల తొడలు తాడి మొద్దులు
తాకితే కాళ్ళు విరగ్గొట్టు
భావకవుల నపుంసక హావభావాలకు సవాలు
అభ్యుదయ కవీ నల్లమందుతిని నిద్రపోయావ్
నయాగారా జలపాతంలో
దూకలేక పోయిన అన్నయ్యా
గుడ్బై! మీకందరికీ సలామ్వాలేకమ్
వచనం లేదు!
కవిత్వం అంతకంటేలేదు...

అంటూ సాగే కవిత్వంలో తమ ఉద్దేశం ఏమిటో కుండబద్దలుకొట్టేశారు దిగంబర కవులు.

దిగంబర కవిత్వం ఊహించినట్లుగానే ప్రకంపనలు సృష్టించింది. రా.రా, తిలక్, సోమసుందర్ వంటి ప్రఖ్యాతులు ఈ కవిత్వంలోని పదప్రయోగాలను నిరసించారు. ఇందులోని లైంగిక ప్రతీకలని, అశ్లీల పదాలనీ ఎండగట్టారు. కానీ శ్రీశ్రీ, చలం వంటి రచయితలు ఈ రచనలను నెత్తికెత్తుకున్నారు. ఉడుకురక్తపు యువకులు పదేపదే ఈ కవితలను చదువుకున్నారు. అణగారిన వర్గాలు దిగంబర కవిత్వాన్ని గుండెలకు హత్తుకున్నారు.

దిగంబర కవిత్వం మూడు సంపుటాలుగా (1965, 66, 68) ప్రజల్లోకి వచ్చింది. మూడు సంపుటాలూ ప్రజల ఆదరణను పొందాయి. వీటిలోని ప్రతి కవితా అద్భుతం అని చెప్పలేకపోయినా, అసమాన్యమైన కవితలెన్నో వీటిలో చోటు చేసుకున్నాయి. ఇవి నిజాలు/ నిత్యం మండే యదార్థాలు/ ఆడదాని ప్రసూతి వేదనలా/ జీన్ వార్జీన్ ఆకలిమంటలా/ ఎదిగి చేతికందిన కొడుకు/ యముడి పరమైతే/ తల్లడిల్లే విధవ తల్లి గర్భ శోకంలా/ సూటిగా నగ్నంగా చెప్పబడే సత్యాలు (భైరవయ్య - దిగంబరి) వంటి కవితలు అజరామరంలా నిలిచిపోయాయి. దిగంబర కవిత్వంలో ప్రతి కవితా ఒక నిప్పుకణికలాగే సాగుతుంది. ప్రతి వాక్యమూ పాఠకుడిని రెచ్చగొడుతుంది. నీ బొమికల్ని హడలగొడతాను/ నీ కలల్లో కల్లోలం రేపుతాను/ ఊ లే/ ముసుగు తొలగించు/ ఈ కంపు కొట్టే బట్టల్ని విప్పి/ ఆత్మ ముందు నిలబడి నిన్ను నువ్వు చూసుకో/ మనిషిలా మంచిగా ఆకాశంలా అవనిలా/ బతుకు/ తెరిచిన కళ్లు ఇంక మూయకు/ చెప్పడానికి నువ్వెవరని గొంతు నొక్కడానికి ప్రయత్నించకు (నగ్నముని – సుఖరోగి) వంటి కవితలు చదివినప్పుడు మనసులో ఏదో ఒక మూల నుంచి ఓ మూలుగు మన ఉనికిని నిదురలేపేందుకు ప్రయత్నించక మానదు. అందుకనే దిగంబర కవితల ముందుమాటలో వారు 'ఇది సెక్స్ గ్రంథం కాదు. రాజకీయ నినాదాల కోసం ఉద్దేశించింది అంతకంటే కాదు. ఈ దేశంలో, ఈ గోళంలో ఊపిరిపీల్చే ప్రతి మనిషి ఉనికి కోసం తపనపడి, అతడి భావిని చూసి వెక్కి వెక్కి, పిచ్చెక్కి ప్రవచించిన కవిత' అంటూ తమ కవితలను నిర్వచించారు. వారి కవిత్వం చదివితే అదెంత నిజమో అర్థమవుతుంది.




-సంతపురి నారాయణరావు
కవి, రచయిత, నల్లగొండ
సెల్: 8008576521

# పిల్లలకు ఆర్థిక అక్షరాస్యతా అవసరమే!

"తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతోపాటు ఆటలు, పాటలు.. ఇలా వారికి ఆసక్తి ఉన్నవాటిపై శిక్షణ ఇప్పిస్తుంటారు. కానీ, ఆర్థికపరమైన అంశాల గురించి ఎక్కువగా చర్చించరు. వాటిపైన పిల్లలకు అవగాహన కల్పించరు. కొందరైతే.. పిల్లలు అడిగినంత డబ్బులు ఇచ్చేస్తుంటారు. మరికొందరు పిల్లల చేతికి చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా పెంచుతుంటారు. ఈ రెండు పద్ధతులూ సరైనవి కావు. ఇలా చేయడం వల్ల పిల్లలకు డబ్బు విలువ తెలియకుండా పోతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. పెద్దయ్యాక వారు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో పిల్లలకు ఆర్థిక అక్షరాస్యత అత్యవసరమని సూచిస్తున్నారు. పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించగల అత్యుత్తమ జీవిత పాఠాలలో డబ్బు ప్రాధాన్యం ఒకటి. ఆర్థిక అక్షరాస్యత అనేది చిన్ననాటి నుంచే అలవరచుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం. చిన్నప్పుడు వారికి పడే ఆ పునాది పెద్దవారయ్యాక కూడా వారిని ధృఢంగా నిలబెడుతుంది. వారు తెలివైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తుంది.

## తల్లిదండ్రులు తప్పక ఆర్థిక పాఠాలు నేర్పాలి




**పిల్లలు నడవాల్సిన మార్గాన్ని తల్లిదండ్రులే వారికి బోధించాలి..**

పిల్లలపై తల్లిదండ్రుల ప్రభావం అధికంగా ఉంటుంది. వారి చూసే అన్నీ నేర్చుకుంటూ ఉంటారు. అందుకే అంటారు చిన్న పిల్లలు నడవాల్సిన మార్గాన్ని తల్లిదండ్రులే వారికి బోధించాలి.. పెద్దయ్యాక వారు ఎటువంటి పరిస్థితులు ఎదురైన ఆ మార్గం నుంచి బయటకు రారు. అన్ని విషయాలు చెబుతూ ఉంటారు గానీ.. డబ్బు విషయంలో పిల్లలను దూరం పెట్టడం ప్రతి ఇంట్లో జరుగుతుంది. అయితే పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించగల అత్యుత్తమ జీవిత పాఠాలలో డబ్బు ప్రాధాన్యం ఒకటి. నిజమేనండి.. ఆర్థిక అక్షరాస్యత అనేది చిన్ననాటి నుంచే అలవరచుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం. చిన్నప్పుడు వారికి పడే ఆ పునాది పెద్దవారయ్యాక కూడా వారిని ధృఢంగా నిలబెడుతుంది. వారు తెలివైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తుంది. అందుకు ఉపయోగపడే టిప్స్ మీకు అందిస్తున్నాం.డబ్బు సంపాదించడం (ఆదాయం), పొదుపు, ఖర్చు, పెట్టుబడి.. ఆర్థిక నిర్వహణలో ప్రాథమికాంశాలు. ముందుగా మీ పిల్లలకు ఈ విషయాలపై పూర్తిగా అవగాహన కల్పించాలి.

**ఆదాయం:** పిల్లల ప్రధాన ఆదాయ మార్గాలు.. పాకెట్ మనీ, బహుమతులే! కొందరు టీనేజర్లు పార్ట్‌టైమ్ ఉద్యోగం ద్వారా ఎంతో కొంత సంపాదిస్తూ ఉంటారు. అయితే, ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. ఆ డబ్బులను సమర్థంగా నిర్వహించడంలో సాయపడాలి.

**ఖర్చు:** తమ చేతికి వచ్చిన డబ్బును ఏయే వస్తువులపై ఖర్చు చేయాలో పిల్లలకు అవగాహన కల్పించాలి. అవసరం లేనివి కొనుగోలు చేయడం వల్ల డబ్బు ఎలా వృథా అవుతుందో వారికి తెలిసేలా చేయాలి. ఇందుకోసం ఇంట్లో పనికిరాకుండా ఉన్న వస్తువులు, వాటి ఖరీదు, అవి కొనకుండా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను విడమర్చి చెప్పాలి.

**పొదుపు:** స్నేహితులకు గిఫ్ట్స్ ఇవ్వడానికి, తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసుకోవడానికి పాకెట్ మనీలో పొదుపు చేసిన డబ్బులనే వాడుకోమని చెప్పండి. దీనివల్ల వారిలో 'పొదుపు' చేయడం అలవాటుగా మారుతుంది.

**మదుపు:** మీ పిల్లల దగ్గర ఎక్కువ మొత్తంలో డబ్బులు పోగైతే.. వాటిని చిన్న మొత్తాలుగా మదుపు చేయించండి. లేదా మీ అవసరాల కోసం తీసుకొని.. రెండుమూడు నెలల తర్వాత ఇంకొంత డబ్బు కలిపి పిల్లలకు తిరిగివ్వండి. పెట్టుబడి పెట్టడం ద్వారా కలిగే ప్రయోజనాలను వారు ప్రత్యక్షంగా అనుభవించాలి. అప్పుడే.. వారికి మదుపు విలువ తెలిసొస్తుంది.

**మనీ బేసిక్స్..**

పిల్లలకు డబ్బు నిర్వహణపై సరైన పునాది వేయాలి. దాని ప్రాధాన్యం, ఖర్చు పెట్టాల్సిన విధానంపై అవగాహన చిన్ననాటి నుంచే అవసరం. పొదుపు, ఖర్చు, డబ్బుకున్న విలువను అర్థం చేసుకునేలా చేయాలి. డబ్బు ఎలా వస్తుందో చెప్పాలి. వారికి ఏదైనా వస్తువు కావాలంటే దానిని బడ్జెట్ ఎలా ఉంచాలో వివరించండి. పిల్లలకి పిగ్గీ బ్యాంక్ ఇవ్వండి. ప్రత్యేకమైన వాటి కోసం ఎలా పొదుపు చేయాలో నేర్పించండి. ఈ పొదుపుతో కాలక్రమేణా డబ్బు పెరుగుతుందని అర్థం చేసుకునేలా చేయాలి.

**డబ్బు ఇవ్వండి..**

పిల్లలకు కొంత మొత్తంలో అలోవెన్స్ కింద డబ్బు ఇస్తే వాటి నిర్వహణను బోధించడానికి ఉపకరిస్తుంది. మీరు చెప్పిన పనులు వారు సంపూర్తి చేసిన తర్వాత లేదా వారానికోసారి వారికి కొంత మొత్తం ఇవ్వవచ్చు. దీని ద్వారా ఖర్చు చేయడం, పొదుపు చేయడం, ఇతర అవసరాలకు ప్రత్యేకంగా కేటాయించేలా వారిని ప్రోత్సహించండి. మీ పిల్లలు ఖరీదైన వస్తువును కొనుగోలు చేయాలనుకున్నప్పుడు, కాలక్రమేణా డబ్బును ఆదా చేసేలా వారిని ప్రోత్సహించడం ద్వారా అది వారికి ఆలస్యమైన సంతృప్తినిచ్చేలా చేస్తుంది.

**సంపాదన విలువ..**

పని చేయడం వల్ల డబ్బు సంపాదించవచ్చని మీ పిల్లలకు నేర్పండి. దీన్ని మరింత అర్థం చేసుకోవడంలో వారికి సహాయపడటానికి, అదనపు పనులు లేదా పనుల కోసం అదనపు డబ్బు సంపాదించే అవకాశాన్ని మీ పిల్లలకు అందించండి. ఇది వారికి కష్టపడి పని చేయడం, వ్యక్తిగత బాధ్యత గురించి అవగాహన కల్పించడంలో సహాయపడుతుంది.

**నీడ్స్ వర్సెస్ వాంట్స్..**

పిల్లలు అర్థం చేసుకోవడానికి ఇది కొంచెం కష్టం కావొచ్చు. అన్ని అవసరాలు కోరికలు కాకపోవచ్చు. అలాగే అన్ని కోరికలు అవసరాలు కాకపోవచ్చు. కానీ డబ్బు ఖర్చు చేసేటప్పుడు ఈరెండింటి మధ్య బ్యాలెన్స్ ఎలా ఉండాలో మీ పిల్లలకి అర్థమయ్యేలా చెప్పాలి. ముఖ్యంగా మీ పిల్లలతో వారికి కావాల్సిన అన్నింటితో ఒక జాబితాను సృష్టించండి. దానిలో ఏది అవసరం, ఏది కోరిక అనేది వర్గీకరించమని చెప్పాలి. ఇది వారికి ఖర్చులకు ఎలా ప్రాధాన్యత ఇవ్వాలో అర్థం అవుతుంది.

**దానం చేయండి నేర్పండి..**

మీ పిల్లలకు మీరిస్తున్న కొంత డబ్బు నుంచి కొంత భాగాన్ని చారిటీ కోసం కేటాయించేలా ప్రోత్సహించండి. మీరు స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే మొత్తాన్ని మీ పిల్లలను చూడనివ్వండి. మీ డబ్బు ఎక్కడికి వెళుతుందనే నిర్ణయాలలో వారిని భాగస్వామ్యం చేయండి.

**రోల్ మోడల్‌గా ఉండండి**

పిల్లలు తల్లిదండ్రుల అలవాట్లను అనుకరిస్తారు కాబట్టి, ఆర్థిక విషయాలకు సంబంధించినంత వరకు మంచి ఉదాహరణలను సెట్ చేయడం చాలా ముఖ్యం. మీరు బడ్జెట్‌ను ఎలా సృష్టించాలో, బిల్లులు చెల్లించడం, ఏదైనా వస్తువు కొనుగోలు చేయడానికి నగదును ఎలా ఆదా చేయాలి వంటి వాటిని మీరు వారికి వివరించవచ్చు. డబ్బుకు సంబంధించి మీరు ఎలా నిర్ణయాలు తీసుకుంటారో మీ పిల్లలకు తెలియనీయండి.

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.

**చిరునామా:**

V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘన నివాళులు

**విశ్వంభర, హైదరాబాద్:** మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజపేయి శత జయంతి సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ విగ్రహం వద్ద భారీ ర్యాలీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ , గౌతమ్ రావు తదితరులు పాల్గొన్నారు.







### అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘన నివాళులు

**విశ్వంభర, ఆమనగల్లు :** మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని సుపరిపాలన దినోత్సవంగా జరుపుకుంటూ ఆమనగల్లు మున్సిపాలిటీ చౌరస్తా ను అటల్ బిహారీ వాజ్‌పేయి చౌరస్తా గా నామకరణం చేశారు. బిజెపి శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం, అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి చంద్ర శేఖర్ జీ , మాజీ జాతీయ బీసి కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, తెలంగాణ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### ఘనంగా అటల్ బిహారీ వాజ్ పేయ్ విగ్రహావిష్కరణ

**విశ్వంభర, ఆమనగల్లు :** భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతిని పురస్కరించుకొని కల్వకుర్తి నియోజకవర్గం రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు తలకొండపల్లి వెల్దండ మండల కేంద్రాలలో బిజెపి శ్రేణులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి చంద్ర శేఖర్ , మాజీ జాతీయ బీసి కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, తెలంగాణ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి హాజరయ్యారు తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా కుప్పగండ్ల గ్రామంలో మాజీ సర్పంచ్ శారద ఆధ్వర్యంలో అటల్ బిహారీ వాజ్పాయ్ విగ్రహాన్ని, అటల్ జీ పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున యువకులు పాల్గొని రక్తదానం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడుసార్లు ప్రధానమంత్రి గా భారతదేశానికి చేసిన సేవలకు భారతరత్న బిరుదు కు అన్ని విధాల అర్హులని ఏ ప్రధానమంత్రి సాహసించని పోక్రాన్ లో అణుబాంబు పరీక్షలు నిర్వహించిన ఘనత వాజ్పాయ్ దని గ్రామాల్లో ప్రధానమంత్రి సడక్ యోజన, పేదలకు అంత్యోదయ కార్డులు, రైతులకు ఏడు శాతానికి రుణాలు, వంటి సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన నాయకుడు అటల్ బిహారీ వాజ్పాయ్ అని కొనియాడారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎల్లేని సుధాకర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరి ప్రసాద్, అసెంబ్లీ ఇన్చార్జి శేఖర్ రెడ్డి, గోరటి నరసింహ, ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ సర్పంచ్ భక్తి కుమార్, మండల అధ్యక్షుడు యాదగిరి, మట్ట పరమేష్, దండు శ్రీనివాస్, మట్ట విష్ణు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు

**విశ్వంభర, తంగడపల్లి :** మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ కార్యాలయంలో భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్ పేయ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తంగళ్ళపల్లి మండల బిజెపి అధ్యక్షుడు శ్రీధర్ రావు, ఉపాధ్యక్షుడు కన్వీనర్ కన్నె అరుణ్ కుమార్, అరవింద్, బాల మల్లేశం, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

### భారతజాతి గర్వించదగిన గొప్ప నేత

**విశ్వంభర, మీర్ పెట్ :** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్గుల్ గ్రామంలో 9వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ హాజరై అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ వాజ్‌పేయి దేశ రాజకీయాల్లో నైతిక విలువలకు పట్టం కట్టిన గొప్ప నాయకుడిని, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడారని, ప్రధానిగా సైనిక శక్తిని, రక్షణ రంగాన్ని ఎంతగానో బలోపేతం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన, సాగర్ బ్యాంక్ డైరెక్టర్లు పెత్తుల పుల్లారెడ్డి, తోట ప్రతాప్ రెడ్డి, గిరిరాజు, ఏనుగు రామ్ రెడ్డి, నిమ్మల శ్రీకాంత్ గౌడ్, మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అంజిరెడ్డి, జనగే రమేష్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.





## బజరంగ్ దళ్ చేస్తున్న కృషి అద్వితీయం

– శ్రీరాములు అందెల



**విశ్వంభర, మహేశ్వరం:** విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో నిర్వహించినటువంటి త్రిశూల్ దీక్షలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి నూతనంగా బజరంగ్ దళ్ చేరి త్రిశూల్ దీక్ష తీసుకున్న యువకులకు అభినందనలు తెలిపారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ గత 60 సంవత్సరాలుగా హిందూ సమాజాన్ని ఏకీకృతం చేస్తూ, లోక కళ్యాణం కోసం, సమాజ సేవ చేయడం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. విశ్వహిందూ పరిషత్ అయోధ్య రామ మందిరం కొరకు చేసిన పోరాటాలు మరువలేనివని గుర్తు చేశారు. అలాగే బజరంగ్ దళ్ చేపట్టిన త్రిశూల్ దీక్షతో యువతలో చైతన్యం వస్తుందని అన్నారు. గోహత్యలు, దేవాలయ విధ్వంసం, హిందూ మహిళలపై లవ్ జిహాద్ లను అరికట్టేందుకు బజరంగ్ దళ్ చేస్తున్న కృషి అద్వితీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ పెద్దలు, వివిధ క్షేత్రాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ పట్టణంలో ఇమ్మానుయేల్ బైబిల్ చర్చిలో రేవ: భూక్య లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు జననం యొక్క గొప్పతనాన్ని, ఆయన పునరుద్ధాన, ఆయన రెండవ రాకడ గూర్చి మాట్లాడుతూ ఆమనగల్లు చుట్టుప్రక్కల గ్రామాలు మరియు తండాలు ప్రజలు మారుమనసు పొంది దేవున్ని ప్రేమను తెలుసుకోని ప్రతి ఒక్కరూ ఆయన సుదీర్ఘమైన మార్గములో నడవాలని మాట్లాడుతూ లోకంలో జరుగుతున్న దాడులు అన్యాయాలను అరికట్టాలంటే దేవుని పట్ల విశ్వాసము భయము భక్తిలో ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని ఆయన కోరారు. ఇమ్మానుయేల్ సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొని ఘనంగా క్రిస్మస్ వేడుకలు ఆటపాటలతో యేసయ్యను ఆరాధించి క్రిస్మస్ పండుగను ఘనంగా చేసుకున్నారు.

### క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే భూక్యా

**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా కేంద్రం లోని తొర్రూర్ రోడ్డులో ఉన్న వి కన్వెన్షన్ లో డా. వీరన్న, శారద దంపతులతో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ కలిసి క్రిస్టమస్ పండగను ఘనంగా నిర్వహించారు.



## అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు

- నిబంధనలు ఉల్లంఘిస్తూ బ్యాటరీ రీసైకిలింగ్ కెమికల్ పరిశ్రమ ఏర్పాటు
- వెంటనే తొలగించాలని ఎమ్మార్వో కి విన్నవించిన గ్రామస్తులు



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చెరు నియోజకవర్గం జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామ శివారిలో సర్వేనెంబర్ 286 అసైన్డ్ భూమిలో అక్రమంగా ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ బ్యాటరీ రీసైకిలింగ్ కెమికల్ ఫ్యాక్టరీని పనులు కొనసాగుతున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ వద్దకు వెళ్లి సందర్శించి ప్రభుత్వ శాఖల అనుమతుల కు విరుద్ధంగా సంబంధిత ప్రభుత్వ శాఖ నుండి పరిశ్రమను తొలగించుటకు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ పరిశ్రమను కొనసాగిస్తున్నందున పరిశ్రమను నిలిపివేయడానికి రాళ్లకత్వ గ్రామ ప్రజలు పరిశ్రమ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకొని పరిశ్రమలను ఎత్తివేయుటకు జిన్నారం మండల మేజిస్ట్రేట్ తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి ఈ కెమికల్ బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ వల్ల చెరువుల లో నీళ్లు కలుషితమై పంట పొలాలకు పశువులకు నీళ్లు తాగే పరిస్థితి ఉండదని ప్రభుత్వం తరపున నిలిపివేయాలని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అలాగే పనులు కొనసాగుతున్నాయని వివరించడం జరిగింది. తక్షణమే పనులు నిలిపివేసి చెరువుకుంటలని ప్రజలను కాపాడాలని జిన్నారం మండల తహసిల్దార్ కి విన్నవించుకోవడం జరిగింది. కార్యక్రమంలో రాళ్లకత్వ గ్రామస్తులు పాల్గొన్నారు.

## బస్సు ఏర్పాటుతో విద్యార్థుల హర్షం

**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో సర్దార్ నగర్ గ్రామం విద్యార్థులకు స్కూల్ మహేశ్వరం గవర్నమెంట్ కాలేజీలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేనందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున వారికి ఉదయం సాయంత్రం ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థుల యొక్క సమస్య త్వరగా పరిష్కరించాలని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్ కౌన్సిలర్ రాజమోని రాజు వినతి పత్రం డిఎమ్ కి అందించారు. వెంటనే డిఎమ్ బస్సును ఏర్పాటు చేసారు, గ్రామస్తులు స్కూల్ విద్యార్థులు కాలేజీ విద్యార్థులు హర్ష వ్యక్తం చేశారు. ఈ సమస్య స్పందించి బస్సు ఆ యొక్క రూట్లో వేసినందుకు మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్ డిపో మేనేజర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



## లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ విప్

**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల :** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి లక్ష్మి నరసింహ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ఆ స్వామి దయవల్ల స్వామిని దర్శించుకోవడం తో ప్రత్యేక పూజలు చేయడం జరిగిందని స్వామివారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆ దేవుని వేడుకోవడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ మహోత్సవంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేముల స్వరూప తిరుపతిరెడ్డి వైస్ చైర్మన్ నర్సింగం గౌడ్.తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు జలగం ప్రవీణ్ ఆలయ కమిటీ అధ్యక్షులు మచ్చ శ్రీనివాస్ , తంగళ్ళపల్లి మండలం ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, మోర రాజు, చుక్క రాజశేఖర్, శివ ప్రసాద్, లక్ష్మణ్, గడ్డం మధుకర్, ప్రశాంత్, మునిగల రాజు, గుగ్గిల భరత్ గౌడ్, మాజీ ఎంపీటీసీ బైరవేణి రాములు,ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు గ్రామస్తులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే వీరేశం పరామర్శ



**విశ్వంభర, రామన్నపేట:** ఇంద్రపాలనగరం (తుమ్మలగూడెం) గ్రామానికి చెందిన కేస కిరణ్ కుమార్తె మొదటి జన్మదిన వేడుకలో పాల్గొన్ని చిన్నారిని ఆశీర్వదించారు. అదే గ్రామానికి చెందిన, ఇటీవలే గుండె పోటుకు గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గర్దాసు సురేశ్ ను పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కంబాలపల్లి యాదమ్మ ఇటీవలే అనారోగ్యంతో మరణించగా, వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నల్ల భాస్కర్ ను పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కనకబోయిన మమత ను పరామర్శించి, ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## ఆదర్శ క్లబ్ నూతన భవనం ప్రారంభం

పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**విశ్వంభర, తంగళ్ళపల్లి:** మండల కేంద్రంలో ఆదర్శ క్లబ్ నూతన భవన ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వివేకానందుని ఆదర్శంగా తీసుకుని పనిచేస్తే అక్రమాలకు చెక్ పెట్టవచ్చని తెలియజేస్తూ గత ప్రభుత్వం మండలంలో ఉన్న ప్రభుత్వ భూమిని బిఆర్ఎస్ పార్టీ లీడర్లు అలాగే పేదల భూములను రాబందులుగా లాక్కున్నారని గత పది సంవత్సరాలు గంజాయి అక్రమ భూ దందాలు ఎక్కువ దోపిడి జరిగింది తంగళ్ళపల్లి మండలంలోని అలాగే ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, కాంగ్రెస్ పార్టీలోనే భూ పంపిణీ జరిగిందని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన పనిచేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభుత్వ భూముల సర్వేకు శ్రీకారం చుట్టారని ప్రభుత్వ భూములు తీసుకున్నట్లయితే ప్రభుత్వ పథకాలు ఇంప్లిమెంట్ చేయడానికి ఉంటుందని గత పది సంవత్సరాల్లో బిఆర్ఎస్ నాయకులు చట్టాలను తమ చుట్టాలుగా మార్చుకుని ప్రభుత్వ భూములు దోచుకున్నారని లావన్ అసెండ్ భూములన్ని బి ఆర్ ఎస్ ఖాతాలోకి వెళ్ళాయని రైతుబంధు డబ్బులను రాబందుల దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో క్లబ్బు పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## వధూవరులకు ఆశీర్వాదం

**హాజరైన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య**

**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామంలో కావాలి రమేష్ కుమారుడు నరేష్ నిశ్చితార్థానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహేశ్వరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య హాజరై నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ పోతుల నర్సింగ్ పటేల్, మాజీ వార్డ్ మెంబర్ సభ్యులు బ్యాగరీ రాజు, కందిపోచయ్య, ఇమ్మడి పాండయ్య, గళ్ళ అనిల్ కుమార్, సుధాకర్, వంశీ, కడల జయంత్, సిహెచ్ బాలకృష్ణ, అమీర్‌పేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్ ఈ యొక్క నిశ్చితార్థం కార్యక్రమంలో పాల్గొన్నారు.



# యథేచ్ఛగా బెల్టు షాపుల దందా...!

- జోరుగా బెల్టు షాపుల నిర్వహణ
- మత్తుతో చిద్రమవుతున్న పేద కుటుంబాలు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్, పోలీస్ శాఖ



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చేరు మండలంలోని పలు గ్రామపంచాయతీలలో నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులలో మద్యం ఏరులై పారుతున్నప్పటికి.. బెల్ట్ షాపుల బెల్టు తీసేవారే లేరా...? అంటూ ప్రజలు వాపోయారు. అక్కడ నాణ్యతను పట్టించుకునే నాధుడు ఉండడు, ఎమ్మార్పీ ధరలను అడిగే అధికారి ఉండడు, అందుకే ఈ ప్రాంతంలో బెల్ట్ షాపులు నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతూ, మూడు పువ్వులు ,ఆరు కాయలుగా వారి వ్యాపారం కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనలతో నడిచే వైన్ షాపులు సమయపాలన పాటిస్తుండడం సదరు బెల్ట్ షాపుల నిర్వాహకులకు అంది వచ్చిన అవకాశంగా మారింది. అర్ధరాత్రి 12 గంటలకు వెళ్లి తలుపు కొట్టిన ఎనీ టైం మందు అంటూ సాదరంగా స్వాగతం పలుకుతున్న సన్నివేశాలు మనకు నిత్యం కనబడుతూ ఉంటాయి. పటాన్ చేరు నియోజకవర్గంలో అధికంగా కూలినాలి చేసుకొని జీవనోపాధి గడుపుతున్న కుటుంబాలే అధికంగా ఉంటాయి. దీంతో రోజంతా శారీరక శ్రమ చేసి, దాని నుండి కాస్త ఉపశమనం పొందడానికి మందుకు అలవాటు పడుతున్న స్థితి తెలిసిందే, ఇదే అదనుగా తీసుకుంటున్న బెల్ట్ షాపు నిర్వాహకులు క్వాలిటీ, , కాస్ట్ ను ఎవరికి తోచినట్టు వాళ్ళు ఇస్తూ నిరుపేద ప్రజానీకాన్ని ఆర్థికంగా, శారీరకంగా నష్టపరుస్తున్నారు. ఈ అక్రమ దందా మూడు పువ్వులు ,ఆరు కాయలుగా వర్ధిల్లుతున్న విషయం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ తమకేమీ పట్టనట్టుగా చోద్యం చూడడం పలు అనుమానాలకు తావిస్తోంది. వారి ఆశీర్వాదంతోనే మండలంలోని బెల్ట్ షాపుల నిర్వాహకులు రెచ్చిపోతున్నారా అని అంటే అవును అనే సమాధానం వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని మండలంలో కొనసాగుతున్న బెల్ట్ షాపుల దూకుడుకు కళ్లెం వేయాలని ప్రజలు వేడుకుంటున్నారు. చూద్దాం భవిష్యత్తులో ప్రభుత్వం, సంబంధిత అధికార గణం ఏ చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి మరి.

## పేదలకు దుస్తులు పంపిణీ



**విశ్వంభర, పటాన్ చెరు:** శ్రీనగర్ కాలనీలోని మౌంట్ కల్వరీ చర్చిలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం డి ఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్, బీఆర్ఎస్ పార్టీ యువనాయకుడు మాదిరి ప్రిథ్వీరాజ్ పేదవారికి దుస్తులు, పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు, స్థానికులు, మానవతా విలువలను చాటే క్రిస్మస్ పండుగ అందరు జరుపుకోవడం సంతోషంగా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మధు, ప్రణీత్ ,వినయ్, అశోక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు భారత ఉపరాష్ట్రపతి జగదీప్ దన్ ఖడ్



**విశ్వంభర, హైదరాబాద్ :** భారత ఉపరాష్ట్రపతి జగదీప్ దన్ ఖడ్ అయన సతీమణి డాక్టర్ సుదీష్ లు హైదరాబాద్ నగరానికి వచ్చిన సందర్భంగా వారిని శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ శర్మ, మంత్రి జూపల్లి కృష్ణా రావు స్వాగతం పలికారు.

## సృజనాత్మకతతోనే వాస్తుశిల్పులుగా రాణించవచ్చు

**గీతం ఆర్కిటెక్చర్ అధ్యాపకుల ఉద్బోధ**



**విశ్వంభర, సంగారెడ్డి :** సృజనాత్మకతతోనే వాస్తు శిల్పులుగా రాణించగలరని, విభిన్న యోచనే ఈ రంగంలో అత్యున్నత శిఖరాలను ఆధిరోహించడానికి దోహదపడుతుందని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్యాపకులు అభిప్రాయపడ్డారు. సెయింట్ ఆంథోనీ జూనియర్ కళాశాల విద్యార్థులు బుధవారం గీతంను సందర్శించారు. స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఇన్ ఛార్జి డైరెక్టర్ బందన్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని అధ్యాపక బృందం అసిస్టెంట్ ప్రొఫెసర్లు స్నిగ్రా రాయ్, అభిషేక్ సింగ్ వారితో సమావేశమై, సృజనాత్మక ప్రాజెక్టుల యొక్క సమగ్ర అవలోకాన్ని ఆ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు ఆకర్షణీయమైన ప్రదర్శనలను అందించి, నిర్మాణ విద్యలో గీతం వినూత్న విధానాలను ఆవిష్కరించారు. ఆ తర్వాత అంథోని విద్యార్థులు ఎగ్జిబిషన్ హాల్, మెటీరియల్ మ్యూజియంలను సందర్శించారు. చివరగా సెమినార్ హాలులో వారికి ఆర్కిటెక్చర్ విద్యపై మరింత అవగాహన కల్పించారు.

## 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తా

**ఎమ్మెల్యే మురళీ నాయక్**



**విశ్వంభర, ఇనుగుర్తి:** మండల కేంద్రం ఇనుగుర్తి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రానున్న రోజుల్లో 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే డా.భూక్య మురళి నాయక్ అన్నారు. పీహెచ్సీకి ప్రభుత్వం మంజూరు చేసిన అంబులెన్స్ ను డిఎం అండ్ హెచ్ ఓ మురళీధర్ తో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలో భాగంగా అత్యవసర సమయాలలో ఆసరా కోసం అంబులెన్స్ అవసరమని తాను హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహను కోరగా అంబులెన్స్ మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు పోలీస్ స్టేషన్ సైతం ఏర్పాటు చేస్తామన్నారు. అంబులెన్స్ అవసరం ఎక్కువగా రాకుండా అందరూ ఆరోగ్యంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ భగవంతుని కోరుకోవాలన్నారు.కార్యక్రమంలో ఏఎంసి పిఏసిఎస్ డైరెక్టర్లు కొట్టం రాము, మహేందర్, మండల మెడికలాఫీసర్ డా.సురేష్, ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, ఎమ్ హెచ్ డి మహేష్, ఈఎంటి మల్లయ్య,పైలెట్ సుధాకర్, పప్పుల వెంకన్న, వీరన్న, ప్రభాకర్, శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు కట్టయ్య, అశోక్ అశోక్ గౌడ్, సతీష్ రాజేందర్ రెడ్డి, శ్యామ్, మురళి, శ్రీనివాస్ రెడ్డి, కొంతం శ్రీను, చిట్టెబోయిన యాకయ్య, వెంకన్న నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగలు మనుషులను దగ్గర చేయడానికే

**ఆప్ కన్వీనర్ డా.సుధాకర్**



**విశ్వంభర, బషీర్ బాగ్:** పండుగలు మనుషులను దగ్గర చేయడానికే గాని, గొడవలు పడటానికి కాదని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు అబ్దుల్ సలీం ఆధ్వర్యంలో బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో క్రిస్టమస్ వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మైనారిటీ సెల్ అధ్యక్షులు అబ్దుల్ సలీం మాట్లాడుతూ పండుగలు జరుపుకోవడం మనుషుల మధ్యన అవగాహన పెరగడానికి ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం డాక్టర్ సుధాకర్ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ మాట్లాడుతూ.. పండుగలు అనేవి మనుషులను దగ్గర చేయడానికి పనికి రావాలి గాని మనుషులను విడదీయడానికి కాకూడదని అన్ని మతాలు సమానమైన అని అన్ని కులాలు మతాలు ఉన్నా మనుషులు ఒకటే అని ఈ సందర్భంగా ఆయన అంటూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్బిఐ ఖాతాదారులకు సువర్ణ అవకాశం



**విశ్వంభర, మహేశ్వరం:** అమీర్‌పేట్ గ్రామంలో ఎస్బిఐ వినియోగదారులకు ప్రొపోర్టర్ బ్యాగరీ నరసింహ ఎస్ బి ఐ మినీ బ్యాంకు సేవ కేంద్రం ఓపెనింగ్ చేయడానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఖాతాదారులు ఎస్బిఐ మినీ బ్యాంకులో ఖాతాదారులు డబ్బులు తీసుకోవచ్చు, వేయవచ్చని గ్రామంలో సరియైన సేవలు అందించడానికి ఈ యొక్క మినీ బ్యాంకు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అమీర్‌పేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్రా నవీన్ కుమార్, బి.నరసింహ పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న పుస్తక ప్రదర్శన



**విశ్వంభర, హైదరాబాద్:** రెంటాల జయదేవ రాసిన మన సినిమా ఫస్ట్ రీల్ పుస్తక పరిచయ గోష్టి హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికగా జరిగింది. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించాడు. త్రివిక్రమ్ మాట్లాడుతూ.. సినిమాలకి విజయవాహిని ఎలాగో, పుస్తకాలకి ఎమెస్కో అలాగా. రెంటాల జయదేవతో "అతడు" సినిమా చేస్తున్నప్పుడు చెన్నైలో పరిచయం. తెలుగు సినిమా మొదటి రోజుల గురించి రాసిన పరిశోధనాత్మక పుస్తకం ఇది. ఇది ఒక నవలలాంటి పుస్తకం. సినిమాలంటే బాగా పిచ్చి ఉన్న వ్యక్తి రెంటాల జయదేవ. ఆయన మరిన్ని పుస్తకాలు రాయాలి అని అన్నాడు. కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ.. తెలుగు సినిమా చరిత్ర చదవాలంటే ఈ పుస్తకం చదవాలి. అయితే ఇందులో తమిళ్, మలయాళం, కన్నడ సినీ పరిశ్రమలు సమాంతరంగా ఎలా అభివృద్ధి చెందాయి వివరంగా రాసారు" అన్నాడు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. రచయిత రెంటాల జయదేవ ఈ పుస్తకాన్ని అథారిటీవ్ గా, అథెంటిక్ గా , అక్యూరేట్ గా రాసారు అన్నారు. ఈసందర్భంగా త్రివిక్రమ్ ఆయన పలు స్టాళ్లకు వెళ్లారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ స్టాల్?ను సందర్శించి, పుస్తకాలను పరిశీలించారు. ఆయన వెంట సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ అధ్యక్ష, కార్యదర్శులు యాకూబ్, ఆర్ వాసు, వైస్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి ఉన్నారు.

## స్వాతి నక్షత్రపు ఆలయ ప్రదక్షిణను జయప్రదం చేయండి



**విశ్వంభర, రామన్నపేట:** మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన మహిమాన్విత శ్రీ లక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయ ప్రదక్షణ 26వ తేదీన స్వాతి నక్షత్రం సందర్భంగా ఉదయం 7 గంటలకు జ్యోతిని వెలిగించి, ఆలయ ప్రదక్షణ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, భక్తులు, స్థానికులు సకాలంలో ఆలయానికి విచ్చేసి, ఆలయ ప్రదక్షిణలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

# వాజ్ పేయ్ సేవలు చిరస్మరణీయం





**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయ్ సేవలు చిరస్మరణీయమని పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు కోణం విట్టల్ అన్నారు. బుధవారం పెద్ద శంకరంపేట లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో వాజ్ పాయ్ శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అటల్ బిహారీ వాజ్ పాయ్ సమర్థవంతంగా సుస్థిర అభివృద్ధి ధ్యేయంగా ప్రధానమంత్రిగా సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన హయాంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు, నాయకులు శ్రావణ్ కుమార్, మంగళి కృష్ణ.. బొగుడాల కృష్ణ.. ఆంజనేయులు వెంకటేశం ఆయా గ్రామాల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో భారత దేశ మాజీ ప్రధాని అజాతశత్రువు అటల్ బీహార్ వాజ్ పేయ్ శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి . ఈ సందర్భంగా మాజీ ఎంపీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ డా, అజ్మీర సీతారాం నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని వాజ్పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంతో పాటు , ఉత్తర తెలంగాణలకు బీజేపీ పార్టీ, దేశ ప్రధానినరేంద్ర మోడీ ఇస్తున్న వరాలు అని కేంద్రంలో 55 సంవత్సరాలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుమారు 40 , ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనలోని, కాంగ్రెస్ పార్టీ, సుదీర్ఘంగా ఈ ప్రాంతాన్ని పరిపాలించిన ఉత్తర తెలంగాణ ప్రాంత అభివృద్ధికి మొండి చెయ్యి చూపారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఒరిగింది ఏమీ లేదు అని గుర్తు చేశారు . ఇప్పటివరకు తెలంగాణకు దాని మంది కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఒకరు టిఆర్ఎస్ ముఖ్యమంత్రిగా గా పనిచేశారు తప్ప అభివృద్ధిలో శూన్యమని ఫైర్ అయ్యారు. గడిచిన పది సంవత్సరాలలో తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీని ఆదరిస్తున్న తీరు అభినందనీయం అని అన్నారు . గంగుల శ్రీధర్ హుస్సేన్ పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నీ నిర్వహించడం అభినందనీయం

**పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**



**విశ్వంభర, దోమ :** మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో కీర్తిశేషులు ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థులు నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ కార్యక్రమంలో బుధవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు కీర్తిశేషులు లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలన్నారు. నేటి జీవితంలో ఏదో ఒక క్రీడపై ఆసక్తిని పెంపొందించుకున్నట్లైతే రోగాలు దరిచేరవాన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు, డిసిసి ఉపాధ్యక్షులు భీమ్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి, ప్రజాసేవకుడు భాస్కర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాదయ్య గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ఆశన్న గౌడ్, జాఫర్, రవి, సాయిలు, రాఘవేందర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు









**విశ్వంభర, హైదరాబాద్:** క్రిస్మస్ పండుగ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ తో కలిసి హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్ రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

**విశ్వంభర, హైదరాబాద్ :** ఇండియన్ ప్రజా కాంగ్రెస్ ఆధ్వర్యంలో లిబర్టీ ప్లాజా ఆఫీసు వద్ద క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులుగా ఐపీసి నేషనల్ ప్రెసిడెంట్ కె బి శ్రీధర్, నారాగోని వెంకటయ్య, బాలకృష్ణ, దేవసేన కొండలరావు, పద్మిని సుధాకర్, కట్ట రామేశ్, వాసుదేవరావు, అనిత, పుష్పాంజలి, అంజయ్య, సుధాకర్ గుప్త నాగేందర్ గుప్త,నవీన్ గుప్త, వెంకటేష్ గుప్త, గంగాధర్ పాల్గొన్నారు.

**విశ్వంభర , మహాదేవపూర్:** రాపెల్లికోట, బెగ్లూర్ గ్రామాలలో యేసు ప్రేమించుచున్నాడు ప్రార్ధనా మందిరాలలో పాస్టర్స్ జోసఫ్, ప్రకాష్, సురేష్ వారి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు క్రిస్మస్ సందేశం అందించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రేమవిందు చేశారు . దేశ, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేసి అందరికీ క్రిస్మస్ శు భాకాంక్షలు తెలియపరిచారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటిసి గుడాల అరుణ - శ్రీనివాస్ , మంత్రి రాజు , రెండు గ్రామాల సంఘ పెద్దలు, విశ్వాసులు గ్రామస్తులు పాల్గొని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** క్రిస్టమస్ పండుగ సందర్భంగా పెద్దశంకరపేట మండల పరిధిలో గల చర్చిలలో క్రిస్టమస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో భక్తులను నిర్వహించుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న సిఎస్ ఐ ప్రార్థన మందిరం తో పాటు పలు గ్రామాల్లో ఉన్న ప్రార్థనా మందిరంలో ఫాదర్ ల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిఎస్ఐ చర్చిలో దేవవరం పాస్టర్ ఆధ్వర్యంలో యేసుక్రీస్తు బోధనలు వివరిస్తూ భక్తులు పండుగలు నిర్వహించుకున్నారు. ప్రతి ఒక్కరు శాంతియుతంగా ఉంటూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి సల్పాలని ఈ సందర్భంగా పాస్టర్ పేర్కొన్నారు.

**విశ్వంభర, ఇనుగుర్తి:** మండలంలోని చిన్న ముప్పారం లో బుధవారం దహించు అగ్ని చర్చిలో రెవరెండ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. భక్తులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. భక్తి గీతాలు ఆలపించారు. సామూహిక విందు ఆరగించారు. అంతకుమునుపు రెవరెండ్ మోహన్ రెడ్డి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీస్తు మార్గంలో నడిచిన వారికి సత్యం దయా కరుణ ప్రేమ అలవడుతుందని ఉద్బోధించారు. క్రీస్తు బోధనలే మానవాళికి శిరోధార్యం అని చెప్పారు.జోసెఫ్ రెడ్డి,కొప్పుల అంజిరెడ్డి,మట్ట సుజాత,బాధ యాకయ్య, ముత్యాల ఎల్లయ్య,కారు పోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, రామన్నపేట:** పల్లివాడ గ్రామంలో సిఎస్ఐ వెస్లీ చర్చ్ లో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లివాడ గ్రామ మాజీ ఉప సర్పంచ్ కల్లూరి నగేష్ పాల్గొని గ్రామ ప్రజలను, పశు వులని, పాడిపంటలను సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలని ఆ ఏసుప్రభువు ఎల్లప్పుడూ ఆశీర్వచనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ విద్యాసాగర్, ముఖ్య నిర్వాహకులు దొడ్డి జాకోబ్, బందెల రవి, కట్ట ప్రభాకర్, బాదే బిక్షం, బాదే శ్రీనివాస్, పెరమళ్ళ యాదయ్య, అప్పం సురేందర్, పెరమళ్ళ బాబు, బందెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, మహేశ్వరం:** మండలంలో లిల్లీ పూర్ గ్రామంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కాల్వకోల్, దుబ్బచెర్ల మాజీ సర్పంచులు గాదె థామస్ రెడ్డి , ఎర్వ సిల్వా రెడ్డి ఎర్వ విజయ రెడ్డి ఆద్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు మహేశ్వరం మండల మాజీ సర్పంచులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు





**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** క్రిస్టమస్ పండుగ సందర్భంగా పెద్దశంకరపేట మండల పరిధిలో గల చర్చిలలో క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో భక్తులను నిర్వహించుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న సిఎస్ఐ ప్రార్థన మందిరం తో పాటు పలు గ్రామాల్లో ఉన్న ప్రార్థనా మందిరంలో ఫాదర్ ల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిఎస్ఐ చర్చిలో దేవవరం పాస్టర్ ఆధ్వర్యంలో యేసుక్రీస్తు బోధనలు వివరిస్తూ భక్తులు పండుగలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో చార్లెస్ వాకర్ భూషణం స్టీవార్డ్ సుమంగళ సన్నీ డెబిట్ పాల్ సుహాసిని పద్మారావు కమల పౌలు తదితరులు పాల్గొన్నారు.

### ఫాతిమాపూర్ చర్చి వద్ద ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**విశ్వంభర, షాద్ నగర్ :** కొత్తూరు మండలం ఫాతిమాపూర్ చర్చ్ లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని నియోజకవర్గ క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలియజేసారు. ఈ సందర్భంగా క్రైస్తవ వేడుకల్లో హాజరైన అంజయ్య యాదవ్ తదితరులను క్రైస్తవ సోదరులు సన్మానించారు. అనంతరం ఒకరికి ఒకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మె సత్యనారాయణ, దేవేందర్ యాదవ్, డోలి రవీందర్, జగన్మోహన్ రెడ్డి, మెండే కృష్ణ యాదవ్, గోపాల్ గౌడ్, సోమ్లా నాయక్, శ్రీనివాస్ గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

**విశ్వంభర, మిర్యాలగూడ:** ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రేమ, కరుణ, మానవత్వాన్ని ప్రపంచానికి పంచిన ఆ యేసు జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఈ వేడుకలు నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అలాగే మిర్యాలగూడ నియోజకవర్గ క్రైస్తవ సోదర సోదరీమణులకు అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రైస్తవ క్రిస్టియన్ సోదరీ సోదరీమణులు పాల్గొన్నారు.

### శక్తిని ప్రసాదించేలా క్రీస్తును ప్రార్థించండి

**విశ్వంభర, నెల్లికుదురు:** మానుకోట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తనకు తగిన శక్తిని ప్రసాదించేలా ఏసుక్రీస్తుకు ప్రార్థన చేయాలని ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్ క్రైస్తవుల కు సూచించారు. మండల కేంద్రం నెల్లికుదురు సేయింట్ పీటర్ ఇంటీరియర్ జాప్టిస్ట్ చర్చ్, ధర్మ తండాక్రిస్టమస్ వేడుకల్లో బుధవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే ధర్మ తండాకు రోడ్డు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై చిర్ర రమేష్ బాబు, పాస్టర్లు రాజేంద్ర కుమార్, హెచ్. మహేందర్, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ గౌడ్, యాదవ రెడ్డి, సత్యపాల్ రెడ్డి, లక్మారెడ్డి, బాలాజీ నాయక్, వెంకటేష్, రాజేష్, అశోక్ ధరావత్ ఆనంద్ పాల్గొన్నారు.

### ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయం

**విశ్వంభర, సూర్యాపేట :** ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయమని.. అందరి ప్రార్థనలు ఫలించి ప్రశాంతంగా జీవించాలని మాజీమంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నిర్మల మాతా చర్చ్, సిల్వి సిలోయం చర్చ్, గ్రేస్ చర్చ్, మన్నా చర్చ్, సెయింట్ బాప్టిస్ట్ చర్చ్ లలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమల్ల అన్నపూర్ణ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జెడ్పి మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, నాయకులు నంద్యాల దయాకర్ రెడ్డి, ఉప్పల ఆనంద్, మారుపెద్ది శ్రీనివాస్ గౌడ్, నెమ్మది బిక్షం, జీడి బిక్షం, తూడి నరసింహారావు, పూర్ణ శశికాంత్, తాహెర్ పాషా, బత్తుల జానీ, గండూరి కృపాకర్ పాల్గొన్నారు.







## సీఎం రేవంత్‌కు ఘన స్వాగతం



**విశ్వంభర, మెదక్:** పార్లమెంట్ పరిధిలోని ఏడుపాయల దుర్గా భవాని ఆలయంతో పాటు క్రిస్టమస్ సందర్భంగా మెదక్ చర్చి లో జరిగిన శతాబ్ది వేడుకల్లో పాల్గొనడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండీడేట్ నీలం మధు ముదిరాజ్ ఘన స్వాగతం పలికారు. బేగంపేట నుంచి హెలికాప్టర్ ద్వారా ఏడుపాయల చేరుకున్న సీఎం రేవంత్ తో పాటు పీసీసీ, మంత్రులకు హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందించి గ్రాండ్ వెల్కమ్ చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి తో పాటు పీసీసీ మహేష్ గౌడ్, మంత్రులు దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే రోహిత్, సంజీవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మతరావు, టీజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులు గౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జిలు రాజీ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పూజల హరికృష్ణ తో కలిసి ఏడుపాయల వనదుర్గ అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుని ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం వారితో కలిసి మెదక్ చర్చికి బయలుదేరి వెళ్లి చర్చి వంద సంవత్సరాల వేడుకతో పాటు క్రిస్టమస్ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంపూర్ణ శ్రీమద్ భగవద్గీతా పారాయణ యజ్ఞం ప్రారంభోత్సవం



**విశ్వంభర, పంజాబీ ధర్మశాల:** అవధూత దత్త పీఠం, మైసూర్, గణపతి సచ్చిదానంద స్వామి వారి మార్గదర్శకత్వంలో కురుక్షేత్రలోని పంజాబీ ధర్మశాలలో గణపతి సచ్చిదానంద స్వామీజీ నిర్వహించిన సంపూర్ణ శ్రీమద్ భగవద్గీతా పారాయణ యజ్ఞం ప్రారంభోత్సవంలో 12 దేశాలకు చెందిన ఎన్నారై విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రయ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భగవద్గీత పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ.. మాట్లాడుతూ పవిత్ర భగవద్గీత బోధనలు సమానత్వం మరియు శాంతికి మార్గం అన్నారు. పవిత్రమైన భగవద్గీత బోధనలు అన్ని జీవుల మధ్య ఐక్యత, నిస్వార్థత మరియు ఇతరుల సంక్షేమం కోసం అంకితభావంతో పాటు ఒకరి విధులకు కట్టుబడి ఉంటాయని బండారు దత్తాత్రేయ నొక్కి చెప్పారు. గీత సమానత్వం మరియు శాంతికి మార్గాన్ని అందించిందని, మానవాళి నేడు స్వీకరించాల్సిన విలువలను వారుహైలైట్ చేశారు. దత్తాత్రేయ జ్యోతి ప్రజ్వలన చేయడంతో ప్రారంభమైన కార్యక్రమంలో భగవద్గీతలోని 700 శ్లోకాలను సమిష్టిగా పఠించడానికి 50 దేశాలకు పైగా ఎన్నారై భక్తులు ఒకేచోట చేరడం పవిత్రమైన కురుక్షేత్రంలో ఇదే మొదటిసారి. ఈ పుణ్యభూమిలో ఇటీవల అంతర్జాతీయ గీతా మహోత్సవాన్ని జరుపుకున్నట్లు దత్తాత్రేయ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా శాంతి సందేశాన్ని వ్యాప్తి చేస్తూ, గీతా శ్లోకాల యొక్క గ్లోబల్ పారాయణాలు నిర్వహించబడ్డాయి. గీతా బోధలను మానవాళి అంతటా ప్రచారం చేయడం కోసం గణపతి సచ్చిదానంద స్వామిజీ చేస్తున్న కృషిని గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రశంసించారు. కురుక్షేత్ర యుద్ధభూమిలో శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన ఈ బోధనలు నిస్వార్థ సేవ, కర్తవ్యం, కరుణ అనే విలువలను ఎత్తిచూపుతూ మానవాళికి దీటుగా నిలుస్తున్నాయి అని పేర్కొన్నారు.

## లంబయ్య గుట్ట వేణుగోపాల స్వామి కళ్యాణ బ్రహ్మోత్సవాలు



**విశ్వంభర, రంగారెడ్డి :** కేశంపేట మండలం వేములనర్వ గ్రామం లంబయ్యగుట్ట వేణుగోపాల స్వామి కళ్యాణం బ్రహ్మోత్సవాలలో బీఆర్ఎస్ యువనాయకులు వై. రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ ఆయన నిన్ను సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. వేణుగోపాల స్వామి కళ్యాణి స్వయంగా వీక్షించడం, ఆ కళ్యాణంలో పాల్గొని ఆ భగవంతుని ఆశీర్వచనాలు పొందడం నిజంగా జీవితంలో ఒక అద్భుతమైన కార్యక్రమమని వై. రవీందర్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ జడ్పీటీసీ నర్సింగరావు, మాజీ వైస్ ఎంపీపీ అనురాధ పర్వత్ రెడ్డి మాజీ సర్పంచులు వెంకట్ రెడ్డి, నవీన్ కుమార్, లక్ష్మీనారాయణ, జమాల్ ఖాన్, భూపాల్ రెడ్డి, చంద్రయ్య, యాదయ్య, రమేష్ యాదవ్, కటికె రమేష్, కార్తీక్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## భూనిర్వాసితులకు పరిహారం ఏదీ?



**విశ్వంభర, కాటారం :** మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి సంవత్సరం అయినా తన కళల ప్రాజెక్ట్, సొంత మండలం కాటారంలోని చిన్న కాళేశ్వరం యొక్క భూనిర్వాసితుల అవస్థలు పట్టించుకోని శ్రీధర్ బాబు పరిహారం ఇప్పించండి అంటూ మండలాధికారుల జిల్లా అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్న భూ నిర్వాసితుల భూమిని ప్రాజెక్టు పనులు మొదలు కాకముందు కాస్తు చేస్తూ ఉండి, పట్టా కలిగి ఉన్నప్పటికిని పరిహారం ఇవ్వలేమంటూ మౌకికంగా తెలుపుతున్న అధికారులు 2008 సంవత్సరం నుండి భూనిర్వాసితులకు, ఇప్పటివరకు పరిహారం అందలేదని, ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన నాయకుడు మంత్రి శ్రీధర్ బాబు బాధ్యత తీసుకోడా అని ప్రశ్నించారు. చిదినపల్లి గారేపల్లి భూనిర్వాసితులు, గత సంవత్సర కాలం నుండి, పలు దఫాలుగా మంత్రిని కలిసినా కూడా, వారి మొరనాలకించి పరిహారం ఇప్పించిన నాధుడే లేకపాయే. అప్పటి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కాటారం డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సాగునీరు అందించుట కొరకు జలయజ్ఞంలో భాగంగా చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. ఈ విషయమై, ఆభూనిర్వాసితులు అందరూ, పలు దఫాలుగా సంవత్సర కాలం నుండి మండలాధికారులను జిల్లా అధికారులను తరచుగా కలుస్తున్నప్పటికీ వారికి కాంపెన్సేషన్ ఇప్పించే మాట దేవుడు ఎరుగు, కనీసం వారిని పట్టించుకునే అధికారియే లేడు గెలిచిన నాటి నుండి పలు ధఫాలుగా హైదరాబాద్ కరీంనగర్ మంథని ధన్వాడలోను స్థానిక మంత్రి శ్రీధర్ బాబును కలిసినప్పటికీ కూడా, ఇప్పుడు కలెక్టర్ ను పంపిస్తా, అప్పుడు ఎంక్వయిరీ చేపిస్తా అని మీ పరిహారం డబ్బులు ఇప్పిస్తా అని దాట వేస్తున్నాడే తప్ప , పట్టా కలిగి ఉండి మోకా మీద ఉన్నటువంటి అసలైన నిర్వాసితులకు ఫలానా తారీకు వరకు, ఫలానా నెల వరకు డబ్బులు ఇప్పించగలను అని భరోసా కల్పించలేకపోతున్నాడు రాష్ట్రాన్ని ఏలుడు దేవుడెరుగు, నిన్నే నమ్ముకుని నీ చుట్టే తిరిగే కుటుంబాలకు, భూనిర్వాసితులు అయిన కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం ఇప్పించి ఇన్ని రోజుల వెతకు వడ్డీతో కలిపి చెల్లించాలని రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును డిమాండ్ చేస్తున్నారు.

## కామ్రేడ్ కేవల్ కిషన్ ముదిరాజ్ జాతరను విజయవంతం చేయండి



**విశ్వంభర, మెదక్ :** డిసెంబర్ 26న మెదక్ జిల్లా చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో నిర్వహించనున్న ముదిరాజ్ మహా జాతర సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు అందే బాబయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో షాద్ నగర్ పట్టణ కేంద్రంలో ముదిరాజ్ జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. కామ్రేడ్ కేవల్ కిషన్ ముదిరాజ్ జీవితంలో చేసిన సేవలను గుర్తుచేశారు. ఆయన ముదిరాజ్ సమాజ అభ్యున్నతికి పాటుపడి, సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో అనేక మార్పులను తీసుకువచ్చారు. ప్రత్యేకంగా పేదవర్గాల అభివృద్ధికి, యువత శిక్షణకు, ఉచిత విద్యా కార్యక్రమాల నిర్వహణకు కృషి చేశారని, వారి జీవితం సామాజిక సేవకు అంకితమైందని అన్నారు. అనేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టి పేద వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## సామాజిక ఉద్యమకారులకు నూతన చట్టాల బుక్స్ అందజేత



**విశ్వం భర, మిర్యాలగూడ :** హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ తల్లిదండ్రుల రాపోలు రాములు – రామ లక్ష్మీ జ్ఞాపకార్థం నూతన చట్టాల బుక్స్ ను సామాజిక ఉద్యమకారులకు అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ.. హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ వారి తల్లిదండ్రుల యొక్క జ్ఞాపకార్థం నూతన చట్టాలకు సంబంధించిన బుక్స్ ను సామాజిక ఉద్యమకారులకు , గతంలో ఎంతోమంది న్యాయవాదులకు అందజేశారని ఇది హర్శించదగ్గ విషయం అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అంబేడ్కర్ లేకపోతే అమిత్ షా లేరు



**విశ్వంభర, హైదరాబాద్ :** పార్లమెంట్ లో కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడిన మాటలు అంబేడ్కర్ ను అవమాన పరిచిన తీరు పట్ల దేశ వ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. అంబేడ్కర్ లేకపోతే అమిత్ షా లేరు అని బర్రె లక్క ( శిరీష) అన్నారు. వినయ్ విప్లవ్ , దాసరి భారతి మాట్లాడుతూ అంబెడ్కర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనెక్కి తీసుకొని మంత్రి పదవికి రాజీనామా చేయాలనీ అన్నారు. అంబెడ్కర్ పడ్డ కష్టాలు, అంటరాని తనం,అసమానతలు గురించి విద్యార్థులకు అవగాహన కలిపించి,అమిత్ షా దేశ ప్రజలకు అంబేద్కర్ సాక్షిగా క్షమాపణ చెప్పాలి అని ఆగ్రహం వ్యక్తం చేసారు. వెంటనే మాటలు వెనక్కి తీసుకోవాలని బర్రె లక్క డిమాండ్ చేశారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



**విశ్వంభర, రామన్నపేట:** మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం జనరల్ బాడీ సమావేశంలో బుధవారం ముఖ్య అతిథులుగా హాజరై, ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కందుల హనుమంతు మాట్లాడుతూ, ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రభుత్వం నుండి ఏమి అందలేదని, ముదిరాజ్ పేదలకు ఈ ప్రభుత్వం గుర్తించి, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు ముదిరాజ్ సామాజిక వర్గానికి ఏమి అందలేదని ఈ ప్రభుత్వం గుర్తించి అర్హులైన పేదలను ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, ఆయన కోరారు. ఈ సమావేశంలో సొసైటీ కార్యదర్శి పిట్టల మశ్చగిరి, డైరెక్టర్ కందుల శ్రీను, రేపాక రాజు, బైరబోఇన వేణు, పెద్దబోయిన మీనమ్మ, బచ్చ అంజమ్మ, సభ్యులు భైరబోయిన రమేష్, జిను రాములు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులపై పన్నుల భారం తగదు



**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులపై పన్నుల భారాలు మోపడం తగదని,తక్షణమే ఉద్యోగ నియామకాల దరఖాస్తులపై జిఎస్టి వసూలు చేయడాన్ని ఉపసంహరించుకొని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వడం చేతకాని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ నియామక దరఖాస్తు ఫారాలపై జిఎస్టి ను వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. అన్ని వస్తువుల పైన పన్నుల భారాలను మోపుతున్న కేంద్ర ప్రభుత్వం ఆఖరికి నిరుద్యోగ యువతను కూడా వదలట్లేదన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను చదివిపిస్తున్నారని,కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉద్యోగాలకు దూరం చేసేవిధంగా వ్యవహరిస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం, అప్పుడప్పుడు ఇచ్చిన నోటిఫికేషన్ లపై దరఖాస్తులకు జీఎస్టీ ని విధించడం దుర్మార్గమని అన్నారు.

## ఎలికట్టలో నూతన ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం



**విశ్వంభర, రంగారెడ్డి:** ఫరుక్ నగర్ మండలంలో ఎలికట్ట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని ఆర్వో వాటర్ ప్లాంట్ యజమాని రవి సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెంది శ్రీనివాస్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయి యాదవ్, మాజీ సర్పంచ్ యాదయ్య, కంటెస్టెడ్ యంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు రామస్వామి మరియు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఆరో వాటర్ ప్లాంట్ యజమాని రవికి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం బాగా అభివృద్ధి జరిగి ఆర్థికంగా ముందుకు సాగాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆకాంక్షించారు.

## శతాబ్ది ఉత్సవాల్లో వాజ్ పేయ్ కు ఎంపీ లక్ష్మణ్ నివాళులు







**విశ్వంభర, హైదరాబాద్ :** మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజపేయి శత జయంతి సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ రాంనగర్ లో అయన చిత్ర పటానికి రాజ్య సభ సభ్యుడు కోవా లక్ష్మణ్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ చిత్రం లో భాజాపా నేతలు శేష సాయి, పూస రాజు తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, హైదరాబాద్ :** మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజపేయి శత జయంతి సందర్భంగా కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ ఆధ్వర్యంలో వాజ్ పేయి చిత్ర పటంకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ సిబ్బందికి సన్మానం చేసి పండ్ల పంపిణి చేసారు . చిత్రంలో గౌతమ్ రావు, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, రామన్నపేట:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్ పేయి 100వ జయంతి సందర్భంగా రోగులకు పండ్ల పంపిణీ జరిగింది, అనంతరం వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.

**విశ్వంభర, షాద్ నగర్ :** భారత మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్ పేయి 100వ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణం ముఖ్య కూడలి లో బీజేపీ పట్టణ అధ్యక్షులు హరి భూషణ్ అధ్యక్షతన మహనీయుని చిత్ర పటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పూల మాలతో ఘనంగా నివాళులు అర్పించారు. వారితో పాటు దేపల్లి అశోక్ గౌడ్, చెంది మహేందర్ రెడ్డి, శేరి విష్ణువర్ధన్ రెడ్డి,వి.వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... అటల్ బిహారి వాజ్ పేయి దేశం కోసం తన జీవితాన్ని త్యజించిన ధృవతార యుగపురుషుడని అన్నారు.

# అటల్ బిహారీ వాజపేయి శత జయంతి

**విశ్వంభర, హైదరాబాద్/ చేవెళ్ల/ చింతపల్లి/ వెల్దండ :** మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజపేయి శత జయంతి సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశ వ్యాప్తంగా ఆయన దేశానికి సేవలు యువతకు మహిళలకు సంబంధించి అనేక కార్యక్రమాలను గుర్తు చేసుకుని ఆయనకు నివాళులు అర్పించి అనేక సేవా కార్యక్రమాలను చేశారు. హైదరాబాద్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయం లో ఏర్పాటు చేసిన రక్త దాన శిభిరం లో రక్త దానం చేసి న వారిని అభినందించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు డా లక్ష్మణ్, మాజీ ఏంఎ ల్ఏ చింతల రాంచంద్ర రెడ్డి, బీ జె పి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ నగరం లో జరిగిన పలు కార్యక్రమలలో పాల్గొని మాట్లాడారు.కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలను భారత ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించుకుంటున్నాం.దేశంలోని అనేక సామాజిక సంస్థలు శతాబ్ది ఉత్సవాలను 2025 డిసెంబరు 25 వరకు జరుపుకోవాలని నిర్ణయించడం జరిగింది.వాజ్ పేయి గారి జీవితం దేశానికే ఆదర్శం. నవయువ హృదయ సామ్రాట్ గా పేరుతెచ్చుకున్నారు. వాజ్ పేయి శతజయంతి ఉత్సవాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

**చేవెళ్లలో..**
భారతీయ జనతా పార్టీ చేవెళ్ల లో యువనేత డాక్టర్ వైభవ్ రెడ్డి ఆధ్వర్యంలో భారతరత్న పూర్వ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో డాక్టర్ వైభవ్ రెడ్డి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**చింతపల్లిలో..**
భారతజాతి గర్వించదగిన నేత, భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రం పటానికి ఘననివాళులు అర్పించారు. అనంతరం మండల కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా బిజెపి పార్టీ మండల అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కుకడపు రామాక్రిష్ణ మాట్లాడుతూ దేశగతిని మార్చిన వాజ్ పేయి దూరదృష్టి కారణంగానే నేడు ప్రపంచ దేశాలతో భారత్ పోటీ పడుతోందని వారు తెలిపారు. అన్ని రంగాల్లో వృద్ధి సాధిస్తూ సగర్వంగా తలెత్తుకు నిలబడుతోందన్నారు. నేషన్ ఫస్ట్ అని ఎప్పుడూ భావించే ఆయన మాటలు చిరకాలం దేశ ప్రజలకు గుర్తుకు వస్తూనే ఉంటాయని అన్నారు. దేశం గురించి ఆయన ఆలోచించే తీరు విలక్షణమైనది. దానికి ఆధునికత, సాంకేతికత జోడించాలని సూచించి సంస్కరణల గురించి ప్రతిపాదనలు చేసేవాడని వారు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పిల్లి వెంకన్న, మాసనీ సైదులు, పర్శురాములు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బోడ్డు మహేష్, ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్ యాదవ్, కుందేల చెన్నయ్య యాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షులు కుందేల శ్రీశైలం, బూత్ అధ్యక్షులు గజ్జె అభినవ్, పాలకూర రాజు, గుండ్లపల్లి లక్ష్మణ్, జక్కుల రమేష్, బినమోని లింగం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో

**వెల్దండలో..**
మండలంలోని ఉప్పగండ్లలో భారతరత్న అటల్ బీహార్ వాజ్ పేయ్ జయంతి సందర్భంగా వాజ్ పేయ్ విగ్రహాన్ని ప్రారంభించారు. మాజీ సర్పంచ్ మట్ట శారద కుమారుడు పరమేష్ ఆధ్వర్యంలో నెలకొల్పిన అటల్జీ పార్కును ప్రారంభించారు. అనంతరం గ్రామ బిజెపి పార్టీ మరియు లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలకు సామాజిక సేవే లక్ష్యంగా క్లబ్ పనిచేస్తుందని పేద బలహీన బడుగు వర్గాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాలు మెగా హెల్త్ క్యాంప్ లు మధుమేహ పరీక్షలు డయాలసిస్ పరీక్షలు వంటి ఎన్నో కార్యక్రమాలను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చి వారికి కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందజేయాలని తపనతో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృత పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, డిస్టిక్ చైర్మన్ రమేష్, క్యాంపు చైర్మన్ మదన్ గౌడ్, ట్రెజరర్ గుజ్జరి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో..



చింతపల్లిలో..



వెల్దండలో..

## విలీన సభను జయప్రదం చేయాలని పోస్టర్ల ఆవిష్కరణ



**విశ్వంభర, మహబూబాబాద్:** ఈనెల 28న హైదరాబాద్‌లో జరిగే సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ విలీన సభను జయప్రదం చేయాలని జిల్లా పార్టీ కార్యాలయంలో పోస్టర్ల ఆవిష్కరణ చేశారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బట్టు అంజయ్య స్మారక భవనం కార్యాలయం లో పోస్టర్లు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మండల వెంకన్న, పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గౌని ఐలయ్యలు మాట్లాడుతూ.. 2013 లో వివిధ కారణాల రీత్యా విడిపోయిన న్యూడెమోక్రసీ పార్టీలు నేడు విలీనం కావాలనుకోవడం శుభ పరిణామం గుర్తు చేశారు. దేశంలో మతోన్మాద బిజెపి మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలతో ప్రజలను అరిగోస పెడుతున్నారని, సామ్రాజ్యవాద కంపెనీలకు దేశ సంపదను కట్టబెడుతున్నారని, మతం పేరుతో చిచ్చు పెట్టి మనుషుల మధ్య వైశ్యామ్యాలు సృష్టిస్తు నరహంతక పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు.

## రావిచెడు చర్చిలో క్రిస్మస్ వేడుకలు, క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, కడ్తాల్:** ప్రజల కోసం ఎన్నో కష్టనష్టాలను అనుభవించి ప్రజల కోసమే జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు, కరుణామయుడు యేసుక్రీస్తు అని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్, కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జరుపుల దశరత్ నాయక్ అన్నారు. మండలంలోని రావిచేడు గ్రామంలో ఉన్న చర్చ్ లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ క్యాలెండర్ ను గంప వెంకటేష్ గుప్తా, దశరథ్ నాయకులు ఆవిష్కరించి అనంతరం వారిని సన్మానించారు. ఒకరికి ఒకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రావిచేడు మాజీ సర్పంచ్ విఠలయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పాండు, బిజెపి నాయకులు బాలెందర్ నాయక్, చర్చి పాస్టర్ రాజేష్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా పడిపూజ

**విశ్వంభర, షాబాద్ ;** చందనవెల్లి గ్రామంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య తో కలిసి పాల్గొన్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి , సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. అయ్యప్ప భక్తులు, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు , కుమ్మరి వేణుగోపాల్, టేకులపల్లి రాఘవేందర్, రాజేందర్ రెడ్డి, కావలి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## శివానిలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**విశ్వంభర, ఎల్బీనగర్:** కొత్తపేటలోని శివాని మహిళా కళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలశాల చైర్మన్ డా.పి. రాంరెడ్డి, కరస్పాండెంట్, సెక్రెటరీ వేదిరే సుదర్శన్ రెడ్డి లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కళాశాల దశ విద్యార్థులకు ఎంతో ముఖ్యం అన్నారు. తమ కళాశాలల్లో చదివే విద్యార్థులకు చదువు తో పాటు క్రీడలలో కూడా ప్రోత్సహిస్తాం అని అన్నారు. క్యాంపస్ ప్లేస్మెంట్స్ లోనే చాలా మంది విద్యార్థులు ఎంపిక అవుతుందా అని తెలిపారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ అనిత, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.




## రోగులకు దుప్పట్ల పంపిణీ



**విశ్వంభర, హైదరాబాద్:** నో ఫుడ్ వేస్ట్ ఎన్‌జిఓ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ సహకారం తో పురానాపూల్ ప్రాంతంలోని ఆసుపత్రులు, పేషెంట్ అటెండెంట్ లు, రోడ్ సైడ్‌లో దుప్పట్ల పంపిణీచేసారు. డోనర్ రోటేరియన్ రమణ మూర్తి, వాలంటీర్లు కిషోర్, సాయిమోహన్, దుర్వాస్, సుధీర్ సుంకర, వసంత తదితరులు పాల్గొన్నారు.

# యేసు క్రీస్తు కృప ప్రజలందరిపై ఉండాలి

**విశ్వంభర, ఎల్బీనగర్/ మీర్ పెట్/ ఘట్కేసర్/ సంగారెడ్డి/ నర్సంపేట/ వరంగల్/ షాబాద్ :** యేసు క్రీస్తు కృప ప్రజలందరిపై ఉండాలి అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బుదవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా అగపే బాపిస్టు చర్చి సభ్యులు సుధీర్ రెడ్డి నీ వారి యొక్క కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారిచే కేకు కట్ చేయించి క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ యేసు క్రీస్తు కృప ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఎల్లపుడూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని తెలిపారు. అనంతరం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ శ్రీనివాస్, ఎవానందం, బెంజిమెన్, జోసెఫ్, జైపాల్, జేమ్స్, కేదారి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

**మీర్ పెట్ లో..**
మహేశ్వరం నియోజకవర్గం లోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్గూడలో క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు కో ఆప్షన్ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఘట్కేసర్ లో..**
ప్రేమ, కరుణ ద్వారా క్రైస్తవ మానవాళిలో ఆనందం నింపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయం. ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోచారం మున్సిపాలిటీ పరిధిలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు సుఖ సంతోషాలతో బుధవారం నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రైస్తవులు చిన్న పెద్ద అని తేడా లేకుండా కుటుంబ సభ్యులతో కలిసి చర్చికి వెళ్లి ఏసుక్రీస్తు కు ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**సంగారెడ్డిలో..**
పటాన్ చేరు కరుణామయుడు ఏసుక్రీస్తు బోధనలు, జీవితం ప్రతి ఒక్కరికి అనుసరనీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని పటాన్‌చెరు మండలం పాటి గ్రామ చౌరస్తాలో గల మరనాత చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద పండుగ క్రిస్మస్ అన్నారు. విశ్వ శాంతి దూత, దేవుని కుమారుడు భూమి మీద అడుగు పెట్టిన శుభదినం అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ పరమత సహనం, దైవ చింతన అలవాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, సీనియర్ నాయకులు వెంకటేష్, ధనరాజ్ గౌడ్, చర్చి నిర్వాహకులు భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

**నర్సంపేటలో..**
క్రిస్టియన్, మైనార్టీలను అక్కున చేసుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలో అత్యధిక మంది ప్రజలు జరుపుకునే పండుగ క్రిస్మస్ అని , నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు జరిపారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా చెన్నారావుపేట తిమ్మారాయనపాడు గ్రామంలో పునీత్ రామప్ప బోధన పీఠం దేవాలయం చర్చ్ లో క్రిస్మస్ వేడుకలలో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి పాల్గొని మాట్లాడుతూ క్రిస్టియన్ మైనారిటీలకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని నర్సంపేట నియోజకవర్గం తో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఏసుప్రభు ఆశీస్సులు ఉండాలని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆ ప్రభువును కోరుకుంటున్నాను అన్నారు.



ఎల్బీనగర్ లో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వరంగల్ లో..**
హసన్పర్తి మండలంలోని 2వ డివిజన్ వంగ పహాడ్ లో పునీత ఆంథోని చర్చిలో జెరోమ్ ఫాదర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాటికొండ జోసెఫ్ ఫాదర్ హాజరయ్యారు. జోసఫ్ ఫాదర్ ప్రార్థనలు వాక్య బోధనలు నిర్వహించారు. తదనంతరము ఫాదర్ జెరోం మాట్లాడుతూ నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించమని చెప్పిన యేసు క్రీస్తు బోధనలు విశ్వ మానవాళికి మార్గదర్శకము అని అన్నారు. శాంతి సహనము కరుణ ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని బోధించిన జీసస్ మాటలు సదా అనుసరించాలని మార్గం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలశౌరి ఫాదర్ జోసఫ్, ఫాదర్ఉపదేశి స్వామి సంఘ అధ్యక్షులు దోమకోర్నేల్ కిషోర్, ప్రసాద్, మురళి సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్ లో..**
మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు తొంట నర్సింహులు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జీ పామేన భీమ్ భరత్ హాజరై అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలోషాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పామెనా నర్సింలు, కేసారం చెన్నయ్య , షాబాద్ మాజీ ఎంపీటీసీ రవీందర్, వేణుగోపాల్ ఎర్రవల్లి , రాజేందర్ రెడ్డి ఎర్రవల్లి, మాధవ రెడ్డి, బందయ్య , యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ రెడ్డి, బాల కృష్ణ రెడ్డి, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మీర్ పెట్ ; క్రిస్మస్ సంబరాల్లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



ఘట్కేసర్ లో..



సంగారెడ్డి : క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం



నర్సంపేట : క్రిస్మస్ ఎమ్మెల్యే వేడుకలో దొంతి మాధవరెడ్డి



వరంగల్ : పునీత ఆంథోనీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు



షాబాద్ లో..

# త్వరలోనే ఢిల్లీ సీఎంను అరెస్టు చేస్తారు: కేజ్రీవాల్



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం అతిశీని త్వరలోనే అరెస్టు చేస్తారని వ్యాఖ్యానించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. 'ఆప్ తీసుకొచ్చిన మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన వంటి పథకాలు కొందరికి నచ్చలేదు.దీంతో ఓ తప్పుడు కేసులో త్వరలో ముఖ్యమంత్రి అతిశీని అరెస్టు చేస్తారు. అంతకంటే ముందు ఆప్ సీనియర్ నాయకుల ఇళ్లపై సోదాలు నిర్వహిస్తారు' అని రాసుకొచ్చారు. దీనిపై బుధవారం 12 గంటలకు విలేకరుల సమావేశం నిర్వహిస్తానన్నారు.ఎన్నికల నేపథ్యంలో... తాము మళ్లీ అధికారంలోకి వస్తే 'మహిళా సమ్మాన్ యోజన' కింద మహిళలకు ప్రతినెలా రూ.2,100 ఆర్థికసాయం చేస్తామని ఆప్ ప్రకటించింది. దీంతో పాటు 'సంజీవని యోజన' కింద ఢిల్లీలోని సీనియర్ సిటిజన్లు అందరికీ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించింది. మరోవైపు ఈ పథకాలకు సంబంధించి ఢిల్లీ వాసులను హెచ్చరిస్తూ వార్తాపత్రికలో ఓ ప్రకటన వెలువడింది. అందులో 'మహిళా సమ్మాన్ యోజన కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ.2,100 ఇస్తామని ఓ రాజకీయ పార్టీ చెబుతోందని మీడియా కథనాల ద్వారా మా దృష్టికి వచ్చింది. ఈ పథకానికి సంబంధించి మా దగ్గర ఎలాంటి సమాచారం లేదు. ఢిల్లీ ప్రభుత్వం అలాంటి స్కీమ్‌ను నోటిఫై చేయలేదు. అంతేకాక ఢిల్లీలో ప్రభుత్వ ఆర్యోగ, కుటుంబ సంక్షేమశాఖలో సంజీవని పథకం లేదు. ఈ పథకానికి సంబంధించి వృద్ధుల వ్యక్తిగత సమాచారం లేదా డేటాను సేకరించే అధికారం ఎవరికీ ఇవ్వలేదు' అని మహిళా, శిశు అభివృద్ధి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖలు పేర్కొన్నాయి. ఈ ప్రకటనల నేపథ్యంలోనే కేజ్రీవాల్ ఈమేరకు వ్యాఖ్యలు చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇటీవల సీబీఐ, ఈడీ అధికారుల సమావేశం జరిగిందని, ఆ సందర్భంగా సీఎంను తప్పుడు కేసులో అరెస్టు చేయాలనుకుంటున్నట్లు మాట్లాడుకున్నారని, ఆ సమాచారం తమవద్ద ఉంది అని పేర్కొన్నారు. ఈ విషయంపై ఢిల్లీ సీఎం అతిశీ మాట్లాడుతూ.. వార్తా పత్రికలో వచ్చిన ప్రకటనను తప్పుబట్టారు. 'కొంతమంది అధికారులపై ఒత్తిడితెచ్చి బీజేపీ ఈ నోటీసులు ప్రచురించింది. ఆయా అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఢిల్లీలో మహిళలకు ఉచిత బస్సు సర్వీసు నిలిపివేసేందుకు, నాపై తప్పుడు కేసు పెట్టేందుకు భాజపా ప్రయత్నిస్తుందని మా వద్ద సమాచారం ఉంది. వారు నన్ను అరెస్టు చేసినా.. నాకు న్యాయవ్యవస్థ, రాజ్యాంగంపై నమ్మకం ఉంది. నాకు బెయిల్ వస్తుంది' అని తెలిపారు.

## కుంభమేళా నిర్వహించడం రాకపోతే చెప్పండి.. సాయం చేస్తాం: అఖిలేశ్ యాదవ్



**లక్నో:** సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బీజేపీపై విమర్శలు గుప్పించారు. బీజేపీ నేతలు డబ్బు సంపాదించడంలో, ఎన్నికల ప్రణాళికల్లో బిజీగా ఉండి.. మహా కుంభమేళాకు జరుగుతున్న ఏర్పాట్లలో పాల్గొనలేకపోతున్నారని అఖిలేశ్ విమర్శించారు. కుంభమేళాకు సమయం సమీపిస్తున్నా భక్తుల భద్రతకు సరైన సౌకర్యాలు కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారని పేర్కొన్నారు. వారికి కుంభమేళాను నిర్వహించడం రాకపోతే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సహాయం చేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని అన్నారు. మహా కుంభమేళాకు చేయాల్సిన ఏర్పాట్లలో అధికారుల సమన్వయలోపం వల్ల భద్రతాపరమైన ఏర్పాట్లు అలస్యమవుతున్నాయని ఆయన ఆరోపించారు. స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు, ఇతర అవసరాల కల్పనను యోగి ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదన్నారు. అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు. ఏర్పాట్లలో ఆలస్యం జరగకుండా ఉండేందుకు తమ నేతలు ప్రభుత్వానికి సహకరిస్తారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని తాముకోరుకుంటున్నామన్నారు. 'మహాదాని' పరిపాలకుడు హర్షవర్ధనుడి విగ్రహం తొలగించడంలో ఆత్రుత ప్రదర్శించిన బీజేపీ ప్రభుత్వం.. ఇప్పుడు మాత్రం అదే వేగాన్ని ఎందుకు కనబరచడం లేదని విమర్శించారు. ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఈ మహా కుంభమేళా కొనసాగనుంది. ప్రతి 12 సంవత్సరాలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది యాత్రికులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటారు. దాదాపు 45 కోట్ల మంది యాత్రికులు, సాధువులు, సన్యాసులు, పర్యటకులు రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## బీజేపీ నేతల బుర్రలు పనిచేయడంలేదు : సంజయ్ సింగ్



**ఢిల్లీ:** భారతీయ జనతా పార్టీ పై ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీకి పిచ్చిపట్టిందని, ఆ పార్టీ నేతల బుర్రలు పనిచేయడం లేదని ఫైరయ్యారు. 'మహిళా సమ్మాన్ యోజన పథకం అమలులో లేదని, ఇకముందు కూడా అమలు చేయబోవడం లేదని ఢిల్లీకి చెందిన మహిళాశిశు సంక్షేమ శాఖ మంగళవారంఒక పబ్లిక్ నోటీస్‌ను విడుదల చేసింది. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పిస్తుండటంతో సంజయ్ సింగ్ స్పందించారు.
బీజేపీ ఒక అబద్ధాలకోరు పార్టీ అని, ఆ పార్టీ పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆప్ నేత మండిపడ్డారు. బీజేపీ నేతల ఒత్తిడికి తలొగ్గి, ప్రభుత్వాన్ని బదనాం చేసేలా పబ్లిక్ నోటీస్ విడుదల చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఢిల్లీ ప్రజలు బీజేపీ నేతలతప్పుడు ప్రచారాలను నమ్మబోరని చెప్పారు. కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్నికల్లోఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, బీజేపీ మాత్రం కేంద్రంలో ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు.
'బీజేపీకిపిచ్చిపట్టింది. బీజేపీ నేతల మెదళ్లు పనిచేయడంలేదు. బీజేపీ నేతల ఒత్తడికి తలొగ్గి తప్పుడు పబ్లిక్ నోటీస్ రిలీజ్ చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. కేజ్రీవాల్ ఢిల్లీ సీఎంగా.. ఉచిత విద్యుత్, ఉచిత తాగునీరు, ఉచిత విద్య, ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చారు. కేజ్రీవాల్ ఇచ్చిన హామీ మేరకు మహిళా సమ్మాన్ యోజన పథకం కూడా అమల్లోకి వస్తుంది. ఈ పథకం కేవలం హామీ కాదు. ఒక గ్యారంటీ' అని చెప్పారు.'భారతీయ ఝూటా పార్టీ (బీజేపీని ఉద్దేశించి) ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చింది. విదేశీ బ్యాంకుల్లో ఉన్న బ్లాక్‌మనీని బయటికితీసుకొస్తామని చెప్పింది. రెండు కోట్ల ఉద్యోగ నియామకాలు చేపడుతామని ప్రచారం చేసింది. ఒక్కొక్కరి ఖాతాలో రూ.15లక్షలు జమచేస్తామని తెలిపింది.కానీ వాటిలో ఏ ఒక్క హామీని కూడా బీజేపీ నెరవేర్చలేదు. దేశాన్ని నాశనం చేశారు.పైగా వాళ్లుఅబద్ధాలు ప్రచారం చేస్తారు. వాళ్ల అబద్ధాలను జనం నమ్మే పరిస్థితిలో లేరు' అని సంజయ్ సింగ్ అన్నారు.

## లాటరీ కింగ్ మొబైల్ డేటా కాపీ చేయొద్దు: ఈడీకి సుప్రీం ఆదేశం



**ఢిల్లీ:** మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసులో 'లాటరీ కింగ్' శాంటియాగో మార్టిన్‌కు కాస్త ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మొబైల్, ల్యాప్‌టాప్‌లోని డేటాను సేకరించకుండా, కంటెంట్ కాపీ చేయకుండా ఈడీని నిలువరించింది.శాంటియాగో మార్టిన్ కు చెందిన ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పలు మోసాలకు పాల్పడిందని గతంలోనే ఆరోపణలు వచ్చాయి. దీంతో 2014లో సీబీఐ కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా 2018లో మార్టిన్ సహా ఆయన బంధువులు, సంస్థలో పనిచేసిన అధికారులపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. దీని దర్యాప్తులోభాగంగా ఈ ఏడాది నవంబరులో తమిళనాడు, హరియాణా, పంజాబ్, పశ్చిమబెంగాల్‌లోని మార్టిన్ కార్యాలయాలు, ఇతర ఆస్తుల్లో ఈడీ సోదాలు చేపట్టింది. తనిఖీల సమయంలో రూ.8.8 కోట్ల నగదుతో పాటు మొబైల్, ల్యాప్‌టాప్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను దర్యాప్తు సంస్థ స్వాధీనం చేసుకుంది.
దీనిపై మార్టిన్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నుంచి సేకరించిన ఎలక్ట్రానిక్ పరికరాల్లోని సమాచారాన్ని యాక్సెస్ చేయొద్దని, దాన్ని కాపీ చేసుకోవద్దని ఈడీకి సూచించింది. సోదాల్లో ఇలాంటి పరికరాల స్వాధీనాలకు సంబంధించిన కొన్ని కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్లతో కలిపి మార్టిన్ కేసును విచారిస్తామని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను వాయిదా వేసింది.
**ఎవరీ లాటరీ కింగ్..**'లాటరీ కింగ్'గా తమిళనాడులో పాపులర్ అయిన శాంటియాగో మార్టిన్ పేరు ఇటీవల ఎన్నికల బాండ్ల సమాచారం బహిర్గతమైన సమయంలో దేశవ్యాప్తంగా మార్మోగిన సంగతి తెలిసిందే. మయన్మార్‌లో కూలీగా జీవితాన్ని ప్రారంభించిన అతడు.. 1988లో భారత్‌కు తిరిగి వచ్చి తమిళనాడులో లాటరీ వ్యాపారం మొదలుపెట్టాడు. దానిని కర్ణాటక, కేరళకు విస్తరించాడు. అనంతరం ఈశాన్య భారత్‌కు మకాం మార్చాడు. అక్కడ ప్రభుత్వ లాటరీ స్కీమ్‌లతో వ్యాపారం ప్రారంభించాడు. కొన్నాళ్లకు భూటాన్, నేపాల్‌లో కూడా తన బిజినెస్‌ను మొదలుపెట్టాడు. స్థిరాస్తి, నిర్మాణ, టెక్స్‌టైల్, ఆతిథ్య రంగాల్లోకి అడుగుపెట్టాడు. అతడి నేతృత్వంలోని ఫ్యూచర్ గేమింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వరల్డ్ లాటరీ అసోసియేషన్‌లో సభ్యత్వం ఉంది. ఇది ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినో వంటి వాటిని నిర్వహిస్తుంది.ఈ సంస్థ నుంచి వచ్చిన ఆదాయంతో రూ.1300 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను మార్టిన్ కొనుగోలు చేశాడు. వాటిని 2019-2024 మధ్య పలు రాజకీయ పార్టీలకు విరాళంగా ఇచ్చినట్లు ఇటీవల వెల్లడైంది. తమిళనాడు అధికార డీఎంకే పార్టీకి అతడు రూ.509కోట్లు విరాళమిచ్చినట్లు తెలిసింది.

## శాంతాక్లాజ్ వేషధారణలో కేజ్రీవాల్.. వీడియో పోస్టు చేసిన ఆప్

**ఢిల్లీ:** క్రిస్మస్ సందర్భంగా ఆమ్‌ఆద్మీ పార్టీ ఢిల్లీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసింది. ఈమేరకు ఓ వినూత్న వీడియోను షేర్ చేసింది. శాంతాక్లాజ్ దుస్తుల్లో ఉన్న ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజలకు బహుమతుల రూపంలో పలు ప్రభుత్వ పథకాలను అందిస్తున్నట్లుగా ఆ వీడియోను రూపొందించారు. ఢిల్లీ ప్రజలకు వారి సొంత శాంతా ఏడాది పొడవునా బహుమతులు ఇస్తూనే ఉన్నారని ఆప్ ఈ వీడియోకు వ్యాఖ్యను జత చేసింది. ఇది ఏఐ వీడియోనా? లేక కేజ్రీవాల్ స్వయంగా శాంతాక్లాజ్ గెటప్ వేసుకున్నారా? అనే విషయాన్ని వెల్లడించలేదు.ఢిల్లీ ప్రభుత్వం అక్కడి ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలను రూపొందించింది. ప్రస్తుతం ఉచిత కరెంటు, విద్య, వైద్యం సహా ఇతర పథకాలను లబ్ధిదారులు పొందుతున్నారు. తాము మరోసారి అధికారంలోకి వచ్చాక మరిన్ని పథకాలు ప్రవేశపెట్టనున్నట్లు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల పేర్కొన్నారు. 'మహిళా సమ్మాన్ యోజన' కింద మహిళలకు ప్రతినెలా రూ.2,100 ఆర్థికసాయం, సీనియర్ సిటిజన్లకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని ప్రకటించారు.ఢిల్లీలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆప్ ఎన్నికల ప్రచారాలను ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆ పార్టీ తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. దీని ప్రకారం.. ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనుండగా.. సీఎం ఆతిశీ మరోసారి కాల్కాజీ సీటు నుంచి బరిలో నిలుస్తున్నారు. అలాగే, గ్రేటర్ కైలాశ్ సీటు నుంచి సౌరభ్ భరద్వాజ్, బాబర్‌పుర్ నుంచి గోపాల్‌రాయ్, ఓఖ్లా నుంచి అమానతుల్లా ఖాన్, షాకుర్‌బస్తీ నుంచి సత్యేందర్‌కుమార్ జైన్‌ను బరిలో దించింది.

## మానవ అక్రమ రవాణా.. కెనడా కాలేజీలపై ఈడీ నిఘా



**ఢిల్లీ:** కెనడా సరిహద్దుల నుంచి అమెరికాలోకి భారతీయులను అక్రమంగా తరలించేందుకు సంబంధించి డబ్బులు చేతులుమారిన మనీలాండరింగ్ కేసులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా కెనడాలోని కొన్ని కాలేజీలు, భారత సంస్థల పాత్రపై విచారణ చేపట్టినట్లు దర్యాప్తు సంస్థ వెల్లడించింది. 2022 జనవరి 19న గుజరాత్‌కు చెందిన ఓ కుటుంబం కెనడా సరిహద్దు నుంచి అక్రమంగా అమెరికాలోకి ప్రవేశిస్తున్న సమయంలో తీవ్రమైన శీతల వాతావరణం కారణంగా మరణించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఆధారంగా చేసుకొని ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు భవేష్ పటేల్‌తో పాటు మరికొందరిపైనా మనీ లాండరింగ్‌చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది.నిందితులు మానవులను అక్రమంగా తరలించే సంస్థలతో కలిసి కుట్ర పన్ని.. భారత ప్రజలకు మాయమాటలు చెప్పి వారిని దేశ సరిహద్దులు దాటిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాంటివారిని కెనడా మీదుగా అమెరికాకు అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. ఇందుకోసం కెనడా, అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని, విదేశాల్లో స్థిరపడాలని కోరుకునే భారతీయులను ట్రాప్ చేస్తున్నట్లు తమ దర్యాప్తులో కనుగొన్నామన్నారు. ఈ వ్యవహారంలో ఒక్కో వ్యక్తి నుంచి రూ.55 - రూ.60 లక్షల వరకు వసూలుచేసినట్లు వెల్లడించారు. కానీ, విద్యార్థి వీసాపై కెనడాకు వెళ్లినవారు అక్కడి విశ్వవిద్యాలయాల్లో చేరట్లేదన్నారు. దీంతో కాలేజీలు వారి నుంచి తీసుకున్న అడ్మిషన్ ఫీజును తిరిగి ఆయా వ్యక్తుల ఖాతాల్లో జమ చేసేవారని తెలిపారు. అలా వెళ్లినవారు చట్టవిరుద్ధంగా కెనడా యూఎస్ సరిహద్దును దాటుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన సమాచారం కోసం ఈ కేసులో ముంబయి, నాగ్‌పుర్, గాంధీ నగర్ వంటి 8 ప్రదేశాల్లో సోదాలు చేపడుతున్నట్లు ఏజెన్సీ తెలిపింది. విదేశాల్లోని యూనివర్సిటీల్లో భారతీయులకు ప్రవేశం ఇప్పించడానికి ముంబయి, నాగ్‌పుర్ ఉన్న రెండు సంస్థలు పని చేస్తున్నట్లు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. వీరు ఏటా దేశంలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 35వేల మంది విద్యార్థులను దేశం దాటిస్తున్నారని తెలిపారు.

## ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ వెనక బ్రిటన్ సైనికుడి హస్తం..?




**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని పీలీభీత్‌లో ఇటీవల జరిగిన ఖలిస్థానీ జిందాబాద్ ఫోర్స్ ఉగ్రవాదుల వెనక బ్రిటన్ సైనికుడు జగ్‌జీత్ సింగ్ హస్తం ఉన్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. ఈవిషయాన్ని సరైన మార్గంలో బ్రిటీష్ అధికారుల దృష్టికి తీసుకెళతామని పంజాబ్ డీజీపీ గౌరవ్‌యాదవ్ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు తాజాగా యూకే అధికారులు ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. "ఆ పేరు లేదా మారుపేరుతో బ్రిటిష్ సైన్యంలో ఎలాంటి సైనికుడు లేడు. మీరు చెబుతున్న ఘటనకు సంబంధించి.. మా సైన్యంలో ఎవరి కోసం భారత అధికారులు సంప్రదింపులు జరపలేదు" అని బ్రిటన్ రక్షణశాఖ ప్రతినిధి రియాన్ షిల్లాబీర్ వెల్లడించారు. ఇక భారత్ విడుదల చేసిన ఫొటో బ్రిటిష్ సిక్కు సైనికుడిదని అతని పేరు, దాని స్పెల్లింగ్ సరిపోలడం లేదన్నారు. భారత్‌లో ఉగ్రవాద, నేరాలకు సంబంధించిన దర్యాప్తు అంశాలను ఆ దేశ పౌర, సైనిక అధికారులనే అడగాలని రియాన్ సూచించారు. మరోవైపు బ్రిటన్ సమాధానంపై పంజాబ్ డీజీపీ స్పందించారు. తమ అధికారులు దర్యాప్తులో గుర్తించిన అంశాలకు తాను కట్టుబడి ఉన్నట్లు గౌరవ్ యాదవ్ వెల్లడించారు. సాధారణంగా ఆయా దేశాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారు ఇలాంటి వాటిల్లో నిందితులంటే.. ఆయా దేశాల ఏజెన్సీలే అంగీకరించకపోవడం సహజమని వెల్లడించారు. అసలేం జరిగింది..పంజాబ్‌లోని ఓ పోలీస్ పోస్టుపై దాడి చేసిన ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్‌కు చెందిన ఉగ్రవాదులు యూపీలోని పీలీభీత్‌లో ఆశ్రయం పొందినట్లు భద్రతా దళాలకు సమా చారం అందింది. ఈనేపథ్యంలో యూపీ, పంజాబ్ పోలీసులు పురాన్‌పుర్ ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా.. ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని వెంబడించగా.. ఓ వంతెనపై ఉగ్రవాదులు కాల్పులు మొదలుపెట్టారు. పోలీసులు ప్రతిదాడి చేయడంతో ముగ్గురు ఉగ్రవాదు లు మరణించారు. ఈ దాడి వెనక పాక్ ఐఎస్ఐ మద్దతుతో పనిచేసే ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ నేత రంజీత్ సింగ్‌నీత, గ్రీస్‌లోని జస్విందర్ సింగ్ మన్నూ, యూకేలో సైనికుడిగా పనిచేస్తున్న జగ్‌జీత్ సింగ్ అలియాస్ ఫతేసింగ్ బాగీ హస్తం ఉన్నట్లు డీజీపీ ట్విటర్ పోస్టులో వెల్లడించారు.
ఎవరీ జగ్‌జీత్ సింగ్..
అధికారుల కథనం ప్రకారం.. తర్న్ తరాన్ జిల్లాలోని మియాన్‌పుర్ గ్రామానికి చెందిన జగ్‌జీత్ సింగ్ (37) ఓ సైనిక కుటుంబానికి చెందినవాడు. దాదాపు పదేళ్ల క్రితం విద్యార్థి వీసాపై బ్రిటన్‌కు వెళ్లాడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ చేశాడు. ఆ తర్వాత అతడు బ్రిటీష్ సైన్యంలో సిపాయిగా చేరాడు. అక్కడ శిక్షణ పూర్తిచేసుకొని ఇన్‌ఫ్రాంట్రీ రెజిమెంట్‌లోని నాలుగో బెటాలియన్ పోస్టింగ్ వచ్చింది. ఆ తర్వాత అఫ్గానిస్థాన్‌లో కూడా కొన్నాళ్లు విధులు నిర్వర్తించాడు. తొలిసారి ఓ బ్రిటన్ సైనికుడు ఉగ్రవాద కుట్రలో భాగమని తేలిందని చెబుతున్నారు. అతడిని ఇందులోకి లాగడంలో పాక్‌కు చెందిన ఐఎస్ఐ పాత్రను కొట్టిపారేయలేమంటున్నారు.

## మొబైల్ టవర్ బ్యాటరీలు చోరీ.. 9 మంది అరెస్టు

**పాల్గర్:** మొబైల్ ఫోన్ టవర్లకు చెందిన సర్వర్ రూముల నుంచి బ్యాటరీలు ఎత్తుకెళ్తున్న దొంగల ముఠాను మహారాష్ట్ర పోలీసులు పట్టుకున్నారు. ఆ ముఠాలోని 9 మంది సభ్యుల్ని అరెస్టు చేశారు. పాల్గర్ జిల్లాలో వాళ్లను అదుపులోకి తీసుకున్నారు. డిసెంబర్ 5వ తేదీన బాలివాలి గ్రామంలో ఉన్న మొబైల్ టవర్ సర్వర్ రూమ్ నుంచి సుమారు 12వేలు ఖరీదైన 24 బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. టవర్ క్యాబిన్ తాళం పగులగొట్టి, బ్యాటరీలనుచోరీ చేస్తున్నారని పోలీసు ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ బదాక్ తెలిపారు. మాండ్వి పోలీసులు 303(2) చోరీ కేసు బుక్ చేసి దర్యాప్తు చేపడుతున్నారు.మొబైల్ టవర్ల నుంచి బ్యాటరీలు ఎత్తుకెళ్తున్న ఘటనలు ఇటీవల పాల్గర్ సమీపంలో ఎక్కువయ్యాయి.దీంతో పోలీసులు దొంగల కోసం గాలింపును ముమ్మరం చేశారు. సీసీటీవీ ఫుటేజ్,టెక్నికల్,నిఘా ఇంటెలిజెన్స్ ద్వారా దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. దీనిలో భాగంగానే 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. దీంట్లో ఇద్దరు స్క్రాప్ డీలర్లు కూడా ఉన్నారు. నిందితుల్ని విచారిస్తున్న సమయంలో.. అనేక విషయాలు వెలుగు చూశాయి. వాసాయి, విరార్, వాడా, బోయిసర్ ప్రాంతాల్లో జరిగిన బ్యాటరీ చోరీలు తామే చేసినట్లు పేర్కొన్నారు. మాండ్వి, విరార్, పెల్హార్, నయిగావ్, బోయిసర్‌లో ఆరు కేసులు బుక్కయ్యాయి.

## వాజ్‌పేయి నిత్యం ప్రేరణగా నిలిచారు: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: భారత్‌ను 21వ శతాబ్దం వైపు మళ్లించిన శిల్పి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత ఆర్థిక ప్రగతికి బాటలు వేసిన సంస్కర్త అటల్‌జీ అని తెలిపారు. ఆశ్రితపక్షపాత ఆర్థిక విధానాలకు ఆయన చరమగీతం పాడినట్లు చెప్పారు. ఇవాళ వాజ్‌పేయి నూరవ జయంతి. ఈ నేపథ్యంలో మోదీ ఓ ఆర్టికల్ రాశారు. అటల్‌జీ తన పార్లమెంట్ కాలంలో.. ఎక్కువ శాతం ప్రతిపక్ష బెంచ్‌లకే పరిమితమైనట్లు చెప్పారు. ఎప్పుడు కూడా ఆయన కాంగ్రెస్ పట్ల విస్మయాన్ని ప్రదర్శించలేదన్నారు. కానీ కాంగ్రెస్ మాత్రం అటల్‌జీని దేశద్రోహి అని ఆరోపించిందన్నారు.మాజీ ప్రధాని అటల్.. ఓ రాజనీత్మజ్ఞుడు అని, ఆయన నిత్యం ప్రజలకు ప్రేరణగా నిలుస్తున్నారన్నారు. 90 దశకంలో దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్నదని, 9 ఏళ్లలో నాలుగు సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగాయని, ఆ సమయంలో వాజ్‌పేయి స్థిరమైన, ప్రభావంతమైన పరిపాలన అందించినట్లు చెప్పారు. సాధారణ ప్రజల పోరాటాన్ని వాజ్‌పేయి గుర్తించారన్నారు. ఆయన నాయకత్వ నైపుణ్యం సుదీర్ఘ కాలం అనేక రంగాలపై ప్రభావం చూపిందన్నారు. వాజ్‌పేయి అధికారంలో ఉన్న సమయంలో.. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, టెలికాం అండ్ కమ్యూనికేషన్స్ రంగాలు విశేష ప్రగతిని సాధించాయన్నారు.ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ఢిల్లీ మెట్రోకు కూడా వాజ్‌పేయి పెద్దపీట వేసినట్లు తెలిపారు. గోల్డెన్ క్వాడ్రిలెటరల్ ప్రాజెక్టు కూడా ఆయన కీర్తిని పెంచిందన్నారు. సర్వశిక్షా అభియాన్ ద్వారా ఆయన ఆధునిక విద్యను అందించే ప్రయత్నం చేశారన్నారు. న్యూక్లియర్ పరీక్షలు చేపట్టి ఆ తర్వాత జరిగిన పరిణామాలను ఎదుర్కొన్న తీరు వాజ్‌పేయి నాయకత్వాన్ని చాటుతుందన్నారు.వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఢిల్లీ లోని సదైవ్ అటల్ స్మారకం వద్ద నేతలు పుష్పగుచ్చాలు ఉంచి నివాళి అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధనకడ్, స్పీకర్ బిర్లా , ప్రధాని మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు ఇతర కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు వాజ్‌పేయికి నివాళి అర్పించారు.

## ఆర్మీ ఆఫీసర్ అమితాబ్ జా మృతి పట్ల యూఎన్ సెక్రటరీ జనరల్ నివాళి



**న్యూఢిల్లీ:** ఐక్యరాజ్యసమితికి చెందిన పీస్‌కీపింగ్ దళంలో కమాండర్‌గా చేస్తున్న భారతీయ ఆర్మీ ఆఫీసర్, బ్రిగేడియర్ అమితాబ్ జాఇటీవల ఆకస్మికంగామృతిచెందారు. ఆయన మృతి పట్ల యూఎన్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ నివాళి అర్పించారు. సంక్లిష్టమైన సిరియా-ఇజ్రాయిల్ సరిహద్దు సమీపంలో ..యూఎన్ పీస్‌కీపింగ్ ఫోర్స్‌కు అమితాబ్ జా నాయకత్వం వహించారు. యూఎన్ డిస్‌ఎంగేజ్మెంట్ అబ్జర్వర్ ఫోర్స్‌కు తాత్కాలిక కమాండర్‌గా చేశారాయన. అయితే ఆయన ఆకస్మికంగా మృతి చెందడం పట్ల సెక్రటరీ జనరల్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.సిరియాలో అసద్ ప్రభుత్వం కూలిన సమయంలో.. యూఎన్‌డీఓఎఫ్‌కు యాక్టింగ్ ఫోర్స్ కమాండర్‌గా అమితాబ్ చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో డిప్యూటీ ఫోర్స్ కమాండర్‌గా చేరారు. అయితే సిరియాలో సంక్షోభం ఏర్పడిన సమయంలో ఆ దళానికి ఆయన యాక్టింగ్‌చీఫ్‌గా చేశారు. యూఎన్‌డీఓఎఫ్ దళాన్ని 1974లో ఏర్పాటు చేశారు. భద్రతా మండలి ఆధ్వర్యంలో ఆ దళం .. ఇజ్రాయిల్, సిరియా సరిహద్దుల్లో కాల్పుల విమరణ చేపట్టేలా చూసుకుంటుంది. యూఎన్‌డీఓఎఫ్ దళంలో 201 మంది భారతీయ సైనిక సిబ్బంది ఉన్నది. ఆ దళంలో వివిధ దేశాలకు చెందిన 1117 మంది సైనికులు ఉన్నారు.

## సిమ్ స్వాప్ చేసి.. రూ. ఏడు కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

**ముంబయి:** అమాయకుల నుంచి డబ్బులు కొట్టేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పంథాల్ని అనుసరిస్తున్నారు. తాజాగా ఓ వ్యాపారి ఈ నేరగాళ్ల చేతికి చిక్కాడు. అతడి సిమ్ స్వాప్ చేసి, రూ.7.5 కోట్లు కొట్టేశారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..ముంబయిలోని కందివాలీకి చెందిన ఓ వ్యాపారవేత్త తాజాగా స్కామర్ల బారినపడ్డారు. అతడి ఖాతాలో ఉన్న రూ.కోట్లు దండుకుందామని ప్లాన్ చేశారు స్కామర్లు. అందుకుతగ్గట్టుగానే సిమ్ స్వాప్ చేశారు. నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను ట్రిక్ చేసి, టార్గెట్ చేసిన వ్యక్తి మొబైల్ నంబర్‌ను తమ వద్ద ఉన్న సిమ్ కార్డుకు లింక్ చేసి, బ్యాంక్ నుంచి వచ్చే ఓటీపీలను తెలుసుకోగలిగారు. తర్వాత ఖాతాలో డబ్బును ఖాళీ చేయడం ప్రారంభించారు. అయితే తన ఖాతా నుంచి అనుమానాస్పద విత్‌డ్రాలు గుర్తించిన యజమాని వెంటనే అప్రమత్తమయ్యారు.సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేసి, మోసం గురించి వివరించారు. దాంతో వెంటనే స్పందించిన అధికారులు ఆ బ్యాంక్ నోడల్ అధికారులను సంప్రదించారు. అలాగే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ తక్షణ స్పందనతో సైబర్ పోలీస్ టీమ్ రూ.4.65 కోట్లను ఫ్రీజ్ చేసి, నేరగాళ్ల చేతికి చిక్కకుండా ఆపగలిగారు. అయితే మిగిలిన మొత్తం అప్పటికే స్కామర్ల చేతికి చిక్కింది. వారు ఆ సొమ్మును వేర్వేరు ఖాతాల్లోకి బదిలీ చేసి, విత్‌డ్రా చేసుకున్నారని అధికారులు తెలిపారు.


# ఏపీలో కూడా టికెట్ల ధరల పెంపునకు అనుమతి ఇవ్వొద్దు..

## ఏపీ సీఎం చంద్రబాబుకు సీపీఐ లేఖ



విశ్వంభర, అమరావతి: తెలంగాణ తరహాలో ఏపీలో కూడా టికెట్ల ధరల పెంపునకు, బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వద్దని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. పెద్ద హీరోల సినిమాలకు టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచడం పరిపాటిగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ప్రేక్షకుల జేబులు కొల్లగొట్టడమేనని అభిప్రాయపడ్డారు. అందుకే టికెట్ ధరలను పెంచడం, బెనిఫిట్ షోలకు అనుమతించే విధానాలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి కె.రామకృష్ణ ఓ లేఖ రాశారు. పెద్ద హీరోల సినిమాలకు టికెట్ల ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినిస్తూ జీవోలు జారీ చేడయం పరిపాటిగా మారిందని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఇది ప్రేక్షకుల జేబులను కొల్లగొట్టడమే అని అభిప్రాయపడ్డారు. పెద్ద హీరోల సినిమాలను కొన్ని నిర్మాణ సంస్థలు పోటీపడి వందల కోట్ల రూపాయల భారీ బడ్జెట్లతో, ఏళ్ల తరబడి చిత్రీకరిస్తున్నాయని అన్నారు. కనీస సామాజిక స్పృహలేని ఆయా సినిమాల కలెక్షన్ల కోసం టికెట్ ధరలను పెంచాల్సిందిగా, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతినివ్వాల్సిందిగా నిర్మాణ సంస్థలు ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నాయని పేర్కొన్నారు. సినిమా రంగానికి తలొగ్గి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా టికెట్ల ధరలను విపరీతంగా పెంచుకునేందుకు, బెనిఫిట్ షోలు వేసేందుకు అనుమతించాయని చెప్పారు. ఈ విధానాలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోవడంపై రామకృష్ణ విచారం వ్యక్తం చేశారు. రేవతి కుమారుడు శ్రీతేజ అపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని అన్నారు. ఈ దుర్ఘటన తర్వాత ఇకపై తెలంగాణలో సినిమా టికెట్ల ధరలను పెంచబోమని, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. తెలంగాణ తరహాలో ఏపీలో కూడా సినిమా టికెట్ల ధరలు పెంచబోమని, ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతి ఇవ్వబోమనే ప్రకటన చేయాలని కోరారు.

# విజయవాడలో వాజ్‌పేయి విజ్ఞాన కేంద్రం.. ప్రారంభించిన ఎమ్మెల్యేలు మండలి, సుజనా



**విశ్వంభర, విజయవాడ:** నగరంలోని ప్రసిద్ధ రామ్మోహన్ గ్రంథాలయంలో వాజ్‌పేయి విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కృష్ణా జిల్లా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి.. ఈ విజ్ఞాన కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మహాత్మాగాంధీ పాదస్పర్శతో పునీతమైన రామ్మోహన్ గ్రంథాలయంలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. ఈ గ్రంథాలయం కొన్నాళ్ళుగా వైభవాన్ని కోల్పోయిందని, మళ్లీ నిర్వాహకులు పూర్వ వైభవం తేవడం అభినందనీయమని చెప్పారు. రాజకీయాలకు ఔన్నత్యం తెచ్చిన గొప్ప నాయకుడు వాజ్ పేయి.. ఆయన పేరును ఈ విజ్ఞాన కేంద్రానికి పెట్టడం మంచి పరిణామమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. 117 ఏళ్ల చరిత్ర కలిగిన గ్రంథాలయానికి పూర్వవైభవం తేవడం గొప్ప విషయమన్నారు. విజయవాడ తన జన్మభూమి అని.. హైదరాబాద్ వెళ్లినా, అమెరికా వెళ్లినా అవన్నీ కర్మభూములేనని సుజనా అన్నారు. ఈ గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని సుజనా చౌదరి హామీ ఇచ్చారు.

# భారతజాతి గర్వించదగ్గ నేత వాజ్‌పేయి : చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి :** భారతజాతి గర్వించదగ్గ నేత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా వాజ్‌పేయికి నివాళి అర్పించారు. దూరదృష్టి కారణంగా ప్రస్తుతం మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందని , దేశం గురించి ఆయన ఆలోచించే తీరు విలక్షణమైందన్నారు. సంస్కరణల ప్రతిపాదనలపై ఆయన స్పందించిన తీరు ఎన్నటికీ మరచిపోలేదని అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీలో వాజ్‌పేయి సమాధి వద్ద చంద్రబాబు నివాళి అర్పించారు.

# భవానీ దీక్షల విరమణ.. ఇంద్రకీలాద్రిపై భారీ రద్దీ



**విశ్వంభర, విజయవాడ:** భవానీ దీక్షల విరమణతో విజయవాడ లోని ఇంద్రకీలాద్రిపై భారీగా రద్దీ నెలకొంది. దీక్షల విరమణ చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున భవానీలు తరలివస్తున్నారు. ఆలయ అధికారులు అన్ని క్యూ లైన్లలోనూ ఉచితంగానే దుర్గమ్మ దర్శనానికి అనుమతిస్తున్నారు. క్యూలో ప్రవేశించిన వారికి దర్శనం పూర్తయ్యేసరికి 2నుంచి 3గంటల సమయం పడుతోంది. జగన్మాత నామస్మరణతో ఇంద్రకీలాద్రి ప్రతిధ్వనిస్తోంది. అమ్మవారి దర్శనం అనంతరం భవానీ ఘాట్, పున్నమి ఘాట్, సీతమ్మవారి పాదాల సమీపంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక కేశఖండనశాల వద్ద దీక్షాదారులు తలనీలాలు సమర్పిస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నారు. పూర్ణాహుతితో భవానీ దీక్షల విరమణ కార్యక్రమం పరిసమాప్తం కానుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివస్తోన్న భవానీలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఆలయ ఈవో రామారావుతోపాటు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఇతర శాఖల అధికారులు మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి భక్తుల రద్దీ, దర్శనాలు, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# మరింత సమన్వయంతో ముందుకెళ్దాం.. ఎన్డీయే నేతల సమావేశంలో నిర్ణయం



ఢిల్లీ: పార్లమెంట్ లోపల, బయటా మిత్రపక్షాల సమన్వయం మరింత పెంచుకోవడంపై ఎన్డీయే పక్షాలు దృష్టి సారించాయి. ఈ మేరకు దిల్లీలో భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఎన్డీయే పక్షాల ముఖ్యనేతలు చర్చలు జరిపారు. ఈ సమావేశానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తెలుగుదేశం అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు, జేడీఎస్ ముఖ్యనేత కుమారస్వామి, ఇతర నేతలు హాజరయ్యారు. అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యల నేపథ్యంలో పార్లమెంట్‌లో రేగిన దుమారం సహా పలు రాజకీయ అంశాలపై ఎన్డీయే నేతలు చర్చించినట్లు తెలిసింది. వాజ్‌పేయి శత జయంతి వేళ సుపరిపాలన అంశంపైనా నేతలు సమాలోచనలు జరిపారని సమాచారం. జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును ఇప్పటికే జేపీసీకి పంపినందున అక్కడ కూడా సమన్వయం ఆవశ్యకతపై చర్చించినట్లు తెలిసింది. మిత్రపక్షాల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవడం సహా కేంద్ర ప్రభుత్వ పథకాలను లోక్‌సభ నియోజకవర్గాల్లో సమర్థంగా అమలు చేసే అంశాలపై చర్చించినట్లు సమావేశం అనంతరం తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు.

## కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు ప్రత్యేక భేటీ..

దివంగత నేత, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి నేపథ్యంలో ఎన్డీయే నేతలు ఢిల్లీలో భేటీ అయ్యారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా , ఏపీ సీఎం చంద్రబాబు , కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో పాటు పలువురు ఎన్డీయే మిత్రపక్షాలకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సమావేశానికి సంబంధించిన అజెండాను అధికారికంగా ప్రకటించనప్పటికీ.. సుపరిపాలన, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. ఈ భేటీలో పాల్గొన్నవారిలో జేడీయూ నేత, కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్, అప్నాదళ్ (ఎస్) అధ్యక్షురాలు, కేంద్రమంత్రి అనుప్రియా పటేల్, జేడీఎస్ నేత, కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, హిందుస్థానీ అవామ్ మోర్చా (ఎస్) నేత, కేంద్రమంత్రి జితన్ రామ్ మాంఝీ, ఆర్ఎల్ఎం అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహా, భారత్ ధర్మ జనసేన పార్టీ అధ్యక్షుడు తుషార్ వెల్లప్పల్లి తదితరులు హాజరయ్యారు. మరోవైపు, దేశ వ్యాప్తంగా ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లుల పరిశీలనకు పీపీ చౌధరి సారథ్యంలో ఏర్పాటైన జేపీసీ జనవరి 8న సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్డీయే భేటీ తర్వాత భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సుమారు 15 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఆ తర్వాత నడ్డా నివాసంలోనే కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి.. సీఎం చంద్రబాబును కలిశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను గట్టెక్కించడంపై చర్చించారు. అనంతరం రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్.. చంద్రబాబుతో భేటీ అయ్యారు. రైల్వే జోన్ సహా, రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధి అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది.

# ఏపీని కలవరపెడుతున్న వరుస అల్పపీడనాలు.. కోస్తా, రాయల సీమలో వర్షాలు



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌ను వరుస అల్పపీడనాలు కలవరపెడుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం రానున్న 24 గంటల్లో పశ్చిమ నైరుతిగా పయనించి దక్షిణ కోస్తా తీరంవైపు వచ్చే క్రమంలో బలహీనపడుతుందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. తీవ్ర అల్పపీడనం కారణంగా గత వారం రోజులుగా ముసురు నెలకొని ఉండడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించారు. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో వర్షాలు పడుతయాని తెలిపారు. కాగా ప్రస్తుతమున్న అల్పపీడనం బలహీనపడుతున్న దశలో మరోటి ఏర్పడే అవకాశముందని వివరించారు. ఇటీవల కాలంలో బంగాళాఖాతంలో డిసెంబర్ నెలలో వరుస అల్పపీడనాలు ఏర్పడడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

# టీటీడీకి రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈవో భారీ విరాళం



విశ్వంభర, తిరుమల : తిరుమల వేంకటేశ్వరస్వామికి ఓ భక్తుడు భారీ విరాళం అందజేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈవో పి.ఎం.ఎస్ .ప్రసాద్ బుధవారం టీటీడీ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు కోటి పదకొండు లక్షల పదకొండు వేల నూట పదకొండు రూపాయలను విరాళంగా అందించారు. ఈ మేరకు విరాళం డీడీని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. ఇటీవల తిరుపతికి చెందిన వ్యాపారి ఒకరు స్వామివారికి కోటి రూపాయలను అందజేసిన విషయం తెలిసిందే.

## జనవరి 7న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంనిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది , ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం , వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించడం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# రైతులకు మరింత మేలు చేకూర్చే విధంగా కార్యక్రమాలు: మంత్రి అచ్చెన్నాయుడు



విశ్వంభర, విజయవాడ: సహకార శాఖ ద్వారా రైతులకు మరింత మేలు చేకూర్చే కార్యక్రమాలు చేపడతామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర సహకార శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 'సహకారంతో సంవృద్ధి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా 10,212 నూతన బహుళ ప్రయోజన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు,మత్స్యకార సహకార సంఘాలను 2023నుంచి రిజిస్టర్ చేసి నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 932 డెయిరీ సహకార సంఘాల ద్వారా రోజుకు 1,60,000 లీటర్ల పాల సరఫరా జరుగుతోందని వెల్లడించారు. తద్వారా 45,000 కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

**విశ్వంభర, నిడదవోలు:** రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి దుర్గేశ్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణం లోని అంబేద్కర్ కాలనీలో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని స్వయంగా ప్రొక్లైన్ నడుపుతూ పనులు ప్రారంభించారు. రూ.45 లక్షల అం చనా వ్యయంతో నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో గల బి.టి రోడ్డు, సీసీ రోడ్ల మరమ్మ తుల పనులకు స్థానిక అధికారులు, కూటమి నేతలతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఇప్పటికే నియోజకవర్గానికి రూ. 11 కోట్ల నిధు లు తీసుకొచ్చామని, రాబోయే రోజుల్లో నిడద వోలు పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇస్తూ ఆ దిశగా కృషి చేద్దా మని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ ఛైర్ పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, డీఈ హరిబాబు, కూటమినేతలు వెంకటేశ్వర్ రావు, రంగ రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# తిరుమల కాలినడక మార్గంలో భారీ కొండ చిలువ




**విశ్వంభర, తిరుమల:** తిరుమలలో భారీ కొండ చిలువ హల్‌చల్ చేసింది. అలిపిరి కాలినడక మార్గంలో 2500 మెట్టు వద్ద ఓ దుకాణంలో 14 అడుగుల భారీ కొండ చిలువ నక్కింది. దాన్ని చూసిన దుకాణదారులు స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడుకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్న భాస్కర్ నాయుడు చాకచక్యంగా కొండ చిలువను పట్టుకున్నారు. అనంతరం అటవీ ప్రాంతంలో వదిలేశారు.

# ఏపీ ఇంటర్ విద్యార్థులకు ఇదే చివరి అవకాశం

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మరోసారి గడువును పొడిగించింది. ఇక గడువును పొడిగించేది లేదని స్పష్టం చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికిగాను వచ్చే ఏడాది మార్చి నెలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజర య్యేందుకు పరీక్ష ఫీజు తేదీని డిసెంబర్ 24 ఆఖరుగడువని స్పష్టంచేసింది. ఫీజుగడువు ముగియడంతో ఈనెల 31 వరకు తత్కాల్ పథకం కింద ఫీజు చెల్లించవచ్చని ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి కృతికాశుక్లా తెలిపారు. గతంలో ఫీజు చెల్లించలేకపోయిన వారు అపరాధ రుసుముతో కలిపి ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు విడివిడిగా రూ. 3 వేల చొప్పున చెల్లించాలని ఆమె సూచించారు. పరీక్షఫీజుకు సంబంధించి భవిష్యత్‌లో ఇక ఎలాంటి పొడిగింపు ఉండదని ఆమె స్పష్టం చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు ,ప్రైవేట్ (ఫెయిలైన) విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 1 నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ ఫస్ట్ ఇయర్, మార్చి 3 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ సెకండ్ ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి .

# నంద్యాలలో విషాదం.. హిజ్రాతో ప్రేమలో కుమారుడు.. అవమానం భరించలేక తల్లిదండ్రుల ఆత్మహత్య



**విశ్వంభర, నంద్యాల:** నంద్యాలలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన సుబ్బరాయుడు, సరస్వతి దంపతుల కుమారుడు సునీల్ బీటెక్ మొదటి సంవత్సరం ఫెయిలయి ఆటో డ్రైవర్లతో స్నేహమేర్పచుకుని హిజ్రాలతో కలసి తిరుగున్నాడు. ఈ క్రమంలో ఓ హిజ్రాతో కొనసాగిస్తున్న ప్రేమ వ్యవహారాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు కుమారుడిని మందలించారు. విషయం తెలుసుకున్న హిజ్రాలు సుబ్బరాయుడు దంపతులు నడుపుతున్న దుకాణం వద్దకు వచ్చి అసభ్యకరంగా వ్యవహరించారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం, కుమారుడు తన వైఖరిని మార్చుకోకపోవడంతో మనస్తాపానికి గురై తల్లిదండ్రులిద్దరూ పురుగు మందు తాగారు. స్థానికులు గమనించి వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ అసుపత్రిలో చేర్పించారు. అక్కడ వారి పరిస్థితి విషమంగా మారడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ద్విచక్ర ర్యాలీ

విశ్వంభర, విశాఖ: సీపీఎం జిల్లా మహా సభలు జయప్రదం చేయాలని పార్టీ ఆధ్వర్యంలో జగదాంబ నుంచి పూర్ణ మార్కెట్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. పార్టీ నగర నాయకులు పి.వెంకటరెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 28, 29 తేదీలలో పెందుర్తిలో సభలు నిర్వహిస్తామని తెలిపారు.



## క్రిస్మస్ తాతగా మారిన ఎంఎస్ ధోని

**క్రిడావిభాగం :** ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈ సంబురాల్లో దేశంలోని పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు క్రిస్మస్ పార్టీల్లో పాల్గొంటూ సందడి చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని తాజాగా నేడు క్రిస్మస్ సందర్భంగా ఇలా ఫ్యామిలీ సెలబ్రేషన్స్ లో క్రిస్మస్ తాతలా మారి అలరించాడు. క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఫోటోలను ధోని భార్య సాక్షి సింగ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. క్రిస్మస్ రోజున కొత్త అవతార్‌లో కనిపించిన లెజెండరీ ఇండియా కెప్టెన్ మళ్లీ ఇంటర్నెట్‌ను గెలుచుకున్నాడు. ఎంఎస్ ధోని అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై ఐదేళ్లకు పైగా గడిచినందున, అతను తరచుగా తన కుటుంబంతో ఎక్కువ సమయం గడుపుతూ ఉంటాడు. అతని భార్య సాక్షి ధోని పంచుకున్న ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో, భారత మాజీ కెప్టెన్ శాంతా క్లాజ్ దుస్తులలో ఆమె మరియు వారి కుమార్తె జివాతో కలిసి మారువేషంలో కనిపించారు. పోస్ట్ చేసిన రెండు గంటల్లోనే 5,00,000కి పైగా లైక్‌లను సేకరిస్తూ ఈ పోస్ట్ ఇంటర్నెట్‌ను ఉన్మాదంలోకి నెట్టింది.ఎంఎస్ ధోని కొత్త 'శాంతా క్లాజ్' లుక్‌తో ఇంటర్నెట్‌ను అబ్బురపరిచాడు, భార్య సాక్షి మరియు కుమార్తె జీవాఎంఎస్ ధోని మరోసారి ఇంటర్నెట్‌ను గెలుచుకున్నాడు.

## నాలుగో టెస్ట్‌లో విజయం వారిదే.. : రవిశాస్త్రి



**క్రిడావిభాగం :** ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్ వేదికగా నాలుగో టెస్ట్ ప్రారంభం కానుంది. ఇప్పటికే జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలవగా.. మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. సిరీస్‌పై పట్టు సాధించాలంటే ఇరు జట్లకు నాలుగో టెస్ట్ గెలవడం కీలకం. ఈ క్రమంలో గెలుపే లక్ష్యంగా ఇరు జట్లు సిద్ధమవుతున్నాయి. మరోవైపు ఈ మ్యాచ్ కోసం అత్యంత వేగవంతమైన పిచ్‌ను సిద్ధం చేశారు. దాంతో ఈ మ్యాచ్‌లో భారత జట్టుకు కఠిన సవాల్ తప్పదని ఆసీస్ మాజీ క్రికెటర్లు హెచ్చరిస్తున్నారు. మరోవైపు భారత మాజీ ఆటగాళ్లు మాత్రం ఈ మ్యాచ్‌లో భారత్ గెలుస్తోందని, గతంలో ఇక్కడ జరిగిన మ్యాచ్‌ల్లో విజయం సాధించిందని గుర్తు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మెల్ బోర్న్ టెస్ట్‌లో గెలిచే జట్టు ఏదో టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అంచనా వేసారు. భారత జట్టు గెలుస్తుందని జోస్యం చెప్పారు. 'ఈ మ్యాచ్ చాలా రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. భారత జట్టుకే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సిరీస్ గెలుచుకునే అవకాశాలు దక్కుతాయి. పెర్త్, అడిలైడ్, బ్రిస్బేన్ టెస్ట్‌ల తర్వాత ఏదైన విదేశీ జట్టు సిరీస్‌లో సమంగా నిలిస్తే.. మిగతా మ్యాచ్‌లు గెలుచుకోవడం సులువవుతోంది. గత పర్యటనలోనూ భారత జైత్రయాత్ర మెల్ బోర్న్ నుంచే మొదలైంది. అయితే ఇరు జట్ల మధ్య మాత్రం హోరాహోరీ పోరు ఉంటుంది. రెండు జట్లు ఈ సిరీస్‌లో అద్భుతంగా ఆడుతున్నాయి.

అయితే ఆస్ట్రేలియా టాపార్డర్ తడబడుతోంది. ఇలా ఆసీస్ టాపార్డర్ తడబడటం చూసి చాలా కాలం అయ్యింది. ఆసీస్ బలహీనతపై భారత్ దెబ్బకొట్టాలి. యువ ప్లేయర్ సామ్ కోన్‌స్టాస్ జట్టులోకి రావడం ఆసీస్‌కు కలిసొచ్చే అంశం. అతను మంచి నైపుణ్యం కలిగిన ఆటగాడు. అయితే టెస్ట్ క్రికెట్‌లో టెక్నిక్ ఉంటేనే రాణించగలం. ఈ సిరీస్‌లో సామ్ కోన్‌స్టాస్ రాణిస్తే.. భవిష్యత్తు స్టార్‌గా ఎదుగుతాడు.'అని రవి శాస్త్రి చెప్పుకొచ్చాడు.

### మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్.. భారత జట్టు ప్రకటన..

# ముగ్గురు తెలుగు అమ్మాయిలకు చోటు

**క్రిడావిభాగం :** మలేషియాలోని కౌలాలంపూర్‌లో వేదికగా త్వరలో జరగబోయే అండర్19 మహిళా టీ20 ప్రపంచ కప్ తుది జట్టులో తెలుగు అమ్మాయిలు చోటు దక్కించుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన గొంగడి త్రిష, కేసరి ధృతితో పాటు విశాఖపట్నంకు చెందిన షబ్నం అండర్19 ప్రపంచకప్‌కు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన మహిళల అండర్19 ఆసియా కప్ టోర్నీలో ఈ ముగ్గురూ అద్భుత ప్రతిభకనబరచడంతో వీరికి బీసీసీఐ జట్టులో చోటుకల్పించింది. ఈ అండర్19 మహిళా టీ 20 ప్రపంచ కప్ టోర్నీ జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరగనుంది. ఈ కప్ కోసం మొత్తం 16 జట్లు పోటీపడుతున్నాయి.

క్రీడలలో తెలుగుతేజాల సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా మహిళా క్రికెట్ విషయంలో తెలుగు బిడ్డలు తమ సత్తా చాటుతున్నారు. ఇప్పటికే క్రీడలలో తమ సత్తా చాటుతున్న తెలుగు అమ్మాయిలు మరోసారి తమ సత్తా చాటేందుకు రెడీ అవుతున్నారు. మహిళల అండర్19 టీ20 ప్రపంచకప్ టోర్నీకి బీసీసీఐ మహిళా జట్టును మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను ప్రకటించింది. అయితే ఈ జట్టుకు నిక్కీ ప్రసాద్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా...సానికా చాల్కే వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. అయితే ఈ జట్టులో ముగ్గురు తెలుగు అమ్మాయిలు చోటు దక్కించుకోవడం విశేషం. వీరిలో తెలంగాణ నుంచి గొంగడి త్రిష, కేసరి ధృతిలు ఉండగా ఏపీ నుంచి షబ్నమ్ ఉన్నారు. ఇకపోతే తెలంగాణ నుంచి జట్టులో స్థానం సంపాదించిన క్రీడాకారులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.



**కౌలాలంపూర్‌లో అండర్-19 మహిళా టీ20 ప్రపంచ కప్ టోర్నీ**

మలేషియాలోని కౌలాలంపూర్‌లో వేదికగా త్వరలో జరగబోయే అండర్19 మహిళా టీ20 ప్రపంచ కప్ తుది జట్టులో తెలుగు అమ్మాయిలు చోటు దక్కించుకున్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన గొంగడి త్రిష, కేసరి ధృతితో పాటు విశాఖపట్నంకు చెందిన షబ్నం అండర్19 ప్రపంచకప్‌కు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన మహిళల అండర్19 ఆసియా కప్ టోర్నీలో ఈ ముగ్గురూ అద్భుత ప్రతిభకనబరచడంతో వీరికి బీసీసీఐ జట్టులో చోటుకల్పించింది. ఈ అండర్19 మహిళా టీ 20 ప్రపంచ కప్ టోర్నీ జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరగనుంది. ఈ కప్ కోసం మొత్తం 16 జట్లు పోటీపడుతున్నాయి. ఈ 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్6కు అర్హత సాధిస్తాయి. సూపర్ సిక్స్‌లోని రెండు గ్రూప్‌లలోని టాప్ 2 జట్లు సెమీస్‌లోకి ప్రవేశిస్తాయి. ఇకపోతే గ్రూప్‌ఏలో మలేసియా, శ్రీలంక, వెస్టిండీస్,భారత్ జట్లు ఉన్నాయి. జనవరి 19న వెస్టిండీస్‌తో భారత్ తొలి మ్యాచ్ ఆడనుంది. ఇకపోతే 21న మలేసియాతో రెండో మ్యాచ్, జనవరి 23 శ్రీలంకతో మూడో మ్యాచ్‌లో తలపడనుంది. ఇకపోతే అండర్ 19 స్థాయిలో ఇది రెండో మహిళా టీ20 ప్రపంచకప్. 2023లో జరిగిన తొలి అండర్ 19 ప్రపంచకప్‌లో భారత్ గెలుపొంది కప్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

**భారత జట్టు**

నిక్కీ ప్రసాద్(కెప్టెన్), గొంగడి త్రిష, సానికా చల్కే(వైస్ కెప్టెన్), కమిలిని జి(వికెట్ కీపర్), కేసరి ధృతి, ఈశ్వరి అవసరె, మిథిలా వినోద్, జోషితా వీజే, సోనమ్ యాదవ్, పర్ణికా సిసోదియా, ఆయుషి, శుక్లా, అనందితా కిశోర్, షబ్నమ్, వైష్ణవి, భవికా అహిరె (వికెట్ కీపర్).

**స్టాండ్ బై ప్లేయర్లు**

నందన, ఐరా, అనధి

# బెంగాల్‌పై యు ముంబా విజయం..

### తెలుగు టైటాన్స్ ప్లే ఆఫ్స్ ఆశలు గల్లంతు



**పుణే:** ప్రోకబడ్డీ ప్రీమియర్ లీగ్(పీకేఎల్) సీజన్ 11 ప్లే ఆఫ్స్ రేసు నుంచి తెలుగు టైటాన్స్ తప్పుకుంది. ప్లే ఆఫ్స్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో యు ముంబా అద్భుత విజయం సాధించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో యు ముంబా 3627 తేడాతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన యు ముంబా ఫస్టాఫ్‌లో ప్రత్యర్థిని ఒకసారి ఆలౌట్ చేసి విరామ సమయానికి 1810తో ఆధిక్యంలో నిలిచింది. సెకండాఫ్‌లో బెంగాల్ వారియర్స్ పుంజుకున్నా.. యు ముంబా తమ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయం సాధించింది. సెకండాఫ్‌లో ఇరు జట్లు చెరోసారి ఆలౌటయ్యాయి. యు ముంబా తరఫున జఫర్దానెష్(7), కెప్టెన్ సునీల్ కుమార్(5), అజిత్ చౌహాన్(6) సత్తా చాటారు. బెంగాల్ వారియర్స్ తరఫున ప్రణయ్ రానే(12) రాణించినా ఫలితం దక్కలేదు.

ఈ గెలుపుతో యు ముంబా 22 మ్యాచ్‌ల్లో 12 విజయాలు 2 టైలతో ఆరో స్థానంలో నిలిచి ప్లే ఆఫ్స్ చేరింది. మరోవైపు తెలుగు టైటాన్స్ కూడా 22 మ్యాచ్‌ల్లో 12 విజయాలు సాధించింది. కానీ తెలుగు టైటాన్స్ ఒక్క టై కూడా లేకపోవడంతో.. పాయింట్స్ తేడా కూడా తక్కువగా ఉండటంతో ప్లే ఆఫ్స్ చేరలేకపోయింది. బెంగాల్ వారియర్స్ చేతిలో 7 పాయింట్స్ తేడాతో ఓడిపోయి ఉంటే తెలుగు టైటాన్స్‌కు అవకాశం ఉండేది.

పీకేఎల్ ప్లే ఆఫ్స్ ఫార్మాట్ ఏంటంటే..?

ఇతర టోర్నీలతో పోల్చితే ప్రోకబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్ ఫార్మాట్ విభిన్నంగా ఉంటుంది. ఈ టోర్నీలో మొత్తం 6 జట్లు ప్లే ఆఫ్స్ చేరుతాయి. టాప్2లో నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్ 1 , సెమీఫైనల్ 2 చేరుతాయి. తర్వాతి నాలుగు జట్లు ఎలిమినేటర్ 1, ఎలిమినేటర్ 2 మ్యాచ్‌లు ఆడుతాయి. ఎలిమినేటర్ 1లో గెలిచిన జట్టు సెమీఫైనల్ 1, ఎలిమినేటర్ 2లో గెలిచిన జట్టు సెమీఫైనల్ 2 ఆడుతాయి.

టాప్2లో నిలిచిన హర్యానా స్టీలర్స్, దబాంగ్ ఢిల్లీ సెమీఫైనల్ చేరగా.. యూపీ యోధాస్, పట్నా పైరేట్స్ ఎలిమినేటర్ 1, జైపూర్ పింక్ పాంథర్స్, యు ముంబా ఎలిమినేటర్ 2 ఆడనున్నాయి. డిసెంబర్ 26 నుంచి నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి.



## అర్జున్ టెండూల్కర్ అరుదైన ఘనత

**క్రిడావిభాగం :** టీమిండియా క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. వైట్ బాల్ క్రికెట్‌లో 50 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో గోవాకు ప్రాతినిథ్యం వహిస్తున్న అర్జున్ టెండూల్కర్.. ఒడిశాతో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. తద్వారా వైట్ బాల్ క్రికెట్‌లో అర్జున్ టెండూల్కర్ 50 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. 2021లో ముంబై తరఫున దేశవాళీ టీ20ల్లోకి అరంగేట్రం చేసిన అర్జున్ టెండూల్కర్ 41 వైట్ బాల్ మ్యాచ్‌ల్లో 51 వికెట్లు పడగొట్టాడు. 17 లిస్ట్ ఏ మ్యాచ్‌లో ఈ లెఫ్టార్మ్ పేసర్ 24 మంది బ్యాటర్లను ఔట్ చేశాడు. 24 టీ20ల్లో 27 వికెట్లు పడగొట్టాడు.

దేశవాళీ క్రికెట్‌లోకి రాకముందు అర్జున్ టెండూల్కర్ ముంబై తరఫున జూనియర్ లెవెల్ క్రికెట్ ఆడాడు. అండర్ 19 జట్టుకు కూడా ప్రాతినిథ్యం వహించాడు. 2022/23 రంజీ సీజన్‌కు ముందు అర్జున్ టెండూల్కర్ ముంబై నుంచి గోవాకు మారాడు. గోవా తరఫునే లిస్ట్‌ఏతో పాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. అరంగేట్ర ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లోనే అర్జున్ టెండూల్కర్ సెంచరీతో సత్తా చాటాడు.

17 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో అర్జున్ టెండూల్కర్ 37 వికెట్లు పడగొట్టాడు. రంజీ ట్రోఫీలో ఒకసారి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. అతని తండ్రి సచిన్ టెండూల్కర్ 310 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 71 వికెట్లు పడగొట్టాడు. కానీ ఒక్కసారి కూడా ఐదు వికెట్ల ఘనతను అందుకోలేదు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో అర్జున్ టెండూల్కర్‌ను ముంబై ఇండియన్స్ అతని కనీస ధర రూ. 30 లక్షలకు కొనుగోలు చేసింది. 2021లో ముంబై ఇండియన్స్ జట్టులో చేరిన అర్జున్ టెండూల్కర్ ఐపీఎల్ 2023లో అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడి మూడు వికెట్లు పడగొట్టాడు.

## చరిత్ర సృష్టించిన బుమ్రా



**క్రిడావిభాగం :** టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అత్యధిక రేటింగ్ పాయింట్స్‌ను సొంతం చేసుకున్నాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారత పేసర్‌గా చరిత్రకెక్కాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో మూడు టెస్ట్‌ల్లో బుమ్రా 21 వికెట్లు తీసిన విషయం తెలిసిందే. ఈ ప్రదర్శనతో బుమ్రా తాజాగా వెల్లడించిన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. 904 రేటింగ్ పాయింట్స్‌తో టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. తన కెరీర్‌లో బుమ్రా 900 ప్లస్ రేటింగ్ పాయింట్స్ అందుకోవడం ఇదే తొలిసారి. భారత్ నుంచి మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మాత్రం 904 రేటింగ్ పాయింట్స్ అందుకున్నాడు. 2016లో ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్ తర్వాత అశ్విన్ ఈ పాయింట్స్ సాధించాడు. 8 ఏళ్ల తర్వాత బుమ్రా తాజాగా ఈ ఫీట్ అందుకున్నాడు. ఓవరాల్‌గా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో 900 పాయింట్లు ధాటిన 26వ ప్లేయర్‌గా బుమ్రా నిలిచాడు. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. కగిసో రబడా, జోష్‌హజెల్ వుడ్, ప్యాట్ కమిన్స్, రవిచంద్రన్ అశ్విన్ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. రవీంద్ర జడేజా 10వ స్థానంలో ఉన్నాడు. బ్యాటింగ్ విభాగంలో టీమిండియా యువ ఓపెన్ యశస్వి జైస్వాల్ ఓ స్థానం దిగజారి ఐదో స్థానంలో నిలిచాడు. జోరూట్, హ్యారీ బ్రూక్, కేన్ విలియమ్సన్, ట్రావిస్ హెడ్ టాప్4 ప్లేస్‌ల్లో నిలిచారు. భారత్‌తో వరుసగా రెండు సెంచరీలు నమోదు చేసిన ట్రావిస్ హెడ్ ఓ స్థానాన్ని మెరుగుపరుచుకున్నాడు. రిషభ్ పంత్ రెండు స్థానాలు దిగజారి 11వ స్థానంలో నిలిచాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో మూడు మ్యాచ్‌లు ముగియగా.. ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 11తో సమంగా నిలిచాయి. గబ్బా వేదికగా జరిగిన గత టెస్ట్ వర్షం కారణంగా డ్రా అయ్యింది. మెల్ బోర్న్ వేదికగా గురువారం నుంచి నాలుగో టెస్ట్ ప్రారంభం కానుంది.

## స్వల్పంగా పెరిగిన బంగారం ధర

**బిజినెస్ :** నిన్నటి ధరతో పోలిస్తే బుధవారం బంగారం ధర పెరిగింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో నేడు 22 క్యారెట్ల తులం బంగారం ధర గ్రాముకు రూ.10 తగ్గి రూ.70,890 ఉండగా, 24 క్యారెట్ల ధర గ్రాముకు రూ.10 తగ్గి రూ. 77,340 గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 71,040 ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.77,490 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.70,890 ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.77,340 గా ఉంది. కోల్‌కతాలో 10 గ్రాముల పసిడి ధర రూ. 70,890 ఉండగా, 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.77,340 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.70,890 ఉండగా, 24 క్యారెట్ల తులం పసిడి ధర రూ. 77,340 గా ఉంది. కాగా, దేశవ్యాప్తంగా వెండి ధరలు సైతం కొన్ని రోజులుగా తగ్గుతూ వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో నిన్నటి ధరతో పోలిస్తే కిలోకు రూ.100 తగ్గి రూ.98,800 వద్ద వెండి ట్రేడ్ అవుతోంది. ఢిల్లీలో కిలో వెండి రూ.98,800 ఉండగా, చెన్నైలో రూ.98,800, కోల్‌కతాలో రూ.91,300 గా ఉంది. అలాగే ఆర్థిక రాజధాని ముంబైలో రూ.91,300 వద్ద కొనసాగుతోంది.

# దత్త సాయితో లవ్ స్టోరీ బయటపెట్టిన పీవీ సింధు!

**క్రిడావిభాగం :** వివాహ బంధంలోకి అడుగు పెట్టిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు.. తన లవ్ స్టోరీని బయటపెట్టింది. తొలి చూపులోనే తన భర్తపై ప్రేమ పుట్టిందని తెలిపింది. తన స్నేహితుడు, పోసిడెక్స్ టెక్నాలజీస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దత్త సాయిని పీవీ సింధు పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నెల 22న రాజస్థాన్‌లోని ఉదయ్ సాగర్ సరస్సులో వీరి వివాహ వేడుక ఘనంగా జరిగింది. అతికొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య జరిగిన ఈ పెళ్లి ఫొటోలను పీవీ సింధు సోషల్ మీడియా వేదికగా లవ్ సింబల్ ఏమోజీతో అభిమానులతో పంచుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమ లవ్ స్టోరీని పంచుకున్న సింధు.. ఓ విమాన ప్రయాణంతో తమ లవ్ జర్నీ మొదలైందని చెప్పింది. ఆ ప్రయాణంలో తొలి చూపులోనే తన భర్తపై ప్రేమ కలిగిందని తెలిపింది.

'రెండేళ్ల క్రితం అక్టోబర్‌లో మేమిద్దం కలిసి ఓ విమానంలో ప్రయాణించాం. ఆ ప్రయాణం తర్వాత మా మధ్య సాన్నిహిత్యం పెరిగింది. మేం చాలా దగ్గరయ్యాం. అదంతా లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌లా అనిపించింది. ఆ క్షణం నుంచి మా లవ్ జర్నీ మొదలైంది. చాలా తక్కువ మంది సమక్షంలో మేం నిశ్చితార్థం చేసుకున్నాం. మా జీవితంలో అత్యంత కీలకమైన ఈ ఘట్టాన్ని మేం మాములుగా చేసుకోవాలనుకున్నాం. అది చాలా భావోద్వేగభరిత క్షణం. ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం. పెళ్లి విషయంలోనూ మేం చాలా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాం. బిజీ షెడ్యూల్ ఉన్నా.. మా వివాహాన్ని ఉత్తమంగా ప్లాన్ చేసుకున్నాం.'అని సింధు చెప్పుకొచ్చింది.

పీవీ సింధువెంకట దత్త సాయిల వివాహ విందు మంగళవారం ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సమీపంలోని అన్వయ కన్వెన్షన్‌లో జరిగిన ఈ రిసెప్షన్‌కు సినీ,రాజకీయ, క్రీడా ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ కూడా పీవీ సింధు వెంకట దత్త సాయిలకు ఆశీస్సులు అందించారు. తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, సుజనా చౌదరి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డిలు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు. సినీ రంగం నుంచి మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, అర్జున్, అలీ, మృణాల్ ఠాకూర్, అజిత్‌లు ఈ వేడుకలో భాగమయ్యారు. క్రీడా రంగం నుంచి భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా, బ్యాడ్మింటన్ ప్లేయర్లు గురుసాయి దత్, ప్రణయ్, చిరాగ్ శెట్టి, చాముండేశ్వరినాథ్‌లు హాజరయ్యారు.



## రిషభ్ పంత్ పరిస్థితుల్ని గౌరవించడం నేర్చుకోవాలి

**- సునీల్ గవాస్కర్**



**క్రిడావిభాగం :** టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ పరిస్థితుల్ని గౌరవించడం నేర్చుకోవాలని దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సూచించాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమిండియా.. మూడు టెస్ట్‌లు ముగిసే సరికి 11తో సమంగా నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టెస్ట్ మెల్‌బోర్న్ వేదికగా గురువారం నుంచి ప్రారంభం కానుంది. తొలి మూడు మ్యాచ్‌ల్లో రిషభ్ పంత్ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. ఈ క్రమంలోనే అతనికి గవాస్కర్ పలు సూచనలు చేశాడు. 'రిషభ్ పంత్ పరిస్థితులను గౌరవించడం నేర్చుకోవాలి. అతని ఆట దూకుడుగానే ఉంటుంది. ఈ విషయం నేను కాదనను. కానీ క్రీజులోకి వచ్చిన తొలి అరగంట పాటు పరిస్థితుల్ని, మంచి బంతుల్ని గౌరవించాలి. పంత్ బ్యాటింగ్‌కు వచ్చే సరికి భారత్ 500 పరుగులు దాటేసి ఉంటే ఆరంభంలోనే దూకుడుగా ఆడటం తప్పు కాదు. కానీ క్రీజులోకి అడుగుపెట్టినప్పటి నుంచే ప్రతీ బంతిని బాదాలనే రీతిలో బ్యాటింగ్ చేయకూడదు.

ప్యాట్ కమిన్స్, జోష్ హజెల్ వుడ్ అతన్ని ఇబ్బంది పెట్టారు. స్కాట్ బోలాండ్ సైతం పంత్‌ను కుదురుకోనివ్వలేదు. అరౌండ్ బాల్స్‌తో ఇబ్బంది పెట్టాడు.'అని సునీల్ గవాస్కర్ చెప్పుకొచ్చాడు. మొత్తం ఐదు ఇన్నింగ్స్‌ల్లో రిషభ్ పంత్ 19.20 సగటుతో 96 పరుగులే చేశాడు.

మరోవైపు ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ మాథ్యూ హెడెన్ మాత్రం రిషభ్ పంత్ తన ఫియర్‌లెస్ గేమ్‌ను కొనసాగించాలని సూచించాడు. అటాకింగ్ గేమ్ అతనితో పాటు టీమిండియాకు కూడా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు.

'రిషభ్ పంత్‌కు నేను పెద్ద అభిమానిని. అతనో విభిన్నమైన ఆటగాడు. అతని సామర్థ్యంపై ఎలాంటి సందేహం లేదు. అతను దూకుడుగా ఫియర్ లెస్ బ్యాటింగ్ చేయాలనే నేను కోరుకుంటాను. ఎందుకంటే అతను జట్టు మెరుగైన స్థితిలో ఉన్నప్పుడే బ్యాటింగ్‌కు వస్తాడు. కాబట్టి అటాకింగ్ గేమ్ అతనితో పాటు జట్టుకు కలిసొస్తుంది. రోహిత్ శర్మలాగా బౌలర్లపై విరుచుకుపడాలి. రిషభ్ పంత్ నుంచి అలాంటి ఇన్నింగ్స్‌లను ఈ సారి ఇంకా చూడలేదు. ఆసీస్ కండిషన్స్‌కు అతను భయపడాల్సిన అవసరం లేదు. అతను ఫియర్‌లెస్ గేమ్ ఆడితేనే భారత జట్టుకు మేలు జరుగుతుంది.'అని మాథ్యూ హెడెన్ అభిప్రాయపడ్డాడు.

## రూ.26,999లకే ఐఫోన్ 15




**బిజినెస్ :** ఐఫోన్ కొనుగోలు చేసేందుకు బెస్ట్ డిస్కౌంట్ డీల్స్ కోసం ఎదురుచూస్తున్న టెక్ ప్రియులకు గుడ్‌న్యూస్ వచ్చింది. ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఊహించని ఆఫర్ ప్రకటించింది. యాపిల్ ఐఫోన్ 15పై (128GB, బ్లాక్ వేరియంట్) ఊహించని డీల్‌ను ప్రకటించింది. రూ.69,990 విలువైన ఫోన్‌ను రూ.26,999లకే అందిస్తోంది.

డీల్ డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ ఆఫర్లతో కలుపుకొని ఈ భారీ తగ్గింపు లభిస్తోంది. గతంలో ప్రకటించిన అన్ని డిస్కౌంట్ ఆఫర్ల కంటే ఇదే అత్యుత్తమంగా ఉంది. ఎక్స్ఛేంజ్‌లో గరిష్ఠంగా రూ.31,500 వరకు ఆదా చేసుకునే అవకాశాన్ని ఫ్లిప్‌కార్ట్ కల్పించింది. ఎక్స్ఛేంజ్ ఆఫర్ మినహాయింపుతో అయితే గరిష్ఠంగా 16 శాతం తగ్గింపుతో రూ.58,499కు ఫోన్ లభిస్తోంది. కాగా, ఐఫోన్ 15 సెప్టెంబర్ 2023లో విడుదలైంది.

**ఐఫోన్ 15 ఫీచర్లు ఇవే**

ఈ ఫోన్ 6.1అంగుళాల స్క్రీన్‌తో, 2000 నిట్స్ గరిష్ఠ బ్రైట్‌నెస్, క్వాడ్‌పిక్సెల్ సెన్సార్‌తో కూడిన 48 MP ప్రైమరీ కెమెరా ప్రత్యేక ఫీచర్లుగా ఉన్నాయి. ఫొటోలు హైరిజల్యూషన్‌తో వస్తాయి. యూఎస్‌బీసీ కనెక్టివిటీ ఛార్జింగ్ సదుపాయం ఉంది. దీని ద్వారా డేటా ట్రాన్స్‌ఫర్ కూడా సులభంగా చేసుకోవచ్చు. ఏ16 బయోనిక్ చిప్ సపోర్ట్‌తో పనితీరు స్పీడ్‌గా ఉంటుంది.

# పాశ్చాత్య దేశాల ప్రేక్షకులే లక్ష్యంగా సాగిన బరోజ్ త్రీడీ

## మోహన్‌లాల్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం.. మనల్ని ఈ కథలో ఎక్కడా లీనం చేయలేకపోయారు

**చిత్రం:** బరోజ్ త్రీడీ; **నటీనటులు:** మోహన్‌లాల్, మాయా రావు వెస్ట్, తుహిన్ మేనన్, గోపాలన్, తదితరులు; **ఎడిటర్:** అజిత్‌కుమార్; సినిమాటోగ్రఫీ: **సంతోష్ శివన్, సంగీతం:** మార్క్ కిలియన్; **నిర్మాణ సంస్థ:** ఆశీర్వాద్ సినిమాస్; **నిర్మాత:** అంటోనీ పెరుబవూర్; **మాటలు:** రవికుమార్; **దర్శకత్వం:** మోహన్‌లాల్; **విడుదల తేదీ:** 25-12-2024




మలయాళం సినిమాలు ఈ ఏడాది అద్భుతాలే సృష్టించాయి. అగ్ర తారల సినిమాలతోపాటు చిన్న చిత్రాలు కూడా వాస్తవికత ఉట్టిపడే కథలతో రూపొంది ప్రేక్షకుల మనసుల్ని దోచాయి. 2024 చివర్లో విడుదలైన మోహన్‌లాల్ సినిమా 'బరోజ్' కోసం అన్ని పరిశ్రమలు మరింత ప్రత్యేకంగా ఎదురు చూశాయి. అందుకు కారణం అగ్ర కథానాయకుడైన మోహన్‌లాల్ ఈ సినిమాతో దర్శకుడిగా మారడమే. ఎప్పుడో మొదలైన ఈ సినిమా కరోనా కారణంగా ఆటుపోట్లు ఎదుర్కొని ఎట్టకేలకు క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. మరి ఈ సినిమా ఎలా ఉంది? మోహన్ లాల్ దర్శకత్వ ప్రతిభ ప్రేక్షకుల్ని మెప్పించిందా? నటుడిగా ఆయన ఎలాంటి ప్రభావం చూపించారనే విషయాల్ని తెలుసుకునే ముందు కథేమిటో చూద్దాం.

కథేంటంటే: ఒకప్పుడు గోవాని పాలించిన పోర్చుగీసు రాజు డి గామా వంశానికి చెందిన నిధి చుట్టూ సాగే కథ ఇది. రాజుకి నమ్మిన బంటు అయిన బరోజ్ (మోహన్ లాల్) నాలుగు శతాబ్దాలుగా నిధిని కాపాడుతూ వస్తుంటాడు. డి గామా వారసులు వస్తే వాళ్లకి నిధిని అప్పగించాలని ఎదురు చూస్తుంటాడు. ఎట్టకేలకి రాజవంశం పదమూడో తరానికి చెందిన ఇసబెల (మాయా రావు) తన తండ్రితో కలిసి గోవా వస్తుంది. మరి ఆమెకి బరోజ్ నిధిని అప్పగించాడా లేదా? నాలుగు వందల ఏళ్లుగా బరోజ్ ఆ నిధిని ఎలా కాపాడుతూ వచ్చాడు? ఇసబెల రాజవంశానికి చెందిన యువతి అని అతడికి ఎలా తెలిసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

ఎలా ఉందంటే: హాలీవుడ్ నుంచి వస్తున్న సినిమాలను చూసి అలా మనవైన కథల్ని, పాత్రల్ని, నేపథ్యాల్ని తెరపైకి తీసుకొస్తే ఎంత బాగుంటుందో కదా అని అనుకునేవాళ్లం. ఆ తరహా సినిమాలు మన దగ్గర తెరకెక్కకపోవడంతో అనువాదమైన ఇంగ్లిష్ సినిమాల్నే చూస్తూ కాలక్షేపం చేసేవాళ్లం. అయితే కొన్నేళ్లుగా భారతీయ చిత్ర పరిశ్రమలోనూ అలాంటి సినిమాలు తెరకెక్కించే ప్రయత్నాలు జరుగుతు న్నాయి. మనవైన ఫాంటసీ, జానపద, పురాణాలను హాలీవుడ్ స్థాయిలో తెరపైకి తీసుకొస్తూ విజయాల్ని అందుకుంటున్నారు దర్శక నిర్మాతలు. ఆయా చిత్రాలు మనల్నే కాదు, ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. ఈ దశలో తన 'బరోజ్' సినిమాతో అనువాదాలుగా వచ్చే హాలీవుడ్ చిత్రాల్ని మరో మారు గుర్తు చేశారు మోహన్‌లాల్. ఇందులో మనవైన పాత్రలు, నేపథ్యం మచ్చుకైనా కనిపించవు. పోర్చుగీసు పాట, పోర్చుగీసు పాత్రలు, సంభాషణలు.. పాశ్చాత్య దేశాల ప్రేక్షకులే లక్ష్యం అన్నట్టుగా సినిమా సాగుతుంది తప్ప మనల్ని ఈ కథలో ఎక్కడా లీనం చేయలేకపోయారు మోహన్‌లాల్. పోనీ కథ చెప్పిన విధానంలోనైనా కొత్తదనం ఉందా అంటే అదీ లేదు. తాను పోషించిన పాత్రలోనూ బలం లేదు.

నిధి చుట్టూ కథ అన్నప్పుడు ఎన్నెన్నో సాహసాలతో కట్టిపడేసేందుకు అవకాశం ఉంటుంది. ఉత్కంఠని రేకెత్తించేలా సన్నివేశాల్ని మలిచేందుకు ఆస్కారం ఉంటుంది. వందల యేళ్ల ఆత్మ చుట్టూ డ్రామా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ని, కుదిరితే ఫన్ జోడించవచ్చు. కానీ ఆ ప్రయత్నం నామమాత్రంగా కూడా కనిపించలేదు. పోర్చుగీసు రాజు డి గామా, ఆయన నిధి, కట్టప్ప లాంటి బరోజ్, వారసురాలు ఇసబెల పాత్రలతో శతాబ్దాల ఫాంటసీ వరల్డ్‌ని సృష్టించాడు తప్ప అందులో బలమైన భావోద్వేగాలేమీ లేవు. త్రీడీ విజువల్స్‌పై దృష్టి పెట్టినంతగా మోహన్‌లాల్ ఈ సినిమాలోని కథాంశంపై దృష్టి పెట్టలేదన్న విషయం అడుగడుగునా స్పష్టమవుతుంటుంది. త్రీడీ విజువల్స్ చాలా చోట్ల కట్టిపడేస్తాయి. పతాక సన్నివేశాల్లోని యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి.

ఎవరెలా చేశారంటే: బరోజ్ పాత్రలో మోహన్‌లాల్ ఒదిగిపోయిన తీరు ఆకట్టుకుంటుంది. కట్టప్ప తరహా లుక్‌లో కొత్తగా కనిపించారు. ఆయన నటన పరంగా లోటేమీ చేయలేదు కానీ, పాత్రలోనే బలం లేదు. మోహన్‌లాల్ పాత్రకి తగ్గట్టే తెరపై కనిపిస్తారు. ఇసబెల పాత్రలో మాయారావు కనిపించిన తీరు బాగుంది ఆమె నటన ఫర్వాలేదనిపించే స్థాయిలో ఉంది. ఇందులో హాలీవుడ్ నటులే ఎక్కువగా కనిపిస్తారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. నిర్మాణం విషయంలో రాజీపడలేదు. సంతోష్ శివన్ కెమెరా పనితనం ఆకట్టుకుంటుంది. సంగీతం పాశ్చాత్య పోకడలకి తగ్గట్టే సాగుతుంది.

+ కథా ప్రపంచం
+ కట్టిపడేసే త్రీడీ విజువల్స్

బలహీనతలు

-కథ, కథనం
- కొరవడిన భావోద్వేగాలు

**చివరిగా:** బరోజ్... చిన్నారులకు నచ్చేలా



# చైతన్య-శోభితను చూస్తే ఎంతో ఆనందంగా ఉంది

### నాగార్జున

నాగచైతన్య- శోభిత ఇటీవలే వివాహబంధంతోటి ఒక్కటైన విషయం తెలిసిందే. తాజాగా తన కోడలు శోభితను మెచ్చుకున్నారు. ఆమె మంచి మనసున్న అమ్మాయని తెలిపారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శోభిత గురించి నాగార్జున మాట్లాడారు. 'నాగచైతన్యతో పరిచయం కంటే ముందే శోభిత నాకు తెలుసు. చాలా అందమైన అమ్మాయి. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చింది. ఆమె సినిమాలు చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. ఎప్పుడూ ప్రశాంతంగా, సంతృప్తిగా ఉంటుంది. వాళ్లిద్దరూ ఎంతో ఆనందంగా ఉన్నారు. వాళ్లని చూస్తుంటే నాకు సంతోషంగా ఉంది. చైతన్య జీవితంలోకి శోభిత వచ్చినందుకు నేనెంతో ఆనందిస్తున్నా' అని చెప్పారు. ఇక వీరి పెళ్లికి ముందు కూడా శోభితపై నాగార్జున ప్రశంసలు కురిపించారు. 'గూఢచారి' సినిమా చూసి శోభితను ఫోన్‌లో అభినందించినట్లు చెప్పారు. హైదరాబాద్ వచ్చినప్పుడు ఇంటికి రావాలని అప్పుడే ఆహ్వానించినట్లు తెలిపారు. ఆమె సినీ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుందన్నారు. గొప్పనటి, ఉన్నతమైన ఆలోచనలు కలిగిన వ్యక్తి అని ప్రశంసించారు. ఇక మొదటిసారి 2018లో నాగార్జున ఇంటికి వెళ్లినట్లు శోభిత తెలిపారు. 2022 ఏప్రిల్ తర్వాత చైతూతో తన స్నేహం మొదలైనట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు. తమ మధ్య స్నేహం ఏర్పడిన తర్వాత నూతన సంవత్సర వేడుకలకు నాగార్జున కుటుంబం తనను ఆహ్వానించిందని తెలిపారు. ఆ మరుసటి సంవత్సరం తన కుటుంబానికి చైతన్య పరిచయం చేసినట్లు శోభిత వెల్లడించారు. ఒకరినొకరు అర్థం చేసుకున్న తర్వాత ఈ ఏడాది గోవాలో పెళ్లి ప్రతిపాదన తీసుకొచ్చినట్లు ఇంటర్వ్యూలో ఆమె తెలిపారు.

# వాచ్ విషయంలో బాధపడ్డా

### మికా సింగ్



**ముంబయి:** అనంత్ అంబానీ , రాధికా మర్చంట్ వివాహ వేడుకల్లో ప్రదర్శన ఇవ్వడంపై ప్రముఖ సింగర్ మికా సింగ్ స్పందించారు. అది తనకెంతో ప్రత్యేకంగా అనిపించిందన్నారు. ఆ ప్రదర్శనకు తాను భారీ మొత్తంలో డబ్బు అందుకున్నానని తెలిపారు. కాకపోతే ఒకే ఒక్క విషయం తనని బాధించిందని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ''అనంత్ అంబానీ వెడ్డింగ్‌లో ప్రదర్శన ఇచ్చాను. అక్కడ ప్రదర్శన ఇచ్చిన వారికి భారీ మొత్తంలో డబ్బు అందజేశారు. అది ఎంత అనేది మాత్రం చెప్పను. ఆ డబ్బుతో నేను ఐదేళ్లు జీవించవచ్చు. ఎందుకంటే నాకు ఖర్చులు ఎక్కువగా ఉండవు. అయితే, తన స్నేహితులకు అనంత్ రూ.2 కోట్లు విలువైన వాచ్ ఇచ్చారు. అత్యంత ఖరీదైన ఆ వాచ్ నాక్కూడా ఇస్తారని భావించా. అది ఇవ్వనందుకు కాస్త బాధగా అనిపించింది (నవ్వులు)'' అని మికా సింగ్ సరదాగా చెప్పారు.''నా సోదరుడితో కలిసి గతంలో వివాహ వేడుకల్లో పాటలు పాడేవాడిని. అయితే దాన్ని అందరూ చులకనగా చూసేవారు. కానీ, ఇప్పుడు పరిస్థితి అలా లేదు. వివాహ వేడుకల్లో గాయనీ గాయకుల పాటలు వినేందుకు అందరూ ఆసక్తి చూపిస్తున్నారు. భారీ స్థాయిలో ఈవెంట్స్, ప్రదర్శనలతోనే డబ్బు సంపాదించాలని ఇప్పుడు లేదు. వివాహ వేడుకల్లో పాల్గొని కూడా సంపాదించవచ్చు'' అని తెలిపారు. 'అప్నా సప్నా మనీ మనీ', 'ప్యార్ కే సైడ్ ఎఫెక్ట్స్', 'జబ్ వి మెట్', 'సి కంపెనీ', 'సింగ్ ఈజ్ కింగ్', 'బాడీగార్డ్', 'సన్ ఆఫ్ సర్దార్', 'కిక్', 'స్త్రీ', 'డ్రీమ్ గర్ల్' చిత్రాల్లో ఆయన పాటలు ఆలపించారు. 'అదుర్స్', 'బలుపు', 'మిర్చి' వంటి తెలుగు సినిమాల్లోని పలు పాటలు పాడారు.

# శ్రీతేజ్ కుటుంబానికి రూ.2కోట్ల సాయం

### అల్లు అరవింద్

**హైదరాబాద్:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2కోట్ల సాయం అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన ప్రకటించారు. నటుడు అల్లు అర్జున్ తరఫున రూ.కోటి.. పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు అల్లు అరవింద్ అందజేశారు. దిల్ రాజు, పుష్ప 2 నిర్మాత రవిశంకర్‌తో కలిసి అల్లు అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. శ్రీతేజ్‌ను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలుడు తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. అనంతరం అల్లు అరవింద్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ''శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. వెంటిలేషన్ తీసేశారు. బాలుడు త్వరలోనే మనందరి మధ్య తిరుగుతాడని ఆశిస్తున్నా. న్యాయపరమైన అంశాల కారణంగా బాధిత కుటుంబ సభ్యులను కలవలేకపోతున్నా. అన్ని రకాల అనుమతులు తీసుకుని శ్రీతేజ్‌ను 10 రోజుల క్రితం పరామర్శించా. ఆ సమయంలో వెంటిలేషన్‌పై ఉన్నాడు'' అని అల్లు అరవింద్ తెలిపారు.''నిన్నటికి, ఈరోజుకి బాలుడి ఆరోగ్యం కాస్త మెరుగుపడింది. అతడి హెల్త్ కండిషన్ బాగుందని వైద్యులు తెలిపారు. బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్, 'పుష్ప 2' నిర్మాతలు, దర్శకుడు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ అడిగాం. సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తాం. హీరోలు, దర్శకులు, నిర్మాతలం కలిసి వెళ్తాం. గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుంది'' అని దిల్ రాజు తెలిపారు.ఎఫ్‌డీసీ ఛైర్మన్ అయినందుకు సీఎంను కలుస్తున్నారా? ప్రభుత్వం, సినీ పరిశ్రమ మధ్య చోటుచేసుకున్న పరిణామాల గురించి వెళ్తున్నారా? అని దిల్ రాజును మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. తాను చిత్ర పరిశ్రమ వ్యక్తినని, ఇండస్ట్రీ- ప్రభుత్వం మధ్య వారధిగా ఉండాలని సీఎం బాధ్యత ఇచ్చారని, అదే చేస్తున్నానన్నారు. అల్లు అర్జున్‌ను కలిశారా? అ ని అడగ్గా ఇంకా లేదని, త్వరలోనే కలుస్తానని చెప్పారు.






# శ్రీతేజ్ కుటుంబాన్ని పరామర్శించిన జానీ మాస్టర్

**హైదరాబాద్:** సంధ్య థియేటర్ తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ కుటుంబాన్ని కలిశారు ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్. డ్యాన్సర్స్ యూనియన్ తరఫున సాయం చేస్తామని ఆయన మాటిచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. ''శ్రీతేజ్‌ఆరోగ్యం మెరుగవుతోంది. అతడు త్వరితగతిన కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా. అతడి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పాం. ఇండస్ట్రీకి చెందిన చాలామందికి శ్రీతేజ్‌ను వచ్చి పలకరించాలని ఉంటుంది. కాకపోతే కొన్ని పరిధిలు ఉంటాయి. వాటివల్ల అందరూ వచ్చి కలవలేకపోవచ్చు'' అని జానీ అన్నారు. ''ఈ సంఘటన తర్వాత సినీ ప్రముఖులు చాలామంది అల్లు అర్జున్‌ను కలిశారు. మీరు కూడా ఏమైనా కలిశారా? లేదా ఫోన్‌లో మాట్లాడారా?'' అని విలేకరి ప్రశ్నించగా.. ''లేదు. నేను జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నా. నాకు వచ్చే సాంగ్స్ రిహార్సల్స్ చేసుకుంటూ. ఫ్యామిలీతో సమయం గడుపుతూ సంతోషంగా ముందుకు సాగుతున్నా'' అని బదులిచ్చారు. మరో ప్రశ్నకు బదులు చెబుతూ.. తన కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని ఇప్పుడు వేరే విషయాలు మాట్లాడాలనుకోవడం లేదని స్పష్టం చేశారు.



## 2024 టాలీవుడ్ బెస్ట్ 'కొత్త' నాయిక భాగ్యశ్రీ బోర్సే

# పాఠకుల ఓటు ఆమెకే!

ఈ ఏడాది టాలీవుడ్‌కి వచ్చిన కొత్త కథానాయికల్లో మీకు ఎవరు నచ్చారు? అంటూ ఈనాడు.నెట్ నిర్వహించిన పోల్‌కి మంచి స్పందన వచ్చింది. మొదటి స్థానం కోసం జాన్వీ కపూర్ , భాగ్యశ్రీ బోర్సే మధ్య గట్టి పోటీ కనిపించింది. తుది ఫలితాలు వచ్చేసరికి 'మిస్టర్ బచ్చన్' భామకే పాఠకులు అత్యధిక ఓట్లు ఓటేశారు. రెండులో జాన్వీ నిలవగా, మూడో స్థానం రుక్మిణి వసంత్‌కి దక్కింది.

**ఏ హీరోయిన్‌కి ఎంత శాతం ఓట్లు..**

భాగ్యశ్రీ బోర్సే - 35.8, జాన్వీ కపూర్ - 24.6, రుక్మిణి వసంత్ - 9.2, నయన్ సారిక - 7.5, దీపికా పదుకొణె - 6.4, అన్నా బెన్ - 3.9, మానుషి చిల్లర్ - 3.1, ప్రీతి ముకుందన్ - 2.9, తన్వీ రామ్ - 2.2, శిరీష లెల్ల - 1.9, అతిర రాజ్ - 1.1, భూమిక శెట్టి - 0.9, పంకూరి గిద్వానీ - 0.3, యశా శివకుమార్ - 0.3.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com